8-8Pg1exHMNWJQE ONG_8-8Pg1exHMNWJQE.qxd 8/8/2025 12:49 AM Page 1

ఆదివారం గత వారం రోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-8-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 188 పేజీలు: 12 వెల: 6.50

వారసునిపై స్పష్టత ఇచ్చిన ట్రంప్

ఓటర్ల జాబితా ముసాయిదాపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదు!

9లో

# చేనేతలకు 'నేతన్న' భరోసా



గురువారం అమరావతిలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

## యేటా రూ. 25 వేలు చెల్లిస్తాం

### అమరావతిలో హ్యాండ్ లూమ్ మ్యూజియం ఏర్పాటు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** చేనేతలకు ఏటా రూ.25,000 నేతన్న భరోసా పథకాన్ని సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఎన్ని కల్లో హామీ ఇవ్వకపోయినా కొత్త పథకాన్ని అమలు లోకి తీసుకుని వస్తున్నామన్నారు. చేనేతలకు ఇప్పుడున్న సబ్సిడీలు కొనసాగిస్తూనే నేతన్న భరోసా అమలు చేయనున్నారు. చేనేతల జీవన ప్రమాణాలు పెంచటంతో పాటు వారి యంత్రాలన్నీ ఆధునికీకరిస్తామని వెల్లడించారు. చేనేతలకు ఆదాయంపెంపుపై ఆలోచనచేస్తూ వచ్చింది తెలుగు దేశం ప్రభుత్వమే అన్నారు. చేనేత వైభవానికి పుట్టినిల్లు తెలుగునేల అని, ఆంధ్ర రాష్ట్రానికి చేనేత ఓ సంపద అని అభివర్ణించారు. అమరావతిలో హ్యాండ్ లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసారు.జాతీయ చేనేత దినోత్సవ కార్యక్ర మంలో గురువారం సిఎంచంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల నుంచే మగ్గాలకు 200 యూనిట్లకు,మరమగ్గాలకు 500 యూనిట్లకు ఉచితంగా ఇస్తామన్నారు. అమరావతిలో హ్యాండ్ లూమ్ మ్యూజియం ఏర్పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా చేనేతలకు ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిఎస్టీని 5 శాతం తగ్గించటం వల్ల 15 కోట్లు ఖర్చు అవుతుందని వెల్లడించారు. ప్రముఖ డిజైనర్లను సంప్రదించి వారితో చేనేతలకు మరింత అధునాతన పద్ధతిలో వస్త్రాలను తయారు చేయిస్తా మన్నారు. ప్రపంచం అంతా చేనేతకు ప్రత్యేక గుర్తింపు తెస్తామని తెలిపారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తామని దీనివల్ల వెంకటగిరి, మంగళగిరి, కాళ హస్తి, ఉప్పాడల్లో 1374 మందికి పని కలుగుతుం దని అన్నారు. అమరావతిలో హ్యాండ్ లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసారు. ఆదరణ3తో మరిన్ని కొత్త పథకాలు అందుబాటు లోకి తెస్తామని వ్యాఖ్యానించారు. మంగళగిరిలో ఇప్పటి వరకు టిడిపి గెలిచింది ఒక్కసారి మాత్రమే నని లోకేశ్‌కు వద్దని వారించినా, ఓడిన చోటనే గెలవాలని నిర్ణయించుకుని వచ్చి ఘన విజయం సాధించారని గుర్తు చేసారు. 5,000 ఓట్ల తేడాతో ఓడిపోయిన లోకేశ్ 90,000తో గెలవడం ఆనం దంగా ఉందని తెలిపారు. 3,000 కుటుంబాలకు బట్టలు పెట్టి పట్టాలు అందించిన ఘనత లోకేశ్‌దని అన్నారు. మంగళగిరిని రాష్ట్రానికే ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దాలని లోకేశ్ నిర్ణయించారని వెల్ల డించారు. స్వర్ణకారుల కార్పొరేషన్ పెట్టి ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చేశారని అన్నారు. రూ.110 కోట్ల చేనేత రుణాలు మాఫీ చేశానని ప్రకటించారు సిఎంచంద్రబాబు. ఎన్ని ఆర్థిక ఇబ్బం దులు చేనేతలకు ఎప్పుడూ అండగా ఉంటాం. జిఎస్టీని ఐదుశాతం తగించటం వల్ల 15 కోట్లు ఖర్చు అవుతుంది. ప్రముఖ డిజైన

>>2




## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

### సెప్టెంబర్ 9న నిర్వహించనున్నట్లు ఎలక్షన్ కమిషన్ వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ఉపరాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబర్ 9న ఎలక్షన్ నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. నోటిఫికేషన్ ప్రకారం, నామినేషన్లు దాఖలు చేయడానికి ఆగస్టు 21ని చివరి తేదీగా పేర్కొంది. అలాగే ఆగస్టు 22న నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా ఇటీవలే భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో జులై 21 ఉపరాష్ట్రపతి పదవీ ఖాళీ అయ్యింది. ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 ప్రకారం ఉప రాష్ట్రపతిని పార్లమెంటు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజి ఎన్నుకుంటుంది. దీని ప్రకారం 17వ ఉప రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీ పరిధిలోకి రాజ్యసభ నుంచి 233మంది ఎన్నికైన సభ్యులు, పన్నెండు మంది నామినే టెడ్ సభ్యులు, లోక్‌సభ నుంచి 543 మంది ఎన్నికైన సభ్యులు వస్తారు. ప్రస్తుతం రాజ్యసభలో 5సీట్లు ఉండగా లోక్‌సభలో 1సీటు ఖాళీగాఉంది. మిగిలిన 782 మంది ఉపరాష్ట్రపతి ఓటింగులో పాల్గొనను న్నారు. ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. విజయానికి 391 ఓట్లు అవసరం కాగా, ఎన్డీయే కూటమికి 422 మంది సభ్యుల మద్దతు ఉంది. ఆర్టికల్ 66(1) ప్రకారం ఉపరాష్ట్రపతి ఎన్నిక దామాషా ప్రాతినిధ్య విధానంప్రకారం, సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటింగు పద్ధతిలో జరుగుతుంది. ఇందుకు రహస్య బ్యాలెట్ విధానం అనుసరిస్తారు. ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల పక్కన ఓటర్లు తమ ప్రాధాన్యంతెలిపే అంకెవేయాల్సి ఉంటుంది. అక్షరాల్లో రాయకూడదు. బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్యను బట్టి ఓటర్లు తమకు నచ్చినంతవరకు ప్రాధాన్య అంకెలను బ్యాలెటుపైరాయవచ్చు. ఓటు చెల్లు బాటు కావాలంటే మొదటి ప్రాధాన్య అంకె తప్పనిసరిగా వేయాలి. మిగతా ప్రాధాన్య అంకెలు నచ్చితే వేయొచ్చు. ఈ ఓటింగుకోసం ఇసిఓటర్లకు ప్రత్యేక పెన్నులను అందిస్తుంది. పోలింగ్‌స్టేషన్‌లో సంబంధిత అధికారి బ్యాలెటుతోపాటు ఈ పెన్ను కూడా ఇస్తారు. ఓటర్లు ఆ పెన్నుతోనే మార్కింగు చేయాల్సి ఉంటుంది. మరే ఇతర పెన్ను వాడినా కౌంటింగులో ఆ ఓటును చెల్లుబాటు కానిదిగా పక్కన పెడతారు.



## 'చేనేత'లకు డిప్యూటీ సిఎం శుభాకాంక్షలు

**విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** చేనేత... మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య ఉద్యమ భావనలకు, మన కళాకారుల సృజనా త్మ టకతకు ఆలంబనగా నిలిచిందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు.'ఎక్స్' వేదిక ఆయన జాతీయ చేనేత దినోత్సవం సంద ర్భంగా చేనేత కళాకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాఖ్యానిస్తూ మన దేశంలో ఆర్థిక కార్యకలా పాలు నిర్వహించే అసం

>>2

## రాష్ట్రంలో ఎపి టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయాలు

### జనవరి 1న అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ

ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మోహన్‌కృష్ణ

**తిరుమల, ఆగస్టు 7ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు ప్రయత్నిస్తున్నామని, వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకువస్తామని ఎపి టెక్నాలజీ సర్వీసెస్‌ఛైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా టెక్నాలజీ సర్వీ సెస్ కార్యాలయాలు ఏర్పాటుచేస్తున్నామని, జనవరి 1న అమరావతిలో క్వాంటమ్ కంప్యూ టింగ్ వ్యాలీ ప్రారంభమవుతుందన్నారు. దీని వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. యువతకు ఎన్నో అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను సుభిక్షంగా పరిపాలించేందుకు సిఎం చంద్రబాబుకు శక్తిని ప్రసాదించాలని దేవదేవుడ్ని వేడుకున్నట్లు చెప్పారు.

## మాచర్ల మాజీ ఛైర్మన్‌ను వెంటనే విడుదల చేయండి

### హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు

**విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి ప్రధాన అనుచరుడు, మాచర్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిషోర్‌ను తక్షణమే విడు దల చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశిం చింది. అతడి విడుదలపై కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని వెల్లడించింది. కిషోర్ అరెస్ట్ విషయంలో పోలీసులు చట్ట నిబంధనలు ఉల్లంఘించారని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేజిస్ట్రేట్ మైండ్ అప్లై చేయలేదని ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నామంటూ హైకోర్టు ధర్మాసనం కాస్తా ఘాటుగా వ్యాఖ్యా నించింది. ఈ నేపథ్యంలోనే తురకా కిషోర్ విడుదలకు ఆదేశాలు ఇస్తున్నామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

>>2

## 20 వేల డాలర్లు చెల్లిస్తే సత్వరమే గ్రీన్‌కార్డు!




**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికాలో శాశ్వత నివాసం కోసం జారీ చేసే గ్రీన్‌కార్డులను పొందడం కోసం భారత్ సహా చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ దేశస్థులు యేళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. దానికి చెక్ పెట్టేలా ఓ షార్ట్‌కట్ మార్గాన్ని అమెరికా ప్రభుత్వం ప్రతిపాదించింది. గ్రీన్‌కార్డు కోసం 10 యేళ్లుగా ఎదురుచూస్తున్న వారు 20 వేల డాలర్లు (రూ. 17.5 లక్షలు) చెల్లిస్తే త్వరగా వారి దరఖాస్తును పరిశీలించే అవకాశాన్ని ఆ ప్రతిపాదిత బిల్లులో పేర్కొంది. డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 పేరిట ఆ బిల్లును తీసుకువచ్చారు. 'దశాబ్దాలుగా నలుగు తోన్న సమస్యకు పరిష్కారం చూపేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టాం' అని చట్టసభ సభ్యురాలు మారియా ఎల్విరా సలజార్ పేర్కొన్నారు. ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం అమెరికా యేటా.. 2,26,000 ఫ్యామిలీ ప్రిఫరెన్స్, 1,40,000 ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డులను జారీ చేసేందుకు వీలుంటుంది. ఈ 20 వేల డాలర్ల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ ద్వారా గ్రీన్‌కార్డు బ్యాక్‌లాగ్‌లను క్లియర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఉపాధి కోసం అగ్రరాజ్యానికి వెళ్లి అక్కడే శాశ్వ తంగా స్థిరపడాలనుకునే వలసదారులకు అమెరికా పర్మనెంట్ రెసిడెంట్ కార్డు (గ్రీన్‌కార్డు)లను ఇస్తుం టుంది. అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య (కోటా)లో మాత్రమే వీటిని జారీచేస్తుంటారు. మొత్తందరఖాస్తుల్లో ఒక్కోదేశానికి కేవలం 7 శాతం మాత్రమే కేటాయించాలన్నది ప్రస్తుత విధానం. అయితే ఈబిల్లులో దానిని 15 శాతానికి పెంచారు. అలాగే అమెరాకు వర్క్‌పర్మిట్‌పై వచ్చిన దంపతుల పిల్లలు (డ్రీమర్ల)కు శాశ్వత నివాసహోదా పొందడా నికి ఈ ప్రతిపాదిత బిల్లు వీలు కల్పిస్తుంది.

కాగా.. భారత్, చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి గ్రీన్‌కార్డుల కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. యేటా లక్షల మంది వీటి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. దేశాల వారీ కోటా కారణంగానే.. వారు శాశ్వత నివాస

>>2

## 'చేనేత'ల హామీలన్నీ నెరవేర్చాం!



గురువారం మంగళగిరి చేనేత దినోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

### మంగళగిరిలో ట్రిపులింజన్ సర్కార్: విద్యా మంత్రి నారా లోకేష్

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** చేనేత సోదరుల ఆదాయం రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాలవద్ద నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబుతో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా వీవర్ శాలలో ఏర్పాటుచేసిన చేనేత ఉత్పత్తుల స్టాళ్లను, వీవర్ శాలలో మగ్గాలు, చేనేత వస్త్రాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో 'జై చేనేత' అంటూ మంత్రి నారా లోకేష్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంగళ గిరి నియోజకవర్గంలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం నా అదృ ష్టంగా భావిస్తున్నా. అందరూ చేనేతలను కార్మికులని అంటారు. కానీ చేనేత కార్మికులు పడుతున్న కష్టాలు నేను నేరుగా చూశాను. దారానికి రంగు దగ్గర నుంచి మగ్గాలపై చీర నేసే వరకు అహర్నిశలు శ్రమిస్తారు. అద్భుతమైన డిజైన్స్ రూపొందిస్తారు. అందుకే నేతన్నలందరినీ నేను చేనేత కళాకారులని ఈ సంద ర్భంగా పిలుస్తున్నాను. చేనేత సోదరుల ఆదాయం రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.ప్రతిపక్షంలో ఉంటూ మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేనేత సోదరులను ప్రోత్సహించేందుకు 873 రాట్నాలు ఆనాడు ఉచితంగా అందించాం. కరోనా సమయంలో చేనేతలకు కావాల్సిన మందులు, ఆక్సిజన్ సిలిండర్లు అందించాం. చేనేతల ఇబ్బందులు స్వయంగా చూసి వీవర్ శాల ఏర్పాటుచేయడం జరిగింది.

ఈ రోజు డిజైన్‌ల దగ్గర నుంచి ఆధునిక మగ్గాలు, టాటా తనేరా సంస్థతో ఒప్పందం, మార్కెట్ లింకేజీ చేసి చేనేత సోదరులకు ఆదాయం 30 శాతం పెంచాం. కానీ నేను ఆనందంగా లేను. వారి ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. స్వర్ణకారుల కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లక్ష్మీ నరసింహ స్వర్ణకారుల సంక్షేమం సంఘం ఏర్పాటుచేశాం. వారికి ఆరోగ్య బీమా, మెరుగైన పనిముట్లు, ఆర్థికసాయం అందజేయడం జరిగింది.యువగళం పాదయాత్రలో ప్రొద్దుటూరు, ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడలో నేను చేనేత లను నేరుగా కలుసుకున్నా. వారుపడుతున్న ఇబ్బందులు చూశా. చేనేత సోదరు లను దత్తత తీసుకుంటున్నానని ఆనాడు చెప్పా. కొంతమంది ఎగతాళి చేశారు. కానీ నా ఆలోచన ఒక్కటే. చేనేత రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలి, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో నేను దత్తత తీసుకుంటానని ఆనాడు చెప్పా. ప్రభుత్వ పథకాలతో పాటు డిజైన్లు, మోడరన్ కలర్స్,

>>2

## యూరియా, డిఎపిల కొరతలేదు

### రైతులకు ఆందోళన వద్దు

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుతం రైతుల అవసరం మేరకు తగిన యూరియా,డిఎపి ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని కావున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవ సరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు.గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన వ్యవసాయశాఖ అధి కారులతో కలిసి జిల్లా కలక్టర్లతో ఈ విషయమై వీడియో సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగస్టు మాసానికి లక్షా 65వేల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో 2లక్షల 4వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అన్నారు.అదే విధంగా డిఎపి 70 వేల మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా ప్రస్తుతం 88 వేల 248 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని కావున రైతులు ఎవరూ ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సిఎస్ స్పష్టం చేశారు.

సబ్సిడైజ్డ్ యూరియాను అనగా ఎజియు (అగ్రిగ్రేడ్ యూరియా)పారిశ్రామిక అవసరాలకు అనగా ప్లైఉడ్, పెయింట్స్, యాడ్ బ్లూ మాన్యుఫ్యాక్చ రింగ్, పశు, కోళ్ల పరిశ్రమల యూనిట్లు, ఆక్వా రైతులు దానా కోసం వినియోగించేందుకు దారి మళ్లించ కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలని సిఎస్ విజయానంద్ జిల్లా కలక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించిజిల్లా స్థాయిలో వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులతో వెంటనే కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించి రైతు లకు పూర్తి స్థాయిలో ఎరువులు అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. అంతేగాక అక్కడక్కడా ఆకస్మిక తనిఖీలు




చేపట్టి యూరియా దారి మళ్లకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అన్నదాత సుఖీభవ-పియం కిసాన్‌కు సంబంధించి ఎన్పిసిఐ ఇన్ యాక్టివ్, ఇకెవైసి మ్యాపింగ్ కాని రైతుల ఖాతాలను వేగవంతంగా మ్యాపింగ్ ప్రక్రి యను పూర్తి చేసి అర్హులైన రైతులందరికీ ఆనిధులు జమ అయ్యేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలక్టర్లను సిఎస్ విజయానంద్ ఆదేశించారు. బంగారు కుటుంబాల అవసరాలకు సంబంధించిన నీడ్ అసెస్మెంట్ సర్వేను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్,అసెంబ్లీనియోజకవర్గ స్థాయిలో

>>2

## నా తండ్రి హత్యను తలపిస్తోన్న పులివెందుల హింస

### -వైఎస్ సునీత



**కడప, ఆగస్టు 7 ప్రభాతవార్త బ్యూరో :** గత రెండు రోజులుగా పులివెందులలో జెడ్పిటిసి ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలు చూస్తుంటే నాన్న వైయస్ వివేక హత్య గుర్తుకు వస్తుందని, నాడు జరిగిన విధంగానే నేడుకూడా సీన్ నడు స్తోందని వైఎస్ సునీత రెడ్డి ఆరోపించారు. నేడు వైఎస్ వివేక పుట్టినరోజు అని, పులివెందులకు వస్తుంటే మా తల్లి వద్దని హెచ్చరిస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను వైఎస్ వివేక కూతురు వైఎస్ సునీత కలిసి ఫిర్యాదు చేశారు. నాడు గొడ్డలి పోటుతో వివేకా పడి ఉంటే గుండె పోటు అని చెప్పారని, పోలీసులను బెదిరించి క్రైమ్ సీన్‌ను తుడిచేసారనీ, ఇప్పుడు ఎన్నికల్లో అదే జరుగుతుం దని అన్నారు. హత్య తరువాత లెటర్ తీసుకువచ్చి ఆదినారాయణ రెడ్డి, సతీష్ రెడ్డి, బిటెక్ రవి హత్య చేసారని సంతకం పెట్టామన్నారని, తాను పెట్ట లేదని పేర్కొన్నారు. అప్పుడు అవినాష్ రెడ్డి అనుచరులు పోలీసులను బెదిరించారని, ఇప్పుడు ఎన్నికల్లో అదే జరుగుతుందని తెలిపారు.

అప్పుడు టిడిపి నేతలు చంపారని నమ్మ బలికా రని, ఇప్పుడు సురేష్ అనే వ్యక్తి మా బంధువు అని, అతనిపై ఎంపీ అవినాష్ అనుచరులు దాడి చేయించారాని సునీత అనుమానం వ్యక్తం చేశారు. గత 6 ఏళ్లగా వివేకా హత్య కేసుపై పోరాడుతూనే ఉన్నా ఇంత వరకు దోషులకు శిక్ష పడలే దని, వివేకాహత్య సునీతా,రాజశేఖర్ రెడ్డి

>>2



## భారత్ ఎగుమతులపై ట్రంప్ సుంకాల ఎఫెక్ట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** అమెరికా విధించిన 50 శాతం అదనపు టారిఫ్‌ల కారణంగా భారతదేశంలోని ఎగుమతి రంగాలు తీవ్ర ప్రభావానికి గురవుతాయి. ముఖ్యంగా తోళ్లు, రసాయనాలు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, వస్త్రాలు, రొయ్యలు వంటి రంగాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని పరిశ్రమ నిపుణులు అంటున్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్న ట్రంప్ భారత వస్తువులపై 25 శాతం అదనపు టారిఫ్ విధించారు. దీంతో ఇప్పటికే ఉన్న సుంకాలతో కలిపి మొత్తం డ్యూటీ 50 శాతానికి చేరుకుంది. రష్యా నుంచి చమురు కొంటున్న చైనా, టర్కీ వంటి ఇతర దేశాలపై మాత్రం అమెరికా ఇలాంటి చర్యలు తీసుకోలేదు. దీని వల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెరుగుతాయి. జిటిఆర్ఐ అనే థింక్

### యుఎస్ మార్కెట్‌లో భారత్ ఉత్పత్తుల ధరలు పెరుగుదల

ట్యాంక్ నివేదిక ప్రకారం ఈ టారిఫ్‌ల వల్ల అమెరికాకు భారతదేశం నుంచి ఎగుమతులు 40-50 శాతం తగ్గే అవకాశం ఉంది. కొత్త టారిఫ్‌ల వల్ల వివిధ రంగాలపై ప్రభావం ఎక్కువ ఉంటుంది. ఆర్గానిక్ రసాయనాలు: 54 శాతం అదనపు డ్యూటీ,కార్పెట్లపై 52.9 శాతం, వస్త్రాలు (అల్లిన): 63.9 శాతం, వస్త్రాలు (నేత): 60.3 శాతం, వస్త్రాలు మేడ్ అప్స్ 59 శాతం, వజ్రాలు, బంగారం, ఉత్పత్తులపై 52.1 శాతం, యంత్రాలు, యాంత్రిక ఉపకరణాలపై 51.3 శాతం, ఫర్నిచర్, పరుపులు ఉత్పత్తులపై 52.3 శాతం ప్రభావం ఉంటుందని అంచనావేసారు. ఈ అదనపు 25 శాతం సుంకం ఆగస్టు

>>2

8-8pg2exHMNWJQE 2nd_8-8pg2exHMNWJQE.qxd 8/8/2025 12:44 AM Page 1





గురువారం జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో మగ్గంపై చీరెనేస్తున్న సిఎం చంద్రబాబు

# చేనేతలకు 'నేతన్న'భరోసా

>> ర్లను సంప్రదించి వారితో చేనేతలకు మరింత అధునాతన పద్ధతిలో వస్త్రాలను తయారు చేయిస్తాం. ట్రైస్బులిటీ విధానంతో ప్రపంచం అంతా చేనేతకు ప్రత్యేక గుర్తింపు తెస్తాం. ఎపిలో వివిధ ప్రాంతంలో క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తాం. వెంకటగిరి, మంగళగిరి, శ్రీకాళహస్తి, ఉప్పాడల్లో 1374 మందికి పని దొరుకుతుంది. అమరావతిలో హ్యాండ్ లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం. ఆదరణ 3తో మరిన్ని కొత్త పథకాలు అందుబాటులోకి తెస్తాం. ప్రొద్దుటూరులో చేనేత కుటుంబానికి చెందిన నందం సుబ్బయ్యను చంపింది వైసీపీ కిరాతకులే. స్వర్ణకారుల కార్పొరేషన్ పెట్టి ఎవరు ఊహించని విధంగా అభివృద్ధి చేశారు అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. అంతకుముందు చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం చంద్రబాబు సందర్శించారు. రాష్ట్రంలో వివిధ చేనేత క్లస్టర్లలో ఉత్పత్తి అయిన ప్రొడక్ట్స్‌ను పరిశీలన చేశారు. ఈ ఉత్పత్తులకు ఏమేర డిమాండ్ ఉందని సిఎం అడిగారు. చేనేత ఉత్పత్తులపై సెలబ్రిటీలు ఎక్కువగా మక్కువ చూపుతున్నారని డిజైనర్లు వెల్లడించారు. ఒక్క సెలబ్రిటీలకే కాకుండా సామాన్యులకు కూడా చేనేత ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావాలని సిఎం సూచించారు. చేనేత ఉత్పత్తులన్నింటినీ ఇంటిగ్రేట్ చేసి తనకు ప్రాజెక్ట్ రిపోర్ట్ ఇవ్వాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రమంతటా డబుల్ ఇంజిన్ సర్కారు నడుస్తుంటే, మంగళగిరిలో ట్రిపుల్ ఇంజన్ సర్కారు నడుస్తోందని వ్యాఖ్యానించారు. ప్రతీ ప్రజాసమస్యను బాధ్యతగా తీసుకుని పరిష్కరిస్తున్నానని, ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చి తీరుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రదర్శనశాలలో రాట్నం వడికారు.,పట్టుచీర నేత మగ్గంపై కాసేపు నేతనేశారు. మంగళగిరిలో చేనేత దినోత్సవం జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రలో చేనేతల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చానన్నారు. ప్రతిపక్షంలో ఉండగానే చేనేతల్ని సొంత నిధులతో అన్ని విధాలా ఆదుకుంటూ వచ్చానని వెల్లడించారు. చేనేతల ఆదాయం 30 శాతం పెరిగేలా అన్ని విధాలా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ఆధారపడి జీవించే సంస్థ చేనేత అని వ్యాఖ్యానించారు. తాము అధికారంలో ఉన్నా, లేకపోయినా చేనేత కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేశామని నొక్కిచెప్పారు. చేనేతల అభ్యున్నతి కోసం పోరాడిన ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని లోకేశ్ కోరారు. అందుకు సిఎం చంద్రబాబు సభా పూర్వకంగా సమ్మతిని తెలిపారు. చేనేత కార్మిక సంఘాల తరపున మహిళా నేత కార్మికులు సిఎం చంద్రబాబుకు చేనేతతో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ చిత్రాన్ని అందించారు. చేనేత జౌళిశాఖ మంత్రి సవిత. ఎపి హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండ్ క్రాఫ్ట్స్ గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్లా ,చేనేత జౌళి పరిశ్రమ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హామీలన్నీ నెరవేర్చాం!

>> స్కిల్లింగ్, మార్కెట్ లింకేజీ, ప్రమోషన్.. ఇవన్నీ చాలా అవసరం. అందుకే నేను మంగళగిరి చేనేత కళాకారుల వస్త్రాలను పెద్దఎత్తున ప్రమోట్ చేస్తున్నాం. చేనేత భరోసా కింద ప్రతి చేనేతకు ఏడాదికి రూ.25వేలు ఆర్థిక సాయం అందిస్తామని ఆనాడు హామీ ఇవ్వడం జరిగింది. స్వర్ణకారులకు ఎప్పుడూ లేనివిధంగా కార్పోరేషన్ ఏర్పాటుచేస్తామని చెప్పడం జరిగింది. సిఎం సహకారంతో ఇచ్చిన ప్రతిహామీ ఈ రోజు మేం నిలబెట్టుకున్నామని చేనేత సోదరులకు తెలియజేస్తున్నా. రాష్ట్రం మొత్తం డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తుండగా మంగళగిరిలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. కేంద్రంలో ప్రధాని మోడీ గారు, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు గారు, మంగళగిరి గల్లీల్లో మీ లోకేష్. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇంటి పట్టాలు అందజేశాం. మంగళగిరి దయ వల్ల రాష్ట్రం మొత్తానికి ఒక జోవో వచ్చింది. మొదటి విడతలో వెయ్యి కోట్ల విలువైన భూమిని 3వేల కుటుంబాలకు గౌరవంగా బట్టలు, పసుపు, కుంకుమ పెట్టి పట్టాలు అందించాం. లబ్ధిదారుల నుంచి ఒక్క గ్లాస్ నీరు కూడా తాగలేదు.
చంద్రబాబు సహకారంతో 31 కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నాం. పిఎం సూర్యఘర్ కింద ఇప్పటికే వెయ్యి కనెక్షన్లు ఏర్పాటుచేశాం. 20 వేల లక్ష్యాన్ని త్వరలోనే చేరుకుని చంద్రబాబు గారికి కానుకగా అందిస్తాం. మోడల్ లైబ్రరీ పనులు జరుగుతున్నాయి.
మంగళగిరి- తెనాలి రోడ్డు నిర్మించాం. నాలుగు లేన్ల రోడ్ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తాం. మంగళగిరి పట్టణంలో మహాప్రస్థానం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 100 స్మశానాలు అభివృద్ధి చేస్తున్నాం. విద్యాశాఖ మంత్రిగా నిడమర్రు ప్రభుత్వ పాఠశాలను లీప్ స్కూల్ గా అభివృద్ధి చేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా తయారుచేస్తున్నాం. 46 పార్కులు, స్మార్ట్ బస్ షెల్టర్స్, తాడేపల్లి వంతెన, వంద పడకల ఆసుపత్రి, తాడేపల్లి ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్, మోడల్ ఫిష్ మార్కెట్, మోడల్ రైతు బజార్, భూగర్భ డ్రైనేజ్, వాటర్, పవర్, గ్యాస్ ప్రాజెక్ట్, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, నిడమర్రు రైల్వేగేట్ దగ్గర బ్రిడ్జ్, ఎయిమ్స్, మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి చేస్తున్నాం.
దేవాలయం వద్ద ఉచితంగా రెండు ఈవీ బస్సులను నడిపిస్తున్నాం. ఇలా 200 అభివృద్ధి కార్యక్రమాలు ఒక్క మంగళగిరి నియోజకవర్గంలో మీ ఆశీస్సులతో చేపట్టడం జరిగింది. ఇవన్నీ మేం చేయగలుగుతున్నాం అంటే మంగళగిరి ప్రజలు నాపైన, మా కుటుంబంపైన చూపించిన ప్రేమ అన్నారు. చేనేత సంక్షేమం కోసం అహర్నిశలు పోరాడింది ప్రగడ కోటయ్య గారు. పద్మశాలీల గుండెల్లో ప్రగడ కోటయ్య గారు దేవుడిలాంటి వ్యక్తి. మా చేనేత కుటుంబం తరపున ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని గౌరవ సీఎం గారిని కోరుతున్నా. అంతేకాకుండా టిడ్కో హౌసింగ్‌లో 6 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న పార్క్ కు ప్రగడ కోటయ్య గారి పేరు పెట్టాలని నిర్ణయించాం.
ఆ పార్క్ లో ప్రగడ కోటయ్య గారి విగ్రహాన్ని కూడా ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. అనంతరం మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శ్రీకాకుళం నుంచి మొదలుకుని పొందూరు ఖద్దరు, ఉప్పాడ, మంగళగిరి, వెంకటగిరి వంటి ప్రాంతాల నుంచి పట్టు, నూలు దారాలతో తయారుచేసిన ఎపి చిత్రపటాన్ని సిఎం చంద్రబాబుకు అందజేశారు.

# సత్వరమే గ్రీన్‌కార్డు!

>> పత్రాల కోసం యేళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఒకపక్క కార్డు జారీపై కోటాను స్థిరంగా ఉంచగా.. డిమాండ్ మాత్రం ఏటేటా పెరుగుతూ వస్తోంది. ఇటీవల యుఎస్ సిఐఎస్ ప్రచురించిన డేటాషీట్ ప్రకారం.. అమెరికాలో ఇమిగ్రేషన్ బ్యాక్‌లాగ్‌లో 1.13 కోట్ల దరఖాస్తులున్నాయి. ఈ స్థాయి పెండింగ్‌లో ఉండటం ఓ రికార్డ్ రానురానూ ఆ సంఖ్య పెరుగుతూనే ఉంది. గతేడాది 3.3 మలియన్ల దరఖాస్తులను ప్రాసెస్ చేయగా.. ఈసారి 2.7 మిలియన్లకే పరిమితమైంది.



న్యూఢిల్లీలో గురువారం చేనేత దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రదర్శనను సందర్శించిన కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్

# వెంటనే విడుదల చేయండి

>> ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. తురకా కిషోర్‌కు ఇటీవల అన్ని కేసుల్లో బెయిల్ లభించింది. దీంతో గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. అయితే ఆ వెంటనే మరో కేసులో అతడిని రెంటచింతల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కిషోర్‌ను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారంటూ పోలీస్ వాహనం ఎదుట తురకా కిషోర్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో వారిని పక్కకు నెట్టి.. తురకా కిషోర్‌ను రెంటచింతల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడిని జైలుకు తరలించారు. కిషోర్‌పై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా టిడిపికి చెందిన పలువురు నేతలు మాచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా వారి వాహనంపై తురకా కిషోర్ కర్రతో దాడి చేశారు. అనంతరం అతడిపై పలు కేసులు నమోదవుతున్నాయి. దీంతో గత కొద్ది నెలలుగా అతడు జైలులో ఉన్నారు.

# 'సెర్ప్' సిల్వర్ జూబ్లీ వేడుకలకు భారీ ఏర్పాట్లు

## పింఛన్‌దార్లకు స్మార్ట్ కార్డులు

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ ఆర్థిక సంవత్సరం(2025-26)లో ఇప్పటి వరకు బ్యాంకులు ఆమోదించిన సూక్ష్మ రుణప్రణాళికకు సంబంధించి రూ.14,369 కోట్లు మొత్తాన్ని త్వరితగతిన ఎస్‌హెచ్‌జిలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఆశాఖ పనితీరుపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,71,264 స్వయం సహాయక సంఘాలకు సూక్ష్మ రుణప్రణాళిక ద్వారా నిధులు ఇవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, అందుకనుగుణంగా ఆయారుణాలను త్వరితగతిన అందజేయాలని సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఏర్పాటై 25 ఏళ్లు అయిన సందర్భంగా, సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వాహణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలను బలోపేతం చేసి వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు ప్రక్రియ చేపట్టాలని, అందుకు అనుభవం ఉన్న సంస్థల సేవలను ఉపయోగించు కోవాలని మంత్రి అన్నారు. మండల సమాఖ్యల కు మరియు ఎఫ్‌పిఓలకు ఇప్పటి వరకు ఇచ్చిన సామాజిక పెట్టుబడి నిధి మొత్తాన్ని ఆడిట్ చేయించి, నూరు శాతం వసూలు చేయటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దారులకు స్మార్ట్ కార్డులు, పాస్ పుస్తకం ఇవ్వటానికి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సర్ప్ సిఇఒ వాకాటి కరుణ, అడిషనల్ సీఈవో శ్రీరాములునాయుడు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# న్యాయకోవిదుడు నూతలపాటి వెంకటరమణకు మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం

## 9న అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ప్రదానం

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** భారత అత్యున్నత న్యాయస్థానం పూర్వ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం లభించనున్నది, మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సంఘం, మండలి ఫౌండేషన్‌లు ఈ అవార్డును 2025 వార్షికానికి వెంకట రమణకు ఇస్తున్నట్లు ప్రకటించాయి. ఈ నెల 9వ తేది సాయంత్రం నాలుగు గంటల నుంచి అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో జరిగే మండలి శతజయంతి ఉత్సవ కార్యక్రమంలో వెంకటరమణకు ఈ అవార్డును ప్రధానం చేస్తారు. ఈ కార్యక్రమం చివరిలో మండలి కృష్ణ రాయ నృత్య రూపక ప్రదర్శన ఉంటుందని నిర్వహకులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ పక్షాన కృష్ణా జిల్లా తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జివి పూర్ణచంద్ తెలిపారు

# ఎసిబి అధికారులకు చిక్కిన అవినీతి తిమింగలం

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎసిబి అధికారులకు భారీ అవినీతి తిమింగలం చిక్కింది. విజయవాడలో లంచం తీసుకుంటూ గిరిజన సంక్షేమశాఖ ఇఎన్‌సి శ్రీనివాస్ అధికారులకు చిక్కాడు. కాంట్రాక్టరు కృష్ణంరాజు నుంచి రూ.25 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఏకలవ్య మోడల్ స్కూళ్ల బిల్లులు చెల్లించేందుకు శ్రీనివాస్‌కు భారీగా ఇప్పటికే రూ. 25 లక్షలు చెల్లించారు. మరో 25 లక్షలు ఇవ్వాలని శ్రీనివాస్ కోరడంతో కృషంరాజు ఎసిబిని ఆశ్రయించారు. వారి సూచనల అనంతరం కృష్ణంరాజు రూ.25లక్షల మొత్తాన్ని ఇఎన్‌సి శ్రీనివాస్‌కు అందిస్తుండగా ఎసిబి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఎపి ఎసిబి చరిత్రలో రూ.25లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుబడటం ఇదే ప్రథమమని అధికారులు అంటున్నారు. గిరిజన సంక్షేమశాఖలో పైసా లేనిదే పని జరుగదనే ఆరోపణల నేపథ్యంలో ఎసిబి దాడి నిర్వహించి ఒకరిని పట్టుకుంది. దీంతో ఆ శాఖ అధికారులు, సిబ్బందిలో కలవరం ప్రారంభమైంది.

# పులివెందుల హింస

>>చేయించారని అపద్దపు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాలని, నాన్న మళ్లీ తిరిగి రారని, ప్రజలు అలోచించి నిజం బయటికి వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. వివేకా హత్య కేసు నిందితులు బయట తిరుగుతున్నారని, రేపు వివేకా పుట్టినరోజు, నా తల్లి నాకు పులివెందుల రావద్దని చెప్తుంది, న్యాయం కోసం పోరాడటానికి సెక్యూరిటీ పెట్టుకుని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. కచ్చితంగా న్యాయం గెలుస్తుందని ఆ నమ్మకం తనకు ఉందన్నారు. నా మీద, నా భర్త మీద కేసులు పెడుతున్నారని, బెదిరిస్తే భయపడే పరిస్థితి లేదని వైస్ సునీత స్పష్టం చేశారు.

# ట్రంప్ సుంకాల ఎఫెక్ట్

>> 27 నుంచి అమలులోకి రానుంది. అంతకు ముందు విధించిన 25 శాతం సుంకం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 131.8 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో 86.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 45.3 బిలియన్ డాలర్ల దిగుమతులు ఉన్నాయి. 50 శాతం టారిఫ్ వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే రంగాలలో వస్త్రాలు/దుస్తులు (10.3 బిలియన్ డాలర్లు), రత్నాలు, ఆభరణాలు (12 బిలియన్ డాలర్లు), రొయ్యలు (2.24 బిలియన్ డాలర్లు), లెదర్ వస్తువులు, పాదరక్షలు (1.18 బిలియన్ డాలర్లు), రసాయనాలు (2.34 బిలియన్ డాలర్లు), ఎలక్ట్రికల్, మెకానికల్ యంత్రాలు (సుమారు 9 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ సమాఖ్య (సిఐటిఐ) ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా భారతదేశానికి అతిపెద్ద వస్త్ర, దుస్తుల ఎగుమతి మార్కెట్ అని పేర్కొంది. ఈ టారిఫ్‌ల వల్ల ఇతర దేశాలతో పోటీ పడే సామర్థ్యం గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయపడింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్, అమెరికా మధ్య 131.8 బిలియన్ డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. ఇందులో 86.5 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు, 45.3 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు ఉన్నాయి. భారత్‌కు చెందిన వజ్రాలు, రత్నాలు, ఆభరణాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగంలో భారత్ రూ.83వేల కోట్లు విలువైన ఎగుమతులు చేసింది. 50 శాతం దిగుమతి సుంకం వల్ల భారత్‌కు చెందిన వజ్రాలు, రత్నాలు, ఆభరణాలతో ముడిపడిన పరిశ్రమలు ప్రభావితం అవుతాయి. దీంతో ఆయా పరిశ్రమలు తమ తయారీ యూనిట్లను భారత్ నుంచి దుబాయ్, మెక్సికో వంటి చోట్లకు తరలించే అవకాశాలు ఉన్నాయి. టైటాన్ కంపెనీ సైతం తమ తయారీ యూనిట్‌ను ఒక మిడిల్ ఈస్ట్ దేశానికి తరలించే యోచనలో ఉందని వినిపిస్తోంది. ఈనెల 19న అమెరికా జ్యూయెలరీ ఇండస్ట్రీస్ బృందం భారత్‌లోపర్యటించనున్నది. అలాగేభారత్‌నుంచి వెళ్లే సీఫుడ్ ఎగుమతుల్లో 40శాతం అమెరికాకేవెళతాయి. వీటి విలువ సుమారు రూ.60వేల కోట్లు. ఇపుడు 50శాతం సుంకాలకు ఎగుమతులు మందించే ప్రమాదం ఉంది. రెడీమేడ్ దుస్తులు, వస్త్రాలు వంటి వాటితోపాటు భారీ యంత్రసామగ్రి ఉత్పత్తుల ఎగుమతులు కూడా సుంకాల పుణ్యమా అని తీవ్రస్థాయిలో తగ్గిపోతాయన్న కలవరం పారిశ్రామిక వర్గాలనుంచి వ్యక్తం అవుతోంది.

# పేదరిక నిర్మూలన కోసమే 'పి-4'

## నిరుపేద కుటుంబాల దత్తతకు పారిశ్రామికవేత్తల సంసిద్ధత

**విజయవాడ ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సంపాదనతో కలగని సంతృప్తి సాయం చేస్తే కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పారిశ్రామికవేత్తలను పెట్టుబడులు పెట్టాల్సిందిగా గతంలో కోరేవాడినని.. ఇప్పుడు పెట్టుబడులు పెట్టడంతో పాటు.. పేదలకు సాయం చేయాలని కూడా అడుగుతున్నానని చెప్పారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్లో గురువారం పి4 జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పారిశ్రామిక వేత్తలతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా ఉండాలని చంద్రబాబు పారిశ్రామిక వేత్తలను కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.." పి4 కార్యక్రమం గురించి తలుచుకున్న ప్రతిసారి కొత్త ఉత్సాహం వస్తుంది. ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయగలం. నాది సుదీర్ఘ రాజకీయ జీవితం. జాతీయ స్థాయి రాజకీయాలపై ప్రభావం చూపించాం. ఉమ్మడి రాష్ట్రంలో, విభజన ఆంధ్రప్రదేశ్ లో, జాతీయ స్థాయి రాజకీయాల్లో చాలా క్రియాశీలంగా పని చేశాం. ఎన్నో సంస్కరణలు తెచ్చాను. కానీ ఎప్పుడూ కలగని తృప్తి.. పీ4 కార్యక్రమం ద్వారా కలుగుతోంది. సంస్కరణల వల్ల సమాజంలో చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు వందల కోట్ల రూపాయలతో పెట్టుబడులు పెడితే చాలు అవి అతి పెద్ద ప్రాజెక్టులుగా ఉండేవి.. కానీ ఇప్పుడు లక్షల కోట్ల రూపాయలతో ప్రాజెక్టులు వస్తున్నాయి. ఆర్థిక సంస్కరణల వల్లే ఇది సాధ్యమైంది. 1995లో టెక్నాలజీలో వచ్చిన సంస్కరణల ద్వారా ఫలాలను అందిపుచ్చుకున్నాం. ఆర్థిక సంస్కరణలను కొందరు అందిపుచ్చుకున్నారు. కొందరు వెనుకబడ్డారు. సంస్కరణలను అందిపుచ్చుకున్న వారు ఉన్నత స్థానానికి చేరారు. అంబేద్కర్, ఎన్టీఆర్, అబ్దుల్ కలాం, మోదీ వంటి వారు సామాన్య కుటుంబాల్లోనే పుట్టారు. నాతో సహా ఈ సమావేశంలో ఉన్న చాలా మంది సాధారణ మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చారు. నాడు సమాజం నుంచి ఎంతో సహకారాన్ని అందుకున్నాం.. ఉన్నతస్థితికి చేరాం. ఇప్పుడు అసమానతలు లేని సమాజం కోసం భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. ఉన్నత స్థానంలో ఉన్నవారు చేసేది చిన్న సాయమే కావచ్చు.. పేదరికంలో ఉన్నవారికి ఆ సాయమే అతి పెద్ద ఆలంబనగా ఉంటుంది." అని చంద్రబాబు చెప్పారు.

**ప్రభుత్వానిది సంక్షేమం.. పారిశ్రామిక వేత్తలది సాయం....**

మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చేసి చూపించాలనే ఉద్దేశంతో నేను కూడా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. మార్గదర్శిగా నిలిచాను. బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు నా సహచర మార్గదర్శకులతో పోటీ పడతా. ఇప్పటి వరకు 10,81,281 మంది కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. అనేక సంస్కరణలు వచ్చినా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా.. ఇంకా పేదరికం ఉంటూనే ఉంది. పేదరిక నిర్మూలన చేపట్టాలనే ఆలోచన నుంచే పీ4 పుట్టింది. ఎంత సంపాదించినా ఇక్కడే వదిలి పెట్టి వెళ్లాలి.. అందుకే గివ్ బ్యాక్ పాలసీని అమలు చేయగలిగితే...సమాజానికి మరింత మంచి చేసిన వాళ్లు అవుతారు. పేదరికంలో ఉన్నవాళ్లకి చేయూతనివ్వాలి.. వాళ్లకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి. సరైన సమయంలో గైడ్ చేయగలిగితే.. పేదరికంలో ఉన్న వాళ్లు కూడా మంచి స్థాయికి వెళ్లడానికి అవకాశం కల్పించినవారవుతారు. ప్రాధాన్యత క్రమంలో బంగారు కుటుంబాలకున్న అవసరాలపై సర్వే చేయించాం. ప్రభుత్వం వైపు నుంచి చాలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పించన్ ఇస్తున్నాం, తల్లికి వందనం ఇచ్చాం, దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక సాయం చేస్తున్నాం. అలాగే ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీ శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందివ్వనున్నాం. ప్రభుత్వ పరంగా మేం చేయాల్సిందంతా చేస్తున్నాం.. ఉన్నత స్థితిలో ఉన్నవారు కూడా బాధ్యత తీసుకుంటే దత్తత కుటుంబాల్లో స్కిల్స్ పెంపొందించడం ద్వారా వారి ఆదాయాన్ని రెట్టింపు చేయవచ్చు. బంగారు కుటుంబాలను కూడా మీ కుటుంబాలుగా భావించి సాయం చేయండి." అని చంద్రబాబు కోరారు.

**పి4లో కోస్పాన్సర్ విధానాన్ని తెస్తున్నాం.....**

సమాజంలో మనతో ఉన్నవాళ్లు.. పేదరికంతో ఇబ్బందులు పడుతూ ఉండడం మంచిది కాదు. అవనిగడ్డలో ఓ పారిశుద్ధ్య కార్మికురాలు కూడా మార్గదర్శిగా ఉండేందుకు ముందుకు వచ్చి.. ఓ పేద వృద్ధురాలిని ఆదుకునేందుకు సిద్ధమైంది. నేను ఎవర్నీ బలవంతం పెట్టడం లేదు. బాధ్యతగా చూడాలనే చెబుతున్నాను. సాయం చేయడంలో రకరకాలు ఉంటాయి.. ఇటీవల కాలంలో కొందరు టీచర్లు ముందుకు వచ్చారు. చదువు చెప్పడం ద్వారా పేదల ఎదుగుదలకు తోడ్పడతామని చెబుతున్నారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని కోస్పాన్సర్స్ విధానాన్ని తెస్తున్నాం. ఆర్థిక సాయం చేసే వారు చేస్తారు.. అలాగే విజ్ఞానాన్ని అందించే వారు కూడా ఆ దిశగా కృషి చేస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు విజన్ 2020 రూపకల్పన చేశాను. నన్ను విమర్శించారు. కానీ ఇప్పుడు ఆ విజన్ నిజమైంది. లక్ష్యంతో పని చేస్తే ఏదైనా సాధ్యం. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలుగువారిని ప్రపంచంలో అగ్రభాగాన నిలబెట్టే ఆలోచనలు చేస్తున్నాం. దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో పెద్ద ఎకానమీగా ఎదగబోతోంది. భవిష్యత్తులో భారత దేశం ఎకానమీలో నెంబర్1 స్థానంలో ఉంటుంది. అభివృద్ధి ఫలాలు అందరికి అందాలనే ఉద్దేశంతో సంస్కరణలు అమలు చేస్తున్నాం." అని చంద్రబాబు వివరించారు.

**పెద్ద ఎత్తున స్పందించిన పారిశ్రామిక వేత్తలు.**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పారిశ్రామికవేత్తలు.. అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చంద్రబాబు పిలుపుతో పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ముందుకు వచ్చారు. అలాగే ఆన్ లైన్ సమావేశంలో పాల్గొన్న ఇంకొందరు ఎన్నారైలు కూడా మార్గదర్శకరులుగా ఉంటామని సీఎంకు హామీనిచ్చారు. ప్రకాశం జిల్లాకు చెందిన మోహన్ రెడ్డి అనే పారిశ్రామిక వేత్త ఓ మండలంలో 729 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు వచ్చారు. సౌదీ నుంచి వచ్చిన రాధాకృష్ణ, మహ్మద్ అరిఫ్, సుచరిత వంటి వారు 10 కుటుంబాలను దత్తత తీసుకుంటామని చెప్పారు.

# శుభాకాంక్షలు

>> ఘటిత రంగాలలో చేనేత ఒకటి. ఈ రంగానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఊతమిస్తుంది. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో చేనేత రంగానికి లబ్ధి చేకూరేలా నిర్ణయాలు తీసుకున్నాము. నేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్తు అందిస్తుంది. సొసైటీలన్నుంచి ఆప్కో కొనేవాటికి జిఎస్టీపై 5 రాయితీ అమలు చేయడంతోపాటు త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడమైంది.
చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగాఉంటుంది. చేనేత వస్త్రాలు వినియోగంపెంచేదిశగా ప్రచార కార్యక్రమాలు పెంపొందిస్తాము. యువత వారానికి ఒకసారి చేనేత వస్త్రాలను ధరిస్తే ఆ రంగంపై ఆధారపడ్డవారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

## వారం - వర్జ్యం

**8-08-2025, శుక్రవారం (వరలక్ష్మీ వ్రతం)**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**శ్రావణ మాసం, దక్షిణాయణం**
**వర్ష ఋతువు, శుక్లపక్షం**
చతుర్దశి మ.2.08
ఉత్తరాషాఢ మ.2.24
వర్జ్యం : సా.6.23-7.59
దు.ఉ.8.24-9.15, 2) మ.12.40-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. దైవ సందర్శనం చేసుకుంటారు.

**వృషభం :** ఆర్థికలావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కర్కాటకం:** దూరపు బంధువులనుండి ఆహ్వానాలు అందుకుంటారు. కోర్టు వివాదాలనుండి బయటపడతారు.

**సింహం:** తండ్రినుండి ఆస్తి లాభం పొందుతారు. వృత్తి, వ్యాపారలు విస్తరిస్తారు.

**కన్య :** ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. ధన, వస్తు లాభాలు పొందుతారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**వృశ్చికం:** దూరప్రాంతాలనుండి అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. వస్తువుల కొనుగోలు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహకరంగా వుంటుంది. వాహనయోగం పొందుతారు.

**మకరం:** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. సోదరుల కలయిక.

**కుంభం:** సహోదర, సహోదరీ వర్గంతో మాటపట్టింపులు రాకుండా జాగ్రత్తలు పాటించండి.

**మీనం :** క్రీడారంగా యందు ఆసక్తి కలిగి ఉంటారు. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరటచెందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# యూరియా, డిఏపిల కొరతలేదు

>> స్థాయిలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు, ముఖ్యమైన ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలు, జిల్లా స్థాయి లాజిస్టిక్ ప్రణాళికలు, జిల్లాల్లో పిపిపి విధానంలో ప్రాజెక్టులు తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకోవాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 10 లక్షల 10వేల బంగారు కుటుంబాలను లక్షా 12వేల మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. బంగారు కుటుంబాలకు సంబంధించిన అవసరాలను దత్తత తీసుకున్న మార్గదర్శులు ద్వారా కల్పించేందుకు నిర్దేశించిన నీడ్ అసెస్మెంట్ సర్వే ప్రక్రియను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని సిఎస్ విజయానంద్ జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. స్వర్ణ ఆంధ్ర పి4 కు సంబంధించి ఇప్పటికే సిఎం స్థాయిలో అందరు ప్రజాప్రతిధులు, అధికారులకు పూర్తి అవగాహన కల్పించడం జరిగిందని కావున దీనిపై ఎలాంటి సందేహాలకు అవకాశం లేదని అన్నారు. అంతేగాక పి4పై సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా హేండ్ బుక్ ను కూడా రూపొందించి అందరు జిల్లా కలక్టర్లకు షేర్ చేయడం జరిగిందని దానిలోని అన్ని అంశాలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకుని ఆప్రకారం ఈకార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ హేండ్ బుక్ ను క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి కూడా షేర్ చేయాలని సిఎస్ అన్నారు.
అనంతరం జిల్లాల్లో పబ్లిక్ ప్రవేట్ పార్టనర్ షిప్పు ప్రాజెక్టులకు సంబంధించి మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో భూమిని గుర్తించాలని కలక్టర్లను సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఈప్రాజెక్టులు ఏర్పాటుకు సంబంధించి బడ్జెట్‌లో తగిన నిధులు ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందని కావున దీనిపై కలక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పట్టణ స్థానిక సంస్థల్లో ఈప్రాజెక్టులు ఏర్పాటుకు తగిన భూమిని గుర్తించి ఆవివరాలను సంబంధిత వెబ్ సైట్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈవీడియో సమావేశానికి వర్చువల్ గా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ సబ్సిడైజ్డ్ యూరియా వ్యవసాయేతర అవసరాలకు దారి మళ్లించకుండా కలక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో ఎరువుల లభ్యత గురించి వివరించారు. ఈసమావేశంలో జిల్లా కలక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్, కలెక్టర్లతో సిఎస్ వీడియో సమావేశం

**విజయవాడఆగష్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు, ముఖ్యమైన ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలు, జిల్లా స్థాయి లాజిస్టిక్ ప్రణాళిక లు, జిల్లాల్లో పిపిపి విధానంలో ప్రాజెక్టులు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్,డాక్యుమెంట్ అప్లోడ్ ఏజెంట్ స్పేస్ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహిస్తున్నారు.నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఆయా అంశాల విషయంలో కలెక్టర్లు పూర్తి స్థాయి కార్యచరణతో వ్యవహరించాలని సూచించారు.పీ4 అంశంలో మార్గదర్శకులకు విధివిధానాల వివరణ,బంగారు కుటుంబాల ఎంపిక, ఎంఎస్ఎంఇ పార్కులో ఏర్పాటు చేసే సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు,డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసే స్వయం ఉపాధి సంస్థలపై దృష్టి పెట్టాలన్నారు. రోడ్ల నిర్మాణం,మంచినీటి సరఫరా, గ్రామీణాభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఈసమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి డా.ఎన్. యువరాజ్,ఐటి శాఖ కార్యదర్శి కె.భాస్కర్,ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్ చంద్,ఏపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్,సిఇఒ ఎంఎస్ఎంఇ విశ్వ, ప్రణాళికా శాఖ జెఎస్ అనంత శంకర్ పాల్గొన్నారు.వర్చువల్ గా రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్ధాలను అరికట్టేందుకు 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' విజయవంతం

### డిజిపి హరీష్‌కుమార్ గుప్తా



**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యా సంస్థల పరిసరాల్లో, 100 మీటర్ల పరిధిలో నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా చేపట్టిన "ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్" విజయవంతమైందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. గివీనీని। మార్గదర్శకాలకు అనుగుణంగా, ఈగల్ మరియు పోలీసుశాఖ సంయుక్త కార్యాచరణలో జూలై 8వ తేదీ నుంచి 12వ తారీఖు వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ ప్రత్యేక డ్రైవ్లో గంజాయితో పాటు నిషేధిత మత్తు మందులు, గుట్కా, పొగాకు ఉత్పత్తుల మరియు ఆరోగ్యానికి హానికరమైన మత్తు పదార్థాల విక్రయాలపై దృష్టిపెట్టి పెద్ద ఎత్తున తనిఖీలు జరిపి కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూలై 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఈగల్ మరియు పోలీస్ శాఖ చేపట్టిన సంయుక్త కార్యాచరణలో (04.08.2025 నాటికి) 16,806 షాపులను తనిఖీ చేసి 25,807 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. రూ.40,62,092 జరిమానాలు విధించడం జరిగిందన్నారు. కేసుల నమోదులో 3,468 కేసులతో విశాఖపట్నం మొదటి స్థానంలో, కాకినాడ 3,115 కేసులతో ద్వితీయస్థాయంలో, 4,015 కేసులతో ప్రకాశం జిల్లా తృతీయస్థానంలో ఉందన్నారు. (ఫైన్ల ఆధారంగా) ఆపరేషన్ "సేఫ్ క్యాంపస్ జోన్" ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని డీజీపీ పేర్కొన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల అమ్మకాలపై ఆంక్షలు కొనసాగిస్తూ, ఇంటెలిజెన్స్ ఆధారంగా రానున్న రోజుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నామన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా వారిని రక్షించే ఉద్దేశ్యంతో ఈ చర్యలు మరింత పటిష్టంగా కొనసాగనున్నాయని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ ఆపరేషను ఐజీపీ ఈగల్ నేతృత్వంలో, జిల్లాల వారీగా ఎస్పీలు మరియు పోలీసు కమిషనరేట్లలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారన్నారు. ప్రతి చర్యను వీడియో ద్వారా డాక్యుమెంట్ చేయడం, ఎన్‌డిపిఎస్ యాక్ట్ 1985, బీఎన్ఎస్ఎస్ 2023, బిఎస్ఏ 2023 చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగిందని డీజీపీ తెలిపారు. నమోదైన కేసులపై సమగ్ర విచారణ, విద్యాసంస్థల సహకారంతో హాట్ స్పాట్లపై నిరంతర నిఘా పెట్టనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసు శాఖ చేపట్టిన ఆపరేషన్ "సేఫ్ క్యాంపస్ జోన్" భవిష్యత్తులో కూడా కొనసాగుతుందని డీజీపీ తెలిపారు.

## మంచుతెరలతో తిరుమల

**తిరుమల,ఆగస్ట్7ప్రభాతవార్తప్రతినిధి:** వరుసగా మూడురోజులు తిరుమలలో కురిసిన భారీ వర్షాలతో గురువారం వేకువజామున మంచు తెరలు దేవదేవుని ఆలయాన్ని తాకాయి. తిరుమల అంతా మంచుతో ప్రకృతి అందాలను తలపింపజేసింది. ఊటీ,సిమ్లా,కాశ్మీర్‌ను తలపించేలా ఈ మంచు ఉందని భక్తులు పరవశులై సెల్ఫీలతో ఆనందం చెందారు. శేషాచలం కొండల్లో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో అద్భుతదృశ్యం కనువిందుచేసింది.

## చేనేతకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించేందుకు కృషి

### - రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ క్రాఫ్ట్స్ గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్లా



**విజయవాడ, ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** చేనేతకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించేందుకు కృషి చేస్తానని హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండ్ క్రాఫ్ట్స్ గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్లా అన్నారు. తెలుగు వారి సాంప్రదా యంలో పెళ్లి చీర చాలా ప్రత్యేకమైనదని, అదే విధంగా తన పెళ్లి చీర కంచి పట్టుచీర అని పేర్కొన్నారు. తాను ఇప్పటి వరకూ రెండు, మూడు చేనేత క్లస్టర్లకు వెళ్లి పరిశీలించానని అన్నారు. రాష్ట్రంలోని అన్ని క్లస్టర్లను పరిశీలిస్తానని వెల్లడించారు. ఆ మేరకు సుచిత్ర ఎల్లా ఒక ప్రకటన చేస్తూ అనంతరం వారికి కావలసిన సౌకర్యాలు తెలుసుకుని, చేనేత వస్త్రాల స్కేల్ పెంచి బ్రాండింగ్ చేయాలని అభిప్రాయపడ్డారు. చాలామంది చీరలు చాలా ధర ఎక్కువగా ఉంటుందని అంటున్నారని, కాబట్టి వాటిని కూడా పరిశీలించాలని తెలిపారు. వివిధ రకాల చీరలు, చేనేతపై నేటి తరానికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలా చేస్తే హస్తకళలను అభివృద్ధి చేయొచ్చని సుచిత్ర ఎల్లా చెప్పారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే కాటన్ షర్ట్‌లు, డ్రెస్‌లు ఇవ్వాలని, తద్వారా వారు కూడా వాటిపై ఇంట్రస్ట్ చూపిస్తారని సుచిత్ర ఎల్లా అన్నారు. ప్రతి చేనేత వస్త్రం రెండు, మూడు కుటుంబాలకు జీవనాధారమని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. చేనేతలో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. చేనేతని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, మన దేశ వస్త్ర నైపుణ్యం, నాణ్యతను ప్రపంచానికి చూపించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంతో పాటు పలువురు ఎన్జీఓలు కూడా ఇందుకోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చేనేతను మరింతగా ముందుకు తీసుకెళ్తానని సుచిత్ర ఎల్లా స్పష్టం చేశారు. నేటి తరంలోని వారికి సైతం చేనేత నైపుణ్యాన్ని నేర్పించాలని సూచించారు. స్కిల్ డెవలప్ మెంట్ కోర్సు లలో భాగంగా చేనేతను కూడా ట్రైనింగ్ ఇవ్వాలని, అలా చేస్తే పలువురికి ఉపాధి కల్పించొచ్చని అన్నారు. ప్రస్తుతం చేనేత వస్త్రాలను రకరకాల డిజైన్లలో తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. తద్వారా నేటి యువతను సైతం ఆకట్టుకోవచ్చని తెలిపారు. వివిధ రకాలైన ప్రొడక్ట్స్ రూపంలో చేనేత వస్త్రాలను తయారు చేస్తే వీటి మార్కెట్‌ను పెంచొచ్చని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు ఆర్థికంగా ఆదుకోవాలని, లోన్లు ఇవ్వడంతో పాటు వాటిని ఏ విధంగా రీపేమెంట్ చేయాలి అనే దానిపై నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అదే విధంగా మౌలిక సదుపాయాలు సైతం మనం కల్పించి ఇస్తే వారు చేనేత పనిని చేసుకుని వెళ్లిపోతారని, తద్వారా వారిపై భారం తగ్గుతుందని తెలిపారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో దేవాలయాల అభివృద్ధి : వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



అలఘునాధస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులు

**ఆత్మకూరు, ఆగస్టు7,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పాలనలో దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రఎడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలో వెలసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ అలఘునాధస్వామి వారి మహా కుంబాభిషేకంలో వారు పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు , సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆలయ శిఖరానికి అభిషేకం చేసి అలఘునాధస్వామి ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కళ్యాణ మండపంలో జరిగిన శ్రీదేవి భూదేవి సమేత అలఘునాధస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు 800ఏళ్ళ చరిత్ర ఉన్న శ్రీ అలఘునాధస్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నా మన్నారు. స్వామివారి పునః ప్రతిష్ట చేసి 12ఏళ్ళు అవుతున్న సందర్భంగా మహాకుంబాభిషేకం నిర్వహిస్తున్నా మన్నారు. రాష్ట్రంలో ఆలయాల పవిత్రత, హిందూ ధర్మ రక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సిఎం చంద్రబాబు అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాలు అభివృద్ధికి100కోట్లు కేటాయించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకఉ ఉచిత బస్సు ప్రయాణం కల్పించున్నారని ఇప్పటికే తల్లికి వందనం , అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అటు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకఉ ఆశీస్సు లు అందాలన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న అలఘునాధస్వామి ని దర్శించుకోవడం సంతోషంగాఉందన్నారు. ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఆలయం అభివృద్ధి చెందిందన్నారు. అలఘునాధ స్వామి ఆశీస్సు లతో జిల్లాతోపాటు ఆత్మకూరు ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి దంపతులు, టిడిపఇ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కంచి పరమేశ్వరరెడ్డి దంపతులు,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గోవులు మృతి

**వింజమూరు (నెల్లూరు) , ఆగష్టు 7, ప్రభాతవార్త** వింజమూరు మండలం ఊటుకూరు పంచాయతీ పరిధిలోని తక్కెళ్ళపాడు, జువ్విగుంటపాలెం గ్రామ రైతులకు చెందిన ఒక గేదె రెండు ఆవులు పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు భాదితులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి పిడుగు పడినట్లు వారు తెలిపారు. ఉదయాన్నే మేత కోసం పొలానికి తోలుకెళ్ళి మధ్యాహ్నం ఇంటికి తోలుకొని వచ్చి ఇంటి ముందు చెట్టుకు కట్టేసినట్లు వారు తెలిపారు. అలాగే జువ్విగుంటపాలెం సమీపంలోని వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ఉన్న రెండు ఆవులు పిడుగుపాటు గురైనట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. తక్కెళ్ళపాడు కు చెందిన కాకి కన్నయ్యకు చెందిన గేదె సుమారు 80 వేల రూపాయలు విలువ చేసేదిగా ఉందని అది మృతి చెందడంతో జీవనాధారం కోల్పోయినట్లు బాధితులు వాపోయారు. అనుకోకుండా అప్పటికప్పుడు కురిసిన వర్షానికి నా గేదె బలైపోయిందని కన్నయ్య వాపోయాడు. ప్రభుత్వం పరిశీలించి ఆదుకొని జీవనాధారం కల్పించాల్సిందిగా కోరుకుంటున్నాడు.


## పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే పి 4 లక్ష్యం

### - బంగారు కుటుంబాలను ఎంపిక చేసేందుకు చర్యలు : కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 7, ప్రభాతవార్త** జిల్లాలో పి4 కార్యక్రమం ద్వారా మార్గదర్శి, బంగారు కుటుంబాలను ఎంపిక చేసేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి స్వర్ణాంధ్ర పి4పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్లోని శంకరన్ హాలు నుంచి కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా సీఎం పి4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఈ దిశగా పేదరికంలో ఉన్న బంగారు కుటుంబాలను, మార్గదర్శిలను ఆగస్టు 15లోగా ఎంపిక చేయాలని సిఎస్ సూచించారు. సుమారు 15 లక్షల బంగారు కుటుంబాలను ఎంపిక చేయడమే లక్ష్యంగా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు జిల్లాలో బంగారు కుటుంబాలు, మార్గదర్శిలను ఎంపికను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో 18870 బంగారు కుటుంబాలను, సుమారు 5 వేల మంది మార్గదర్శిలను ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల బంగారు కుటుంబాలను ఎంపిక చేయడమే లక్ష్యంగా అందరిని సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్, సిపిఓ నరసింహారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, పరిశ్రమలశాఖ జిఎం మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే డంపింగ్ యార్డుతో కుటుంబాలకు పొంచి ఉన్న ప్రమాదం!



రైల్వే క్వార్టర్స్‌లలో మోకాళ్ల వరకు వర్షపునీరు,నీటిలో కొట్టుకొచ్చిన విషసర్పాలు,పురుగులు

**గుంతకల్లు రైల్వే, ఆగష్టు 7,ప్రభాతవార్త** ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైల్వే యంత్రాంగం నిర్లక్ష్యం, కాలనీల నిర్వహణలో లోపాలను కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది.దక్షిణ మధ్య రైల్వే అనంతపురం జిల్లా గుంతకల్లులో గంటపాటు వర్షం కురిస్తే చాలు రైల్వే కాలనీలు, స్టేషన్‌లలో వర్షపునీటితో జలమయమవుతాయి. రైల్వేలోతట్టు ప్రాంతాలు,స్లమ్ ఏరియా ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్,రైల్వే ఆసుపత్రి,అంబేద్కర్ పార్క్,డీజిల్ షెడ్‌లలో వర్షపునీటితో వరద ప్రవాహానికి తలపించే విధంగా వర్షపునీరు కాలనీలలో,క్వార్టర్స్ లలో ప్రవహిస్తూ,క్వార్టర్స్ లలో మోకాళ్ల వరకు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలలో వర్షపునీరు వెళ్లేందుకు డ్రైనేజీ కాలువలున్నా డీజిల్ షెడ్ రోడ్డు పక్కన నిరుపయోగమైన వేస్టేజీని డంప్ చేయడంతో, వర్షపునీరు రోడ్డుపక్కనున్న కాలువలకు వెళ్లలేకపోవడంతో పరిస్థితిని ప్రత్యేకంగా చూసిన స్థానికులు భయాభ్రాంతులకు గురయ్యారు. ఎక్కడెక్కడినుంచో క్వార్టర్స్‌లను పగులగొట్టిన మట్టి, వేస్టేజీని కాలనీల మధ్య డంప్ యార్డ్‌లా ఉపయోగించుకోవడంతో మట్టి దిబ్బలు,కుప్పల కారణంగా వర్షపునీరు ముందుకు వెళ్లేందుకు మార్గంలేక రోడ్లపైనే నిలిచిపోయింది. వరదనీటిని తలపించే విధంగా ప్రవహిస్తూ ఉండటంతో వర్షం తగ్గిన ఉదయం వరకు కాలనీలలో ఎగురు ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపునీరు లోతట్టు ప్రాంతాల్లోని రైల్వే కాలనీలలో నది ప్రవాహాన్ని తలపించే విధంగా వర్షపునీరు రోడ్లపై కాలనీలలో ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## కేంద్రం, రాష్ట్రాల్లో అధికారం చేపడతాం: బిఎస్‌పి నేతల ఉద్ఘాటన



**విజయవాడ, ఆగస్టు 7, ప్రభాతవార్త :** రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాధికారం బిఎస్‌పి చేపట్టడం తథ్యమని బిఎస్‌పి పార్టీ స్టేట్ సెంట్రల్ కోఆర్డినేటర్ అతర్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతంలు ఉద్ఘాటించారు. విజయవాడలో గురువారం బందెల గౌతం కుమార్ అధ్యక్షతన జరిగిన బిఎస్‌పి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథి అతర్‌సింగ్ తో కలిసి ప్రసంగిస్తూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో, బహుజనులకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రత్యామ్నాయంగా బిఎస్‌పి అధికారం చేపట్టడానికి ఇప్పటినుండే నాయకులు, కార్యకర్తలు బూత్‌స్థాయి నుండి పటిష్టంగా పార్టీ నిర్మాణం చేపట్టాలని కోరారు. బహుజనులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2న హైదరాబాద్‌కు జాతీయ సమన్వయకర్త ఆకాష్ ఆనంద్ హాజరయ్యే సదస్సుకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జానకి ప్రసాద్, ప్రధాన కార్యదర్శులు బచ్చలకూర పుష్పరాజు, గుమ్మాపు చిత్రసీను, కోశాధికారి పెదపెంకి శివప్రసాద్, కార్యదర్శి చిందనూరు నాగరాజు లు పాల్గొని ప్రసంగించారు.

## జిల్లా ఖనిజ ఫౌండేషన్ (డిఎంఎఫ్) మార్గదర్శకాలను సవరించిన ప్రభుత్వం

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లా ఖనిజ ఫౌండేషన్ (డిఎంఎఫ్) మార్గదర్శకాలను ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు గనులు, భూగర్భవనరులశాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గేజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కళ్యాణ్ యోజన (పిఎంకెకెకెవై) మార్గదర్శకాలను అనుసరించి, 2016లో డిఎంఎఫ్ మార్గదర్శకాలను సవరిస్తూ గనులు, భూగర్భవనరుల శాఖ డైరెక్టర్ రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన రూల్ 2, 5, 9, 10, 15లకు సవరణలు చేయడంతోపాటు, రూల్ నెంబరు 30ను అదనంగా చేర్చినట్లు వెల్లడించారు. దీనిలో ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్, ఫిర్యాదుల పరిష్కారం, నిబంధనలు అతిక్రమిస్తే తీసుకునే చర్యలు, రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ తదితర అంశాలను గతంలో ఉన్న నియమాలకు అదనంగా చేర్చారు.

# తిరుమల సమాచారం

## మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



**తిరుమల,ఆగస్ట్7ప్రభాతవార్తప్రతినిధి:** పలు రకాలుగా వైఖానస ఆగమోక్తంగా జరిగే సేవలు, నిత్యకైంకర్యాల్లో తెలిసీ తెలియక జరిగిన దోషాలు నివృత్తికోసం జరిపించే పవిత్రోత్సవాలు గురువారం మధ్యాహ్నం మహాపూర్ణాహుతితో ముగిశాయి. గోవిందుని ఆలయంలోపల సంపంగిప్రాకారంలో మూడవరోజు గురువారం ఉదయం శ్రీదేవిభూదేవి మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు యాగశాలలోహోమాలు వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు,పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరిజలంతదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఉభయదేవేరులతో మలయప్పస్వామి ఆలయ నాలుగు మాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయ్యంగారు, చిన్నజీయ్యంగారు,టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం , ఆలయ పేష్కార్ రామకృష్ణ, విజిలెన్స్ వింగ్ విఎస్ఒ ఎన్టీవి వెంకటరామ్‌కుమార్, విఎస్ఒ అల్లం సురేంద్ర,ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు శ్రావణపౌర్ణమి గరుడసేవ



**తిరుమల,ఆగస్ట్ 7ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన శ్రావణపౌర్ణమి ,వరలక్ష్మీవ్రతం విశేషమైన రోజున శుక్రవారం (నేటి)సాయంత్రం తిరుమలలో గరుడసేవ జరగనుంది. విశేషాభరణాల అలంకృతుడై మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించనున్నారు.ప్రతినెలా పౌర్ణమిరోజు తిరుమల ఆలయ మాఢవీదుల్లో గరుడవాహనసేవ నిర్వహించడం పరిపాటి. వచ్చేనెలలో సెప్టెంబర్ 7వతేదీ ఆదివారం పౌర్ణమి వేళ ఓ సారి మాదిరి గరుడసేవ, తిరిగి రానున్న నెలలో 28వతేదీ శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న గరుడవాహనసేవ జరగనుంది.

## నేడు పద్మావతి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం

**తిరుమల,ఆగస్ట్7ప్రభాతవార్తప్రతినిధి:** శ్రావణమాసం పౌర్ణమిరోజు (నేడు)శుక్రవారం తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానంవరలక్ష్మీవ్రతాన్ని నిర్వహిస్తోంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, సౌభాగ్యం కానుకలు సిద్ధంచేసింది. ఆర్జితసేవగా ముందుగానే ఆన్‌లైన్‌లో 150 టిక్కెట్లు,,ఆఫ్‌లైన్‌లో 150 టిక్కెట్లు జారీచేసింది. నేటి ఉదయం అమ్మవారి ఆలయంలోని ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుచేసి ఆలయఅర్చకులు శాస్త్రోక్తంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీసహస్రనామార్చన, అష్టోత్తరశతనామావళి నిర్వహిస్తారు. అమ్మవారిని తొమ్మిదిగ్రంధులతో ఒక్కో గ్రంధిని ఒక్కో దేవతకు గుర్తుగా ఆరాధిస్తారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా వ్రతమండపాన్ని సంప్రదాయ పుష్పాలు, పదిరకాలు 20వేల కట్‌ఫ్లవర్స్‌తో ,పండ్లతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు సామూహిక వరలక్ష్మీవ్రతం ఆలయ అర్చకులు నిర్వహించనున్నారు. నేటి సాయంత్రం స్వర్ణరథంపై పద్మావతిదేవి తిరుమాఢవీధుల్లో ఊరేగనున్నారు.

## ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు విరాళంగా రూ.కోటి అందజేసిన దాత



**తిరుమల,ఆగస్ట్7ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. తాజాగా గురువారం ఉదయం శ్రీవేంకటేశ్వరప్రాణదానట్రస్ట్‌కు రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలసి దాత సికెపిసి ప్రాపర్టీస్ ఎండి చిరాగ్‌పురుషోత్తం కోటి రూపాయలు విరాళాలను డిడి రూపంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. ఎందరో పేదరోగులకు ఎస్వీప్రాణదాన ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యాన్ని అందిస్తున్న విధానం దాత కొనియాడారు. గుండె,మూత్రపిండాలు, మెదడు తదితర ప్రాణాంతక వ్యాదులతో బాధపడుతున్న అనేకమంది పేదలకు ఉచిత సేవలందిస్తున్న ఇలాంటి గొప్పట్రస్ట్‌కు తనవంతుగా విరాళాలివ్వడం మనసు సంతృప్తిగా ఉందన్నారు. దాతను ఛైర్మన్ బిఆర్‌నాయుడు అభినందించారు.

## బ్రహ్మోత్సవాలకు మహారధానికి రంగులు

**తిరుమల,ఆగస్ట్7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామికి సెప్టెంబర్ 23నుండి మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు కొండంతా సర్వాంగసుందరంగా అలంకరణలతో తీర్చిదిద్దుతున్నారు. ఈ పనుల్లో బాగంగా బ్రహ్మోత్సవ వాహనసేవల్లో ఏడవరోజు ఉదయం జరిగే రథోత్సవానికి అవసరమైన మహారధాన్ని సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే రథోత్సవం జరుగుతుంది. ఆ తరువాత రథమండపంలో ఈ మహారధాన్ని రేకుల షెడ్డుల్లో ఉంచడం పరిపాటి. ఇప్పుడు మరో నెలరోజుల్లో మొదలుకానున్న బ్రహ్మోత్సవాలకు అనుగుణంగా రథోత్సవానికి రథాన్ని పరిశీలించి చిన్నచిన్న మారమ్మతులు, రంగులు వేయడం పనులు చేపట్టనున్నారు. రేకులషెడ్డును తొలగించిన సిబ్బంది ఎండవకు, వానకు చెక్కుచెదరకుండా తార్‌పాల్ కవర్‌తో కప్పారు. అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు,గ్యాలరీలు నిర్మాణం, ఆలయానికి ఎదురుగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు,ఆస్థాన మండపం వద్ద భక్తులు వానకు తడవకుండా ఉండేలా షెడ్లు నిర్మాణం జరుగుతోంది.

## రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిచెందాలి : మంత్రి అనగాని



**తిరుమల, ఆగస్ట్7ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం లేని సమాజాన్ని చూడాలని, ఇందుకు అనుగుణంగా పి4 అమలు, మహిళలు ఆర్థికంగా అభివృద్ధికి స్త్రీశక్తి పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని స్తాయని రాష్ట్రరెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పథకాలు పారదర్శకంగా అమలయ్యేలా చూస్తున్నారన్నారు. గురువారం ఉదయం తిరుమల ఆలయంవద్దకు వచ్చిన మంత్రి అనగానికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, రిసెప్షన్ డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వాగతం పలికారు. ఆలయంలోపల స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 13న ఖాళీప్లాస్టిక్ టిన్‌ల వేలం



**తిరుమల,ఆగస్ట్7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి చెందిన తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు ఇతర అనుబంధ ఆలయాల్లో జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ ప్లాస్టిక్ టిన్‌లను ఈనెల 13వతేదీ ఇ వేలం వేస్తున్నట్లు టిటిడి తెలిపింది. రాష్ట్రప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ వేలం వేయనున్నారు. వివరాలకు తిరుపతిలోని మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబర్‌కుగానీ, డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు, తిరుమల.ఒఆర్‌జి వెబ్‌సైట్‌లో చూడవచ్చని టిటిడి తెలిపింది.

ఈ ప్రపంచంలో ఓ పేదవాడు ఆధ్యాత్మికంగా ఎదగడానికి ఉన్న అవకాశం, ఆర్థికంగా ఎదగడానికి లేదు.

-జార్జి వాషింగ్టన్

# భారత్‌కు బలనిరూపణ తప్పదా?

**భారత్ స్పష్టమైన స్టాండ్ ప్రతి సమస్యపై తీసుకోవాల్సిన ఆగత్యం ఇప్పుడు ఏర్పడింది. చైనా, అమెరికాల పద్మవ్యూహంలో చిక్కుకోకుండా భారత్ సొంత నిర్ణయాలు ప్రస్ఫుటించేలా దక్షిణ ఏషియా, తూర్పు ఏషియా దేశాలతో సమిష్టి నాయకత్వం తలపెట్టి చైనా, పాకిస్థాన్ ఎత్తుగడలను త్రిప్పి కొట్టే ప్రయత్నాలు చేయక తప్పదు. నాయకత్వం కావాలని నెత్తిన వేసుకోవాల్సిన అవసరం లేదు. కానీ భారత్ జనాభా దృష్ట్యా చైనాను అధిగమించి మొదటిస్థానానికి వచ్చింది. ఆర్థికంగా ప్రగతి సాధించిన మొదటి అయిదు దేశాలలో భారత్ ఉంది. అవసర మొస్తే తొణక్కుండా మిలటరీ పరంగా బలాన్ని ప్రదర్శించే శక్తియుక్తులున్నాయని ఇప్పటికే నిరూపించుకున్న ఈ తరుణంలో ఏఅవకాశం జారవిడవకుండా తననుతాను కుట్రలూ కుతంత్రాల నుంచి రక్షించుకోవడానికి మరింత బలమైన దేశంగా, ఇతర దేశాలను ప్రభావితం చేసేవిధంగా ఉండకతప్పదు. అప్పుడే భారత్ సార్వభౌమాధికారాన్ని ప్రజాస్వామ్యాన్ని నిలుపుకోగలదు.**



రావులపాటి సీతారాం రావు

అంతర్జాతీయ వాస్తవ పరిస్థితులు నిశితంగా పరిశీలించిన తర్వాత భారత్ ప్రస్తుతం ఆర్థిక వ్యవహారాల మాట అటుంచి భౌగోళికంగా స్థిరంగా తలెత్తుకొని ప్రపంచ రాజకీయ పటంలో వైభోవోపేతమైన కార్యాచరణతల పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఆపరేషన్ సిందూర్ ముందు భారత్‌కు అనుకూలంగా అంతర్జాతీయ పరిస్థితులు ఉన్నాయని చెప్పలేని స్థితి. టెర్రరిస్టులను బాహాటంగా ఖండించడానికి పూనుకోలేని అగ్రరాజ్యాలు (యూరప్ దేశాలతోసహా) ఇప్పుడు పాకిస్థాన్, చైనా కుటిల దాడులను ఉగ్రవాదుల వెనుక ఉండి చేయించిన దాఖలాలు నెమ్మది నెమ్మదిగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. అమెరికన్ ప్రసిడెంట్ ట్రంప్ కప్పదాటు వ్యవహారాలనుఅన్ని దేశాలూ గమనించే స్థితి నెలకొంటున్నది. పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, అమెరికన్ ప్రసిడెంట్ ట్రంప్‌తో జరిపిన అట్టహాసపు లంచ్ భోజనం 'పహల్గాం దాడి మేము చేసిందే' అని ఫారిన్ టెర్రరిస్టు ఆర్గనైజేషన్‌గా ఏర్పడిన అమెరికన్ డిజిగ్నేటెడ్ ది రిసిస్టెన్స్ ఫ్రంట్ (టి.ఆర్.ఎఫ్) ప్రకటించటంతో ప్రాధాన్యత కోల్పోయింది. యు.ఎన్. సెక్యూరిటీ కౌన్సిల్ మానిటరింగ్ టీమ్ కూడా పహల్గాం దాడి టి.ఆర్.ఎఫ్ చేసిందే అని రిపోర్టు ద్వారా ప్రకటించడంతో అంతర్జాతీయంగా దౌత్యపరమైన ప్రాముఖ్యత, భారత్ తిరిగి సంపాదించుకున్నట్లయింది. నిజానికి భారత్‌కు ట్రంప్ ఎన్నో అవరోధాలు సృష్టించాడు. ఒకవైపు భారత్‌తోస్నేహం ఉందని నటిస్తూనే, రష్యా వల్ల చమురు ఖనిజాల విషయంలో లాభం పొందుతూనే రష్యాకు భారత్ దగ్గరగా జరుగుతున్నదన్న అనుమానాలు అంతర్జాతీయంగా సృష్టించడానికి విఫల ప్రయత్నాలు చేశాడు. డోనాల్డ్ ట్రంప్ ఎత్తుగడలు అడ్డగోలుగా అనిపిస్తాయి కానీ ట్రంప్‌కు తన ఎత్తుగడలూ, వ్యూహాలూ ప్రతివ్యూహాల పట్ల పూర్తి అవగాహన ఉంది. తనదేశం పరాయి దేశాల మీద ఆధారపడి ఉండటం ఒకప్పుడు లాభించింది. అమెరికాను సుసంపన్నం చేసింది. కానీ ఆ బలమే ఇప్పుడు బలహీనత అయింది. తమ దేశంలోని వలసదారులు తమ దేశవాసులకంటే అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారు. అగ్రరాజ్యంగా ఉన్నంతవరకూ ఆ విధమైన వారి అభివృద్ధి, అమెరికాకు ఇబ్బందికరంగా పరిగణించలేదు. కానీ ఇప్పుడు వారే తమను దాదాపు అగ్ర రాజ్యం స్థాయి నుంచి కిందికి దింపుతున్నారు. అది వారు కావాలని చేయడం లేదు. కానీ అమెరికాలో సంపాదించింది తమ దేశాలకు పంపుతుండటం వల్ల అది దాదాపు అమెరికా స్థాయిలో ఆర్థికంగా బలపడటమే కాకుండా, తమనే శాసించే స్థాయికి చేరుకుంటున్నాయి. ఈ పరిణామం ఇంతకుముందు ఉన్న అధ్యక్షులు పట్టించుకోలేదు. కానీ ట్రంప్ రాకతో దీనిని ముఖ్యాంశంగా మార్చి అమెరికన్ ప్రజల్లోకి తీసుకుని వెళ్లడంలో కొంతవరకు కృతకృత్యుడయ్యాడు. చైనా మళ్లీ భారతదేశ సరిహద్దులలో 'యాక్టివ్'గా ఉండటానికి సాధన సంపత్తులను సిద్ధం చేసుకుంటున్నది. కొత్తగా కొన్ని దేశాలతో గ్రూపులు కట్టి తన ఆధిపత్యాన్ని అజమాయిషీని ఇటు



తూర్పు ఏషియాలోనూ, అటు పశ్చిమ ఏషియాలోనూ చెలాయించడానికి ఆరాటపడుతున్నది. జూన్ 19, 2025న కున్మింగ్‌లో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో సమావేశం ఏర్పాటు చేసుకుంది. త్రైపాక్షిక ఒడంబడిక లాంటిది తెరమీదికి తేవాలని ప్రయత్నించింది కానీ బంగ్లాదేశ్ చిన్నగా తప్పుకొని, పెద్దగా ఆసక్తి కనపర్చకపోవటంతో ఆ ఒప్పందం ఆదిలోనే ఆగిపోయింది. అయినా బంగ్లాదేశ్‌లోని లాల్ మొనిర్‌హట్ రెండవ ప్రపంచ యుద్ధంలో వాడిన ఎయిర్‌బేస్‌ను తిరిగి సిద్ధం చేయడానికి చైనా ముందుకు వచ్చింది. ఈ ఎయిర్ బేస్ సిలిగురి కారిడార్‌కు దగ్గరగా ఉంటుంది. పాకిస్థాన్‌కు, ఆపరేషన్ సిందూర్ ఇండియా తలపెట్టినప్పుడు చైనా అనేక రకాలుగా సహాయసహకారాలు అందించింది. దీనికి తగ్గరుజువులు కూడా భారత్‌కు దొరికాయి. ఆ సాక్షాలను చాలా దేశాలు కూడా బయటపెట్టకపోయినా వాస్తవాలుగా గుర్తించాయి. అది ఒక విధంగా దౌత్యపరంగా భారత్ సాధించిన విజయం. అరుణాచల్‌ప్రదేశ్ మీద చైనా ఎన్నో సంవత్సరాల నుంచి కన్నేసి ఉంది. చైనా పైచేయిని ప్రస్ఫుటించేలా పేచిపెట్టి అరుణాచల్‌లో తమ పేర్లను ప్రపంచ పటాలపై తేవటానికి ప్రయత్నిస్తున్నది. దలైలామా వ్యవస్థను కూడా భవిష్యత్తులో భారత్ నుంచి లాక్కోవాలనే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నది. ట్రేడ్ లావాదేవీలలో కూడా చైనా ఆధిపత్యం భారత్‌పై స్పష్టంగా కనపడుతున్నది. ఇవ్వన్నీ అటుంచితే ప్రమాదకరమైన విధంగా చైనా అతిపెద్ద డామ్ టిబెట్‌లో యార్లంగ్ జాంగ్పో (బ్రహ్మపుత్రకు టిబెట్ పేరు) కట్టున్నది. ఇది భారతదేశ సరిహద్దులకు చాలా దగ్గర! మాల్దీవ్స్‌లో ప్రధాని మోడీ ఈ మధ్యనే పర్యటించి చైనా ప్రభావాన్ని అక్కడ తగ్గించే ప్రయత్నం చేశారు. యూరప్ దేశాలు కూడా ఆపరేషన్ సిందూర్ ముందు భారత్‌తో అంత సఖ్యతగా లేకపోవడం దురదృష్టకరం. అమెరికా ప్రభావం ఒక కారణమైతే భారత్ ఆర్థికాభివృద్ధిలో నాలుగోస్థానానికి ఎగబాకటం ఈ దేశాలకు కంటకంగానే ఉంది. అయితే ఈ మధ్య వాస్తవ పరిస్థితులు గమనించడం వల్లనో ఏమో యు.కే కాంప్రహెన్సివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ (సిఇటిఏ) భారత్‌తో చేసుకోవటంతో యూరప్ దేశాల పరిస్థితులలో కొంత మార్పు వస్తున్నట్లుగా భావించవచ్చు. యు.ఎస్.ఏను చైనాను భారత్ నమ్మే పరిస్థితిలేదు. రష్యాతో సంబంధాలు బాగానే ఉన్నట్లు కన్పిస్తున్నా ఇజ్రాయిల్, ఉక్రెయిన్ గొడవల్లో కచ్చితమైన స్టాండ్ తీసుకోలేదనే కినుక రష్యాకు ఉంది. బయటపడకపోయినా, ఇజ్రాయిల్ విషయంలో భారత్ ఈ మధ్యన కొంత మార్పు, దౌత్యపరంగా చేసినట్లుంది. ఆ విధంగా రష్యా బుజ్జగించబడినట్లు దౌత్యవర్గాలు చెబుతున్నాయి. ఏదిఏమైనా భారత్ స్పష్టమైన స్టాండ్ ప్రతి సమస్యపై తీసుకోవాల్సిన అగత్యం ఇప్పుడు ఏర్పడింది. చైనా, అమెరికాల పద్మవ్యూహంలో చిక్కుకోకుండా భారత్ సొంత నిర్ణయాలు ప్రస్ఫుటించేలా దక్షిణ ఏషియా, తూర్పు ఏషియా దేశాలతో సమిష్టి నాయకత్వం తలపెట్టి చైనా, పాకిస్థాన్ ఎత్తుగడలను త్రిప్పి కొట్టే ప్రయత్నాలు చేయక తప్పదు. నాయకత్వం కావాలని నెత్తిన వేసుకోవాల్సిన అవసరం లేదు. కానీ భారత్ జనాభా దృష్ట్యా చైనాను అధిగమించి మొదటిస్థానానికి వచ్చింది. ఆర్థికంగా ప్రగతి సాధించిన మొదటి అయిదు దేశాలలో భారత్ ఉంది. అవసరమొస్తే తొణక్కుండా మిలటరీ పరంగా బలాన్ని ప్రదర్శించే శక్తియుక్తులు ఉన్నాయని ఇప్పటికే నిరూపించుకున్న ఈ తరుణంలో ఏ అవకాశం జారవిడవకుండా తనను తాను కుట్రలూ కుతంత్రాల నుంచి రక్షించుకోవడానికి మరింత బలమైన దేశంగా, ఇతర దేశాలను ప్రభావితం చేసే విధంగా ఉండక తప్పదు. అప్పుడే భారత్ సార్వభౌమాధికారాన్ని ప్రజాస్వామ్యాన్ని నిలుపుకోగలదు. •

# ఆదరణ కోల్పోతున్న ప్రభుత్వ విద్య?

ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి ఆరాధించి, పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. ప్రస్తుతం విద్య ఒక వ్యాపారంగా రూపుదాల్చింది. విద్యనేకాదు విద్యార్థులతోసహా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా విద్యావ్యాపారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆ మాట కొస్తే దేశవ్యాప్తంగా రోజురోజుకు విస్తరించిపోతున్నది. ఇది ప్రైవేట్ రంగంలో వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈవ్యాపారంలో గతంలో ఇతర వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లు, అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయ నాయకులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భాగస్వాములు అవుతున్నారు. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా అమలు చేయగలిగిన సామర్థ్యం గల అధికార గణం ఉన్నాపరిస్థితి రానురాను అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో నడిచేవి. వాటిల్లో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవి కావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవా దృక్పథంతో విద్యాసంస్థలు సేవలు అందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి ఆ బడులను నడిపేవారు. అందువల్ల ఆనాటి ప్రైవేట్ పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండాపోయింది. అందుకు అప్పట్లో చట్టాల అవసరం తలెత్తలేదు. ప్రభుత్వరంగంలో కూడా ఆనాడు అంతోఇంతో పటిష్టంగా నడిచేవి. రాజకీయ జోక్యాలుండేవి కావు. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, ఆశ్రిత పక్షపాతం వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితులు ఎలా ఉంటుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీదా బిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందనే భ్రమలో ఆవైపే మొగ్గుచూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతి లేనివారు, మరోదారి లేనివారు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. ఇప్పుడు ఈ వ్యాపారం గ్రామాలకే కాదు శివారు పల్లెలకు కూడా వ్యాపించింది. కొందరు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు శివారు పల్లెలకు, తండాలకు బస్సులను, ఆటోలను ఏర్పాటుచేసి పిల్లలను తమ స్కూళ్లకు రప్పించుకుంటున్నారు. రానురాను పరిస్థితి ఇలానే ఉంటే ప్రభుత్వ పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో యేడాది యేడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రైవేట్ రంగంలో పెరిగిపోతున్నారు. 2021-22 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ముప్పైలక్షల డెబ్బైఎనిమిది వేల నూట ఎనభై తొమ్మిది ఉండగా ప్రైవేట్ బడుల్లో ఇరవైఎనిమిది లక్షల అరవైఏడు వేల ఐదువందల తొంభైఏడు మంది ఉన్నారు. అయితే 2022-23 విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల సంఖ్యతగ్గి ప్రైవేట్ స్కూళ్లలో పెరిగిపోయింది. సర్కారు బడుల కంటే ప్రైవేట్ స్కూళ్లలో దాదాపు రెండులక్షల మందికిపైగా అడ్మిషన్లు అదనంగా తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో చేరేవారి సంఖ్య మరింత తగ్గిపోయింది. గత పదేళ్లుగా పరిశీలించినా ఈ తగ్గుదల నమోదవుతూనే ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారిస్తుందో? ఎందుకు ఈ పరిస్థితి దాపురిస్తున్నది? కారకులెవరు? కారణాలు ఏమిటి?అనేది అటు అధికార వర్గాలకు కానీ, ఇటు పాలకులకు కానీ తెలియంది కాదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉన్నాయి. ఎన్నో ప్రోత్సాహకాలుప్రకటిస్తున్నారు. మధ్యాహ్న భోజనం, పుస్తకాలు లాంటి ఎన్నో ప్రోత్సాహకాలతో పాటు ఫీజులుండవు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వపరంగా ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా అటు ప్రైవేట్ విద్యాసంస్థలు ముక్కుపిండి ఫీజులే కాదు పుస్తకాలు, డొనేషన్ల పేరుతో పెద్దఎత్తున డబ్బులుగుంజుతున్నా ఆ మేరకు చెల్లించి అటువైపే మొగ్గుచూపుతున్నారు తప్ప ప్రభుత్వ పాఠశాలలవైపు చూడడం లేదు. పోనీ బోధకుల విషయంలో పరిశీలించినా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొంది అర్హత, అనుభవం కలిగిన ఎందరో ఉపాధ్యాయులున్నారు. అదే ప్రైవేట్ పాఠశాలల్లో ఆ పరిస్థితి లేదు. పోల్చడానికే వీల్లేదు. అయినా అటువైపే మొగ్గుచూపుతున్నారు. అయితే ప్రభుత్వపరంగా కొన్ని లోపాలున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో పరిశీలించినా అనేక ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంచి నీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేకపోవడం వల్ల ప్రధానంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా అందరికి విద్య అందించాలనే లక్ష్యం ఇప్పటికీ కనుచూపుమేరలో కన్పించడం లేదు. దేశాభివృద్ధికే కాదు మానవజాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. ఆరేళ్ల నుంచి పధ్నాలుగేళ్ల బాలబాలికలందరికి ఉచిత విద్య అందించాలనే కార్యక్రమం పదేళ్లలో పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే పెద్దలు నిర్ణయించారు. ఆ సంకల్పం కాగితాల్లోనే కన్నుమూసింది. ఇక డిపెప్, ఎపెప్, సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు. ఆశించిన ఫలితాలు లభించడం లేదు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ విద్యావ్యవస్థను ఇలాంటి పరిస్థితుల్లోకి నెట్టడం ఏ మాత్రం సమంజసంకాదు.

ఆకలి రుచి ఎరుగనట్లే మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.



ఆస్కార్‌వైల్డ్

ఆలోచన మనిషిని కార్యోన్ముఖుణ్ని చేస్తుంది. అందుకే ప్రతి వారికి సరైన ఆలోచన అతి ముఖ్యమైనది.



ఎమర్సన్

# సాగరాలూ మానవ మనుగడకు ఆధారం

డి జె మోహన రావు

మన భూమి ఉపరితలంపై ఏకంగా 70శాతం ఆవరించి ఉన్న సాగరాలు కేవలం నీటి రాశులు మాత్రమేకాదు. అవి ఈ భూమికి ప్రాణం, సమస్త జీవరాశి మనుగడకు అత్యంత కీలకమైన పనులు చేస్తాయి. మనం పీల్చే ఆక్సిజన్‌లో కనీసం సగానికి పైగా సాగరాలే ఉత్పత్తి చేస్తాయి. కోట్లాది మందికి అన్నం పెట్టి, ప్రపంచంలోని 80శాతం జీవవైవిధ్యాన్ని తమ ఒడిలో చేర్చుకుని, సాగరం మన మనుగడకు ప్రధాన ఆధారం. ఆర్థికంగా కూడా ఇది చాలా కీలకం. 2030 నాటికి సుమారు 4 కోట్ల మంది సాగర ఆధారిత పరిశ్రమల్లో బతుకుతెరువు పొందవచ్చని అంచనా. అయినప్పటికీ, ఈ అమూల్యమైన ప్రకృతి సంపద ఇప్పుడు ఊహించని బెదిరింపులను ఎదుర్కొంటోంది. దశాబ్దాల తరబడి మనిషి చేసిన కార్యకలాపాలు మన సాగరాలను పతనం అంచుకు నెట్టేశాయి. దీనివల్ల సాగర పర్యావరణ వ్యవస్థలకు, తద్వారా మానవ జాతికి తీవ్రమైన పరిణామాలు తప్పడం లేదు. సాగర జీవనం, జీవవైవిధ్యానికి తగులుతున్న అతి పెద్ద దెబ్బల్లో ఒకటి అతి చేపల వేట. చేపల సంఖ్య వాటి పునరుత్పత్తి సామర్థ్యం కంటే వేగంగా పట్టుబడినప్పుడు ఇది జరుగుతుంది. ఫలితంగా వాటి సంఖ్య అడుగంటిపోతుంది. 2024నాటికి, ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ పర్యవేక్షిస్తున్న 500 చేపల నిల్వల్లో 37శాతం పైగా అతిగా వేటాడబడుతున్నాయని అంచనా. ఇది 1970తో పోలిస్తే మూడు రెట్లు ఎక్కు! అతి చేపల వేట వల్ల కలిగే పరిణామాలు చాలా భయంకరమైనవి. కుప్పకూలుతున్న చేపల సంఖ్య సాగర జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. పర్యావరణ వ్యవస్థల సున్నితమైన సమతుల్యతను చిందరవందర చేస్తుంది. సముద్రపు ఆహారంపై ఆధారపడే లక్షలాది మంది ప్రజల జీవనోపాధిని, ఆకలిని ప్రమాదంలో పడేస్తుంది. 1992లో కెనడాలోని గ్రాండ్ బ్యాంక్స్ కాడ్ ఫిషరీ మొత్తం నాశనం కావడం, దానివల్ల 35,000 మంది మత్స్యకారులు నిరుద్యోగులు కావడం, ఒక గుణపాఠం లాంటిది. 2024 ప్రపంచ ఆక్వాకల్చర్ స్థితి (సోఫియా) నివేదిక ఈ సంక్షోభాన్ని మరింత స్పష్టం చేసింది. చేపల నిల్వల్లో మూడింట ఒక వంతుకు పైగా (37.7 శాతం) స్థిరమైన పరిమితులను మించి వేటాడబడుతున్నాయి. అతి చేపల వేట ప్రధానంగా స్వల్పకాలిక లాభాపేక్ష, సరైన సమాచారం లేకపోవడం, నివేదించబడని, నియంత్రించబడని చేపల వేట వల్లనే జరుగుతుంది. చేపలను ఉద్దేశపూర్వకంగా పట్టడంతో పాటు, అనుకోకుండా చిక్కిన చేపలు సమస్య పరిస్థితిని మరింత దిగజార్చుతుంది. చేపల వేట కార్యకలాపాల సమయంలో అనుకోకుండా వలలో పడే సముద్ర జాతులను ఇది సూచిస్తుంది. ఈ విచక్షణారహిత పద్ధతి తాబేళ్లు, డాల్ఫిన్‌లు వంటి అంతరించిపోతున్న, బెదిరింపులకు గురైన రక్షిత జాతుల ప్రాణాలకు ముప్పు తెస్తుంది. ఇది ఇతర జాతులు ఆహారంగా ఆధారపడే చేపలను తొలగించడం ద్వారా ఆహార గొలుసును కూడా దెబ్బతీస్తుంది. చిన్న చేపల సంఖ్యను నాశనం చేస్తుంది. అవి పునరుత్పత్తి వయస్సుకు చేరకుండా అడ్డుకుంటుంది. గత 50 సంవత్సరాలలో చేపల వేట వల్ల సాగర జీవవైవిధ్యం కోల్పోవడం మన సాగరాలపై అత్యంత తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. మన భూమి వాతావరణాన్ని నియంత్రించడంలో సాగరం కీలక పాత్ర పోషిస్తుంది. భూమి వాతావరణంలో పేరుకుపోయిన వేడిలో 93శాతం శిలాజ ఇంధనాల నుండి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్లో నాలుగింట ఒక వంతును అది గ్రహిస్తుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఆమ్లీకరణ సాగర ఆవాసాలు జాతుల నష్టానికి దారితీస్తాయి. మారుతున్న ప్రవాహాలు చేపల సంఖ్య పంపిణీని మారుస్తున్నాయి. మొత్తం పర్యావరణ వ్యవస్థల రూపురేఖలను మార్చేస్తున్నాయి. మన సాగరాలను నిలబెట్టుకోవాలంటే, మనం ఈ వాతావరణ ప్రేరిత మార్పులకు అనుగుణంగా మన చేపల వేట పద్ధతులను మార్చుకోవాలి. మనం స్థిరమైన చేపల వేట పద్ధతులను అవలంబించాలి. అక్రమ చేపల వేటను అరికట్టాలి, వాతావరణ మార్పులను తగ్గించాలి. సంరక్షణ ప్రయత్నాలలో చురుకుగా పాల్గొనాలి. •

# కట్టడి చేయకుంటే తిప్పలే!

ఫిరోజ్ ఖాన్

ఒక్క చిట్కాతో బరువు తగ్గొచ్చు. ఈ ఒక్క ఆహారంతో అన్ని రోగాలు మటుమాయం. వైద్యులు చెప్పని నిజాలు వారం రోజుల్లో క్యాన్సర్‌ను నయం చేసే ఆహారం ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో ఈ తరహా శీర్షికలు ఎక్కువయ్యాయి. ఇలాంటి వీడియోలను అనుసరిస్తూ తమ ఆహారంలో మార్పులు చేసుకుంటున్న కొందరు ఇటీవల ఆస్పత్రుల పాలయ్యారు. ఇలాంటి ఒక రకమైన డైట్‌ను పాటించి 2025 మార్చిలో కేరళలో ఓ పద్దెనిమిదేళ్ల యువతి మరణించింది. ఎలాంటి డిగ్రీలు పొందకుండా, శాస్త్రీయ ప్రయోగాలు చేయకుండా ఈ సోకాల్డ్ న్యూట్రీషియనిస్టులు, డైటీషియన్లు, థెరపిస్టులు ఇస్తున్న సలహాల వల్ల ప్రపంచవ్యాప్తంగానూ అనేక మరణాలు సంభవిస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు 50డైటరీ, న్యూట్రిషన్ సలహాలు తప్పుగా లేదా శాస్త్రీయ ఆధారం లేకుండా ఉన్నాయని 2024లో డీకిన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఒక అధ్యయనం తేల్చింది. నూటికి 60శాతం మంది భారతీయులు ఆరోగ్య సమాచారాన్ని సోషల్ మీడియా నుంచే పొందుతున్నారని ఐఏఎంఏఐ 2024 డేటా చెబుతున్నది. ఈ నేపథ్యంలో భారతదేశంలో వేగంగా వ్యాప్తి అవుతున్న తప్పుడు ఆరోగ్య సమాచారానికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో భారీ నష్టం సంభవించే ప్రమాదముంది. ఎలాంటి చదువులు, డిగ్రీలు లేకున్నా, ప్రస్తుతం సోషల్ మీడియాలో అనేక మంది తమను తాము న్యూట్రీషియనిస్టులు, డైటీషియన్లుగా ప్రకటించుకుంటున్నారు. మరికొందరైతే వైద్యులుగా, వివిధ రకాల థెరపిస్టులుగా చెలామణి అవుతున్నారు. ఆరోగ్యం, పోషకాహారం, వైద్యానికి సంబంధించి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఇంకొందరైతే ఒకడుగు ముందుకువేసి క్యాన్సర్ వంటి రోగాల నివారణకు మిరాకిల్ డైట్స్‌ను సూచిస్తున్నారు. అయితే వీటికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు ఉండడంలేదు. వీరు చెబుతున్న అసత్యాలు, అర్థసత్యాలను విని చాలా మంది తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. సరైన చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. గతంలోనే ఆందోళన వ్యక్తం చేసిన ఐఎంఏ క్యాన్సర్, ఇతర తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారు సోషల్ మీడియాలో చూసిన తప్పుడు సలహాలు నమ్మి సరైన వైద్యాన్ని, చికిత్సను ఆలస్యం చేస్తున్నారు. దీని వల్ల వ్యాధి ముదురుతున్నది. అనంతరం చికిత్స చేయడం కష్టమవుతున్నది అని గతంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చాలాసార్లు ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాకుండా తమ స్వలాభం కోసం కొంతమంది నకిలీ నిపుణులు మార్కెట్లో లభించే కొన్ని ఉత్పత్తుల అడ్వర్టయిజ్మెంట్ కోసం తక్కువ నాణ్యత గల ప్రొడక్ట్స్ గురించి సలహాలు, సూచనలు ఇస్తుండడంతో వాటిని తీసుకున్న వారి కాలేయం, కిడ్నీలపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తున్నది. 2023లో అమెరికన్ బెవరేజ్‌కెనడియన్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థలు ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌లో రిజిస్టర్డ్ డైటీషియన్లను పెయిడ్ ఇన్‌ఫ్లుయెన్సర్లుగా నియమించి, ఆస్పర్టమే (కృత్రిమ స్వీటెనర్), షుగర్



వినియోగాన్ని ప్రోత్సహించే వీడియోలను పోస్ట్ చేయించాయి. ఈ పోస్టుల్లో స్పాన్సర్‌షిప్‌ను స్పష్టంగా వెల్లడించకపోవడంతో, అమెరికాలో ఫెడరల్ ట్రేడ్ కమిషన్ హెచ్చరికలు జారీ చేసింది. న్యూట్రిషియన్లు, డైటీషియన్లుగా చెప్పుకుంటున్న చాలా మంది కొన్ని రకాల ఆహార పదార్థాలను పూర్తిగా మానేయమని సలహా ఇస్తున్నారు. దీనివల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభించక పోషకాహార లోపం ఏర్పడుతున్నది. బరువు తగ్గడం, లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నది. మరికొందరు ఒకే రకమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చెబుతుండడంతో అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్ అందకుండాపోతున్నాయి. అంతేకాకుండా కొంతమంది ఇస్తున్న తప్పుడు సలహాలు దీర్ఘకాలం పాటించినా.. బరువు తగ్గకపోవడం, ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో అనేక మంది మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నది. ఇన్‌స్టాగ్రామ్‌లో అనేక మంది ఇన్‌ఫ్లుయెన్సర్లు అపెటమిన్ వంటి ఔషధాలను ప్రమోట్ చేస్తున్నారు. ఇవి ఆకలిని పెంచే లక్షణాలతో శరీర ఆకృతిని మార్చడానికి ఉపయోగపడతాయని చెబుతారు. అయితే, ఈ ఔషధం ఎఫ్‌డీఏ ఆమోదం పొందలేదు. లివర్ టాక్సిసిటీ వంటి తీవ్రమైన దుష్ప్రభావాలను సైతం కలిగిస్తున్నది. సెలరీ జ్యూస్ డిటాక్స్ లేదా గ్రీన్‌పౌడర్స్ వంటి ఉత్పత్తులు ఆరోగ్యప్రయోజనాలను అందిస్తాయని ఇన్ ఫ్లూయెన్సర్లు చెబుతున్నా వీటికి ఇప్పటికీ శాస్త్రీయ ఆధారాలు లేవు. సంబంధిత రంగానికి సంబంధించి ఎలాంటి చదువు, డిగ్రీలు లేకుండా న్యూట్రీషియనిస్ట్, డైటీషియన్, థెరపిస్ట్ ఇలా పేర్ల పక్కన పెట్టుకుంటూ సలహాలు ఇచ్చే వారిని కట్టడి చేయకుంటే భవిష్యత్తులో ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరమున్నది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్1954 ప్రకారం రోగ నివారణలపై ఎలాంటి ప్రమాణాలు లేకుండా ప్రకటన చేయడం నిషిద్ధం. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం మోసపూరిత సేవలందించిన వారిపై చర్యలు తీసుకోవచ్చు. ఐటీ యాక్ట్ ప్రకారం తప్పుడు సమాచారం పంపిన వారికి జైలు శిక్ష, జరిమానా కూడా విధించొచ్చు. 2023లో కేంద్రం తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు ఆన్‌లైన్‌లో తప్పుడు సలహాలు ఇస్తూ తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడుతుంది. అనర్హులైన వ్యక్తులు వైద్యసలహాలు ఇవ్వడం భారతదేశంలో ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్, 1956లేదా డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 కింద నేరంగా పరిగణించబడవచ్చు. అయితే ఇప్పటి వరకు వీటిని కఠినంగా అమలు చేసిన సందర్భాలు చాలా తక్కువ. ఈ చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా నకిలీ వైద్యులను శిక్షించవచ్చు. అంతేకాకుండా ఎలాంటి శాస్త్రీయ ప్రయోగాల్లో రుజువు కాని విషయాలను చెబుతూ నకిలీ వైద్య సలహాలు ఇచ్చే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా మరిన్ని ప్రత్యేక చట్టాలను రూపొందించాల్సిన అవసరమున్నది. ఇన్‌ఫ్లుయెన్సర్లకు స్పాన్సర్‌షిప్‌ను స్పష్టంగా వెల్లడించమని అమెరికాలో ఎఫ్టీసీ ఆదేశించింది. ఇలాంటి నిబంధనలను భారతదేశంలో కూడా అమలు చేయవచ్చు. అంతేకాకుండా సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సలహాను గుడ్డిగా నమ్మవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలి. ఐఎంఏ వంటి సంస్థలు దీనికి చొరవ చూపాలి. తమ వేదిక ద్వారా తప్పుడు సలహాలు, సమాచారం వ్యాప్తి చేయకుండా యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్, ఎక్స్‌వంటి సంస్థలు కూడా చర్యలు కఠిననిబంధనలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరమున్నది. సోషల్ మీడియా వేదికలుగా సలహాలు ఇస్తున్న వారు నిజమైన వైద్యులేనా? ఆహారాన్ని సూచిస్తున్న వారు నిజంగానే డిగ్రీలు పొంది ఉన్నారా? అనేది తెలుసుకోవాలి. •

# ప్రజావాక్కు



### ఆశ్రమ స్కూల్స్‌లో ఫుడ్ పాయిజన్

జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కోర్కిశాలలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి 32 మంది విద్యార్థినీలు వాంతులు విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురి కావడం బాధాకరం విద్యార్థినిలను మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రికితరలించగా, మిగతా విద్యార్థినిలను చిట్యాల మండల కేంద్రంలోని సివిల్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఉదయం విద్యార్థినిలకు కిచిడితోపాటు టమాటపచ్చడి అల్పాహారంగా ఇచ్చారు. అల్పాహారంలో వచ్చిన పురుగుల మూలంగా విద్యార్థినిలు వాంతులు విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారని తెలుస్తుంది. పరిస్థితిని గమనించిన పాఠశాల ఉపాధ్యాయినీలు విద్యార్థినీలను ఆస్పత్రికి తరలించారు. మరో మారు ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్ పల్లి జిల్లా

### ప్రాణాలను కబళిస్తున్న కల్తీ కల్లు

కల్తీకల్లు తాగి ఈమధ్య కొందరు అస్వస్థకు గురయ్యారు. దాదాపు డజనుమంది దాకా మరణించారు. అయితే ఇలాంటి ఘటనలు జరగడం మొదటిసారి కాదు. అడపదడపా జరుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోకుండా ఘటన జరిగి అంతా అయిపోయాక రంగంలోకి దిగి శాంపిల్స్ అని అదని, ఇదని నానాహడావిడి చేస్తారు. తరువాత ఏమీ ఉండదు. రాజకీయపార్టీలవారేమో ఇలాంటి ఘటన జరగడం ఇంత మంది చనిపోవడం దురదృష్టమంటూ కళ్లనీల్లు పెట్టుకుంటూరు. బాధిత కుటుంబాల పట్ల సానుభూతి చూపుతూ మాట్లాడతారు. అవకాశం దొరికింది కదా అని ప్రతిపక్ష పార్టీల వారు అంతా ముఖ్యమంత్రి మీదకి నెట్టేస్తారు.

- మిథునం, హైదరాబాద్

### ఆలయాలను అభివృద్ధి చేయాలి

భారత దేశంలో పురాతన ప్రసిద్ధి చెందినఆలయాలను శిథిలావస్థకు చేరిన ఆలయాలను అభివృద్ధిచేయాలి. ఆధ్యాత్మిక ప్రదేశాలైన ఆలయాలు, మసీదులు, చర్చిలు, దాతల చందాలు, హుండీ ఆదాయం, ఇతరత్రా వచ్చినడబ్బుతో భక్తులకునచ్చినవిధంగా ఆలయాలను సంరక్షిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక ధోరణి అలవాటు చేస్తే బాగుంటుంది.

- డి చాంద్ బాషా, కర్నూలు

### పరీక్షలు ఆగస్టు 15 తర్వాత నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి ఫార్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలను ఆగస్టు 11 నుంచి 13 వరకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఆగస్టు 11నుంచి 14వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించాలని పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. కానీ ఆగస్టు నెలలో 15వ తేదీన ప్రతీపాఠశాలలో విద్యార్థులు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. దీనికోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పాఠశాలల్లో నిర్వహించుకునేందుకు సంసిద్ధతా కార్యక్రమాల్లో ఉంటారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు పోటీలు లాంటివి నిర్వహించడంలో నిమగ్నమైఉంటారు. ఈసమయంలో పరీక్షలు నిర్వహించడం సరైనదికాదు. కావున ఆగస్టు 15తర్వాతే నిర్వహించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### తప్పలెన్నువాడు..

రెండువేల ఇరవైమూడు తెలంగాణ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బొటాబొటి మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. దీంతో ఆపార్టీలోఅసమ్మతి మొదలవుతుందని వారిలో వారు కొట్టుకుంటారని గెలచిన ఎమ్మెల్యేలలో చాలా మంది తమ పార్టీలోకి వస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవటం ఖాయమని ఇలా ఎన్నో మాటలన్నారు. అయితే వారన్న ఒక్క మాట నిజం కాలేదు. టిఆర్ఎస్, ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇదిలా ఉంటే 2018 శాసనసభకు జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్‌కిభారీమెజారిటీ లభించింది. అయినా కెసిఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి నెమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుని ఆ పార్టీకి ముగ్గుర్ని మిగిల్చారు. టిడిపిలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలను లాక్కుని తెలంగాణలో ఆపార్టీకి స్థానం లేకుండా చేశారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### చేతులారా చేసుకున్నారు

రెండువేల ఇరవైమూడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ని పీకిపడేసారు. ఆయన సారథ్యంలోనే బిజెపి జి.హెచ్.ఎమ్‌సి ఎన్నికల్లోఅత్యధిక స్థానాలను గెలుచుకుని సంచలనం సృష్టించింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆ తరువాత కూడా బండి సంజయ్‌నీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగాకొనసాగించిఉంటే అసెంబ్లీఎన్నికల్లో కూడా మెజార్టీ స్థానాలను దక్కించుకుని పార్టీ అధికారంలోకి వచ్చి ఉండేది. పోనీ ఇప్పుడయినా బి.సి వర్గానికి చెందిన వ్యక్తికి అధ్యక్ష పదవి ఇచ్చారా అంటే అదీ లేదు.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

Main tab page 111_Main tab page 111.qxd 8/8/2025 12:30 AM Page 1



## రీ సర్వే పక్రియ పటిష్టంగా నిర్వహించాలి



**ఒంగోలు, ప్రభాతవార్త**

జిల్లాలో చేపడుతున్న రీ సర్వే పక్రియ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్టంగా నిర్వహించాలని సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి జాయింట్ కలెక్టర్లకు సూచించారు. విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి గురువారం జిల్లాల్లో చేపడుతున్న రీ సర్వే పక్రియ పురోగతి, పైలెట్ గ్రామ నోటీఫికేసన్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి సమీక్ష నిర్వహించి దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో చేపడుతున్న రీ సర్వే పక్రియ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్టంగా నిర్వహించాలని, అలాగే నిర్ధేశించిన సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్లకు సూచించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల్‌కృష్ణ, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాష తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో చీకటి దుకాణాలు ప్రమాణాలు పాటింపుపై మాగుంట ప్రశ్న



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సరైన ప్రమాణాలు పాటించని చీకటి దుకాణాల గురించి సర్వే, గత 5 సంవత్సరాలలో నిర్వహించిన దాదులు, వాటిని నిర్వహిస్తున్న కంపెనీలు, వసూళ్లు చేసిన జరిమానాలు, నిబంధనలు పాటించని కంపెనీల నిలుపుదల, అవగాహన సదస్సుల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు ఆహారం, ప్రజా పంపిణీ రైల్వే శాఖ సహాయక మంత్రి బీఎల్ వర్మ సమాధానమిస్తూ.. 2024-25లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు మార్కెటులో ఆన్‌లైన్ వ్యాపారం, త్వరిత వాణిధ్య కంపెనీల ద్వారా అమ్మే వస్తువుల కార్యకలాపాలపై పర్యవేక్షణ చేసిన, నాణ్యత నియంత్రణ ఆదేశాలు అనుసరించి 344 నమూనాలు సేకరించి, చెల్లుబాటు కాని 142 నమూనాలను గుర్తించిందని తెలిపారు. 2024-25 నుండి దేశంలో నిబంధనలు ఉల్లంఘించిన 22 ఆన్‌లైన్, వాణిధ్య కంపెనీలపై దర్యాప్తులు జరిగాయని, అందులో ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలలో మూడు చొప్పున, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలలో రెండు చొప్పున గుజరాత్, ఒడిశా, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో ఒకటి చొప్పున ఆన్‌లైన్, వాణిధ్య కంపెనీలు ఉన్నాయని, అందులో 14 అమెజాన్ కంపెనీవి, 7 ఇన్స్టాకార్ట్ కంపెనీవి, 1 బ్లీన్ కిట్ కంపెనీది ఉన్నాయని తెలిపారు. ప్రింట్, సామాజిక, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా ఇన్స్‌స్ట్రాగ్రాం, ఫేస్‌బుక్ పై ఆన్‌లైన్ వ్యాపారానికి అవసరమైన ప్రమాదాల గురించి అవగాహన సదస్సుల నిర్వహించబడుచున్నాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రికార్డ్ స్థాయిలో ప్రజలకు ఆర్థిక సాయం

**- రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**సంతమాగులూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త**

దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు ఆర్థిక సాయం చేస్తున్నామని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. కేవలం ఏడాదిలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.400 కోట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గురువారం నాడు బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి పర్యటించారు. నియోజకవర్గంలోని పలువురు కార్యకర్తలను మంత్రి పరామర్శించారు. అనంతరం సంతమాగులూరు మండలంలోని పుట్టవారిపాలెం అతిథి గృహంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఎల్‌ఓసీలను పంపిణీ చేశారు. 16 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. రూ.34 లక్షలకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను అర్హులకు మంత్రి గొట్టిపాటి అందజేశారు. ఈ కార్యక్రమంలో సవతమాగులూరు వనయవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులు తేలప్రోలు రమేష్, మండల టీడీప ఈనాయకులు చేవూరి వాసురెడ్డి, చింతా రామారవు, అడ్డగడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ సన్నెబొయిన ఏడుకొండలు, డీసీ అధ్యక్షులు కామాను శ్రీనివాసరావు, మండలంలోని అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్వారీ ప్రమాద మృతులకు కోటి నష్టపరిహారం చెల్లించాలి

**- అఖిలపక్ష కార్మిక నేతలు డిమాండ్**



**బల్లికురవ, ఆగస్టు 7, ప్రభాతవార్త**

సత్యకృష్ణ గ్రానైట్ క్వారీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా గత ఆదివారం మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.1కోటి నష్టపరిహారం చెల్లించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం బల్లికురవ లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి సీఐటీయు జిల్లా నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుంధార్, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిహారరెడ్డిలు మాట్లాడుతూ గ్రానైట్ క్వారీల్లో పని చేస్తున్న కార్మికులకు సరైన భద్రత లేకుండా పోయిందని, భద్రతా చర్యలు చేపట్టాల్సిన యాజమాన్యం ఆదాయ వనరులుగా క్వారీలను చూస్తున్నారు కానీ, కార్మికులకు కనీస భద్రత కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన కార్మిక శాఖ అధికారులు, క్వారీలలో ఎంత మంది పని చేస్తున్న వివరాలు కూడా లేకుండా, ప్రమాదాలు జరిగి చనిపోయిన తర్వాత మృతదేహాలను లెక్కలు వేస్తున్నారన్నారు. కార్మికులంటే ప్రభుత్వానికి, గ్రానైట్ వ్యాపారులకు, ప్రభుత్వ ఉద్యోగులకు తీసివేతగా మారిందన్నారు. ప్రమాదం జరిగిన సందర్భంలో 24 మంది కార్మికులు ఉంటే, పోలీసులు, యాజమాన్యాలు, చూపించిన కార్మికుల లెక్క ఎంత హాస్యాస్పదంగా ఉందో అందరికి తెలుసు అన్నారు. సంఘటనా స్థలంలోకి మీడియాను సైతం వెళ్లకుండా నియంత్రించడం మరింత శోచనీయం అన్నారు. కార్మికుల శవాల మీద పునాదులు వేసుకుంటూ అమాయకుల ఉసురుతీస్తున్న వ్యాపారులకు తగిన శిక్ష పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్లు పల్లెపోగు ఆంజనేయులు, బిరుదు వీరయ్య, మంద వీర నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.రవీయ్య, కత్తి, రాధ పాల్గొన్నారు.

## విద్యుత్ చోరీలపై విజిలెన్స్ దాడులు

**- రూ.3.17లక్షల అక్రమ విద్యుత్ వినియోగం గుర్తింపు**

**గిద్దలూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసిఎల్) విజిలెన్స్ విభాగం విద్యుత్ చోరీలపై కళ్లుమూసి చూడదనే సంకల్పంతోనే దాడులు జరిపింది. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, ముర్చింటల పరిధుల్లో విద్యుత్ అక్రమ వినియోగంపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు ఒక్కరోజులోనే 76కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో సుమారు 5.63లక్షల యూనిట్లు విద్యుత్ అక్రమంగా వినియోగించినట్లు గుర్తించి సంబంధిత వినియోగదారులకు రూ.3.17లక్షల బిల్లులు జారీ చేశారు. మీటర్ తిప్పి విద్యుత్ వాడిన 17మందికి రూ.1.10లక్షలు, కేబుల్ బైపాస్ చేసిన 185మందికి రూ.0.03లక్షలు, లోడ్ కంట్రోల్ పరికరాల ద్వారా విద్యుత్ వినియోగించిన 18మందికి రూ.0.12లక్షలు, డైరెక్ట్ కనెక్షన్ ద్వారా విద్యుత్ వాడిన 38మందికి రూ.1.72లక్షలు అక్రమ విద్యుత్ వినియోగదారులను గుర్తించారు. విద్యుత్ సంస్థ ఆదేశాలతో ఈ తనిఖీలు నిర్వహించామని, విద్యుత్ చోరీలు ఎక్కడ జరిగినా అక్కడ కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. విద్యుత్ చోరీల సమాచారం అందజేయాలనుకునే వారు 9440817491, 9440812198, 9440812358 నంబర్లకు సంప్రదించవచ్చని విజిలెన్స్ విభాగం తెలిపింది. ఈ దాడుల్లో డివిజన్ విజిలెన్స్ అధికారులు, డిఈఈలు, ఏఈఈలు పాల్గొని తనిఖీలు చేపట్టారు.

## పిడుగు పాటుకు వ్యక్తి మృతి



**హనుమంతునిపాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త**

మండలంలో గురువారం సంభవించిన అకాల వర్షానికి పిడుగుపాటు గురై ఒకరు మృతి చెందారు. మండలంలోని వీరరాంపురం గ్రామానికి చెందిన గోన దానయ్య(45) కూలి పనికి వెళ్లి వస్తుండగా సుమారు సాయంత్రం 6గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం మొదలవగానే పొలం పక్కనే ఉన్న చెట్టు కింద సేదతీరాడు. ఈ క్రమంలో పిడుగు చెట్టుపై పడటంతో దాని ఘాతుకానికి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య గత నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు.



# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలి



**ఒంగోలు, ప్రభాతవార్త**

రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో భాగంగా గురువారం ఒంగోలు నందలి ప్రభుత్వ వైద్యశాల రిమ్స్ కాంపౌండ్ నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ యాదవ్, బాబురావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అధ్యక్షులు చిన్నపరెడ్డి కుమార్‌రెడ్డి కార్యదర్శి వర కుమార్, టౌన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కునికి శ్రీనివాసరావు, జల్లా చంద్రశేఖర్, అంకబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు రజిత మానస, సుమతి, ప్రసన్న కుమారి, ప్రసన్న, వేషవర్ధని, శ్రీలక్ష్మీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

### పొగాకు, శనగ

# రైతుల సమస్యలు పరిష్కరిస్తాం



*- ఒంగోలు గిత్త జాతిపై ప్రత్యేక దృష్టి*

*- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై మండిపాటు*

*- గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరుగుతంది*

*- అట్టహాసంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రకాశం జిల్లా పర్యటన*

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లాలో అత్యధికంగా ప్రతి ఒక్కరు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని, రైతుల ఇబ్బందులు, కష్టాలు తీర్చే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీక రించిన అనంతరం సారథ్యం పేరుతో జిల్లాల పర్యటన చేపట్టిన మాధవ్.. బుధవారం ప్రకాశం జిల్లాలో పర్యటించారు. జిల్లా లో ఆయన పర్యటన అంగరంగ వైభవంగా సాగింది. కార్యకర్తలు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఒంగోలులో నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఛాయ్ పే చర్చ లో పాల్గొన్నారు . స్థానిక ఛాయ్ దుకాణం వద్ద ప్రజలతో మాట్లాడారు. పొగాకు రైతులు, ఆక్వా రైతులు, శనగ రైతులు, ప్రజలు వారి సమస్యలను మాధవ్ దృష్టికి తీసుకొచ్చారు. కర్ణాటకలో మాదిరిగా పొగాకు పంటపై ఫైన్ లు ఎత్తివేయాలని రైతులు ఆయనను కోరారు. ట్రంప్ వేస్తున్న అధిక టారిఫ్ ల వల్ల ఆక్వా రైతులు నష్టపోతున్నారని, శనగకు కూడా గిట్టుబాటు ధర లేకుండా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీనిపై స్పందించిన మాధవ్ గతంలో పొగాకు పంటపై అధిక లాభాలు రావడంతో ఈ ఏడాది అందరూ అధికంగా పండించడం వల్ల ఇబ్బందులు వచ్చాయన్నారు. కర్ణాటక తరహాలో మన రాష్ట్రంలో కూడా అపరాద రుసుం ఎత్తేసి, మొత్తం పొగాకు కొనే విధంగా చూస్తామని చెప్పారు. ట్రంప్ వేస్తున్న సుంకాలపై కూడా ఆయన మాట్లాడారు. ఆక్వా రైతులు వనామ రకం మాత్రమే కాకుండా వేరే కల్చర్లు కూడా రైతులు చేపట్టాలని ఆయన సూచించారు. శనగకు కూడా గిట్టుబాటు ధర వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు.

**కార్యకర్తలతో సమావేశం...**

పర్యటనలో భాగంగా ఛాయ్ పే చర్చలో పాల్గొన్న అనంతరం మాధవ్ ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పాత కూరగాయల మార్కెట్ వద్ద నుంచి, యంఎస్ ఫంక్షన్ హాల్ వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున శోభయాత్రలో పాల్గొని రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌కి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యర్తలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. వారి నినాదాలతో, అడుగడుగున బీజేపీ జెండాలతో ఒంగోలు నగరం కాషయవనంగా, కోలాహలంగా మారింది. అనంతరం యంఎస్ ఫంక్షన్ హాల్ లో కార్యకర్తలతో పివిఎన్ మాధవ్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారికి దిశానిర్దేశం చేశారు. రానున్న రోజుల్లో నామినేటెడ్ పదవులు రాబోతున్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మూడు పార్టీలు కలిసే పోటీ చేసే దిశగా ముందుగా వెళ్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలో విజయం సాధించడం ద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాకు చెందిన కొంతమంది డాక్టర్లు బీజేపీ పార్టీలో చేరారు. పీవీఎన్ మాధవ్ వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, అభివృద్ధి చూసి పార్టీలో చేరినట్లు పలువురు వెల్లడించారు.

**వెలుగొండ పూర్తి చేస్తాం..**

ప్రకాశం జిల్లా పర్యటలను విచ్చేసిన మాధవ్ మీడియా సమావేశంలో పలు విషయాలపై మాట్లాడారు. ప్రకాశం జిల్లా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అన్నారు. ఈ పర్యటనలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటికి పరిష్కారం చూపే దిశగా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఒంగోలు అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. కొత్తపట్నం సమీపంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం రూ.460కోట్లు కేటాయించారని, రైల్వే స్టేషన్ ని కూడా అమృత్ రైల్వే స్టేషన్ జాబితాలో చేర్చిన కేంద్రం దాన్ని కూడా అభివృద్ధి చేస్తుందని అన్నారు. ఒంగోలు జాతి గిత్తలను కాపాడేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లాలో ముఖ్యమైన ప్రాజెక్టుల్లో ఒకటి వెలుగొండ అని దాన్ని కూడా త్వరిగతిన పూర్తి చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంట్ లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై మండిపడ్డారు. పరిపక్వత లేకుండా మాట్లాడుతున్నాడని అన్నారు. ఎలక్షన్ కమిషన్ పై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారమని అన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై కూడా సమగ్ర విచారణ జరుపుతున్నామని, ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని ఆయన అన్నారు. అనంతరం జిల్లా పర్యటనలో భాగంగా పలువురు ప్రముఖులతో మేధావుల సదస్సు నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాస్,జిల్లా మాజీ అధ్యక్షులు శివ రెడ్డి, ప్రకాశం జిల్లా ఇంచార్జ్ పి రవి శంకర్, బాపట్ల జిల్లా ఇంచార్జ్ కృష్ణ రెడ్డి మరియు బిజెపి జిల్లా ప్రముఖ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.







# రాష్ట్రంలో రాక్షస పాలననడుస్తుంది..

**- తప్పుడు కేసులు, కుటిల రాజకీయాలు**


**- కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దాం..**

**- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**



**పెద్దారవీడు, ఆగస్టు 6, ప్రభాతవార్త**

అక్రమ కేసులు, ప్రలోభాలు, బెదిరింపులు వంటి చర్యలతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తుందని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మండల కేంద్రమైన పెద్దారవీడులో గురువారం ఉదయం వైకాపా మండల కన్వీనర్ బాలురెడ్డి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగి నబాబు షూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ తో సహా 140కి పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు..ఏడాదిగా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా సూపర్ సిక్స్ హామీలు ఇవ్వడం ప్రజలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా



రూ.లక్షల్లో నగదు వస్తుందని నమ్మించి మోసం చేశారని దుయ్యబట్టారు. బాబు మోసాలు, అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, పార్టీలకు, కులమత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు లబ్ధి చేకూర్చామని గుర్తు చేశారు. కరోనా కష్టాకాలంలో కూడా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగించిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రతి ఇంటికీ తిరిగి చంద్రబాబు మోసాలను వివరించాలని సూచించారు. జెడ్పిటిసి ఎరువ చలమారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందన్నారు. ఎన్నికలు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. అమలకు సాధ్యం కానీ వాగ్దానాలు చేసి అధికారంలోకి రావడమే తెలుగుదేశం పార్టీ నైజం అని విమర్శించారు. మండల కన్వీనర్ పాలు రెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి వైకాపాకు పూర్వ వైభవం తీసుకువచ్చేం దుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమ కేసులకు బెదిరింపులకు, ఎవరు భయపడవద్దన్నారు. అంతకుముందు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు దొండేటి నాగేశ్వర రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ షేక్ బుజ్జి,సర్పంచులు దుగ్గేం చెన్నమ్మ,ఆదినారాయణ యాదవ్ పొందుగుల వెంకటరెడ్డి,కొర్ర భూలక్మి,కంచర్ల సుబ్బయ్య,వైసీపీ నాయకులు దుద్దెల వెంకట రెడ్డి, డీలర్ వెంకటేశ్వర్లు రెడ్డి, కాసు వెంకట రెడ్డి,దినేష్, శొంఠి నాగార్జున రెడ్డి, పి. గురవయ్య, వెన్నాపెద్ద పోలి రెడ్డి,మూడమంచు రాజారావు, మాజీ ఎంపీటీసీ మూల రమాదేవి, డి రామకృష్ణా రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



## నీచ చరిత్ర మీ అధినేత జగన్‌ది

*- ఆస్తుల కోసం చెల్లి తల్లిని గెంటేశాడు...*

*- లిక్కర్ డబ్బుతో ఎమ్మెల్యేగా గెలిచావు*

*- దమ్ముంటే తేల్చుకుందాం..రా*

*- అసెంబ్లీలోకి వెళ్లలేని దొంగబతుకు నీది*

*- నోరు అదుపులోపెట్టుకో*

*- ఎమ్మెల్యే తాటిపర్తికి ఎరిక్షన్ బాబు ధ్వజం*

**యర్రగొండపాలెం ప్రభాతవార్త**



ఆస్తుల కోసం తల్లి,చెల్లిని గింటేసిన నీచ చరిత్ర మీ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిది, లిక్కర్ డబ్బుతో ఎమ్మెల్యేగా గెలిసిన చరిత్ర మీది.. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం తప్పించే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుని విమర్శించే నైతిక హక్కు మీకు ఎక్కడిదని ఎర్రగొండపాలెం నియోజక వర్గ టిడిపి ఇన్చార్జ్ గూడూరి నిరీక్షణ బాబు ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్‌పై ధ్వజమెత్తారు. ఎర్రగొండపాలెం మండలం అవమాని గుడిపాడులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి పై ఎరిక్షన్‌బాబు ఘాటైన విమర్శలు చేశారు ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యం చేసి లక్షల డబ్బులు దోచుకున్న నీచ చరిత్ర మీ అధినేత జగన్ ది.. లిక్కర్ డబ్బులతో ఎమ్మెల్యేగా గెలిచిన మీరు అసత్య ఆరోపణలు చేయ డం సరికాదన్నారు. దమ్ముంటే వాస్తవాలు తెలుసుకుందాం..రా తేల్చుకుందాం..రా అంటూ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు సవాల్ పిసినారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని విమర్శించే నైతిక హక్కు మీ అధినేతకు ,మీకు ఎక్కడదన్నారు. ఎంపీ అభ్యర్థి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇచ్చిన లిక్కర్ డబ్బుతో ఎమ్మెల్యేగా గెలిచావని. దొంగ డబ్బుతో గెలిచిన మీరు నైతిక విలువలు ఏ రోజు కోల్పోయారని, మమ్మల్ని విమర్శించే స్థాయి అర్హత మీకు లేదన్నారు. మీ అధినేత జగన్ జైల్లో ఉన్న సమయంలో అన్న వదిన బానము నంటూ షర్మిల రాష్ట్రమంతా పర్యటించిందని అధికారంలోకి రాగానే అధికారము, ఆస్తుల కోసం కనీసం చెల్లెలు, తల్లి గెంటివేసిన సంస్కృతి మీ అధినేతదన్నారు. అసెంబ్లీకి కూడా వెళ్ళలేని దొంగబతుకు నీదన్నారు. నోరు అదుపులో పెట్టుకోవాలని ఎరిక్షన్‌బాబు ఎమ్మెల్యే తాటిపర్తిపై ధ్వజమెత్తారు. ఐదేళ్ల మీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యమని, పాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ప్రజల అభిమానాలు చూడకుంటున్నా మన్నారు. మీ వైఖరికి నచ్చక మీ పార్టీలో వర్గాలతో కొట్టుకుంటున్నా రని. చక్కదిద్దుకోలేని మీరు ఓటమి ప్రభుత్వాన్ని విమర్శించడమే పని గా పెట్టుకోవడం సమంజసం కాదన్నారు.

Main tab page 6_Main tab page 6.qxd 8/8/2025 12:30 AM Page 1



## వైద్యశాల ప్రారంభోత్సవంలో ఈదా

**అద్దంకి, ఆగస్టు 7 ప్రభాతవార్త**



ఒంగోలులోని 60అడుగుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లలిత మల్టీస్పెషాలటీ హాస్పటల్‌లోని జనరల్ వార్డును బాపట్ల జిల్లా వైఎస్ఆర్‌సిపి రైతు విభాగ అధ్యక్షులు ఈదా శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి, మురహరియాదవ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

## మంత్రి పర్యటన వివరాలు

**అద్దంకి, ఆగస్టు 6, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు జె.పంగులూరు మండలం ముప్పవరం గ్రామం, 10.30గంటలకు జాగర్లమూడివారిపాలెం, 11గంటలకు కొరిశపాడు మండలం పి.గుడిపాడు, మధ్యాహ్నం 12గంటలకు సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెంలోని మంత్రి అతిధి గృహంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలలో మంత్రి పాల్గొంటారని ఆయన కార్యాలయం విడదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం

**వెలిగండ్ల, ఆగస్టు 7, ప్రభాతవార్త**



వెలిగండ్ల మండలంలోని మరపగుంట్ల రైతు సేవా కేంద్రం పరిధిలో గురువారం ఒంగోలు ఆత్మ వారి సౌజన్యంతో ఖరీఫ్ సీజన్లో మేలైన యాజమాన్య పద్ధతులపై సాగు చేసే పంటలు పైన శిక్షణా కార్యక్రమం మండల వ్యవసాయాధికారి అధ్యక్షతన నిర్వహించారు. సాగులో మెలుకువలు పాటిస్తే డబ్బు, సమయం, శ్రద ఆదా చేసుకోవచ్చని దర్శి డీఏఏటీ శాస్త్రవేత్త సీహెచ్ వరప్రసాద్ తెలిపారు. రైతులకు ఖరీఫ్ సీజన్లో సాగు చేసే కంది, సజ్జ, పత్తి మొదలగు పంటలకు సోకే తెగుళ్ళ, వాటి యొక్క నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు షేక్ జైనులబ్దిన్ మాట్లాడుతూ రైతులందరూ వేసే ప్రతి పంటకు ఈ పంట ద్వారా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అలాగే పంట భీమా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.శిల్ప మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా అమలులో ఉన్న పథకాలు, విత్తనాలు, ఎరువులు సరఫరా, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద పంటల భీమా చేసుకొనుటకు ఆగష్టు 14వరకు పొడిగించడం జరిగిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు టి.సాయి శిరీష, అక్రమ్, మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీను, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఆటో వర్కర్లకి న్యాయం చేయాలి - సీఐటీయు డిమాండ్

**వెలిగండ్ల, ఆగష్టు 7, ప్రభాతవార్త**



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆటో వర్కర్లకి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మండల సీఐటీయు కార్యదర్శి రాయల మాలకొండయ్య అన్నారు. గురువారం వెలిగండ్ల మండల పశ్చిమ ప్రాంత ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల మాలకొండయ్య మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ఆగష్టు 15నుంచి ప్రారంభం అవుతున్న సందర్భంగా ఆటో కార్మికులు చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందని వారికి వాహన మిత్ర పథకం కింద గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10వేలకు అదనంగా ఈ ప్రభుత్వం రూ.20వేలు ఇచ్చి న్యాయం చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు బ్రహ్మయ్య, శ్రీను పాల్గొని మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు వాహన చట్టం కింద రూల్స్ పాటించి జాగ్రత్తగా నడుపుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ నిబంధనలు పాటించాలని వారన్నారు. అనంతరం పశ్చిమ ప్రాంత కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు కొరివిపాటి మౌలాలి, సీతారాంపురం ఉపాధ్యక్షులు కత్తి మోషే, జాల్లపాలెం ప్రధాన కార్యదర్శి తగరం థామస్, వెదుళ్ళ చెరువు సహాయ కార్యదర్శి కారుమంచి కాశయ్య, మోటుపల్లి కోశాధికారి బి.మీరావలి, రాళ్లపల్లిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

**పెద్దదోర్నాల, ఆగష్టు 7, ప్రభాతవార్త**



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం ఒంగోలు కు విచ్చేసిన సందర్భంగా దోర్నాల మండల బీజేపీ అధ్యక్షురాలు మల్లేశ్వరి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఒంగోలు తరలి వెళ్లి పీవీఎన్ మాధవ్, యర్రగొండపాలెం నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జీ యనమల నాగేశ్వరరావులను కలిసి మర్యాదపూర్వకంగా ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల కన్వీనర్ సురవరం వీరారెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

## 11న మార్కాపురంలో మాదిగ, చర్మ, డప్పు కళాకారుల సదస్సు

### - జయప్రదం చేయాలని కాలేబు మాదిగ పిలుపు

**కొనకనమిట్ల, ఆగష్టు 7, ప్రభాతవార్త**



మార్కాపురంలో ఈనెల 11న జరిగే మాదిగ, చర్మ, డప్పు కళాకారుల సదస్సును జయప్రదం చేయాలని మాదిగ, చర్మ, డప్పు కళాకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సంద్రపాటి కాలేబు మాదిగ కోరారు. అందులో భాగంగా గురువారం మండలంలోని కొనకనమిట్ల, ఎదురాళ్ళపాడు, మునగపాడు ఎస్సీ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాలు నిండిన మాదిగ చర్మ, డప్పు కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ మహిళలకు 2 ఎకరాల వ్యవసాయ భూమి ప్రభుత్వం ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ ఆడ పడుచు పెళ్లిళ్లకు పెళ్లి కానుక పథకం ద్వారా పెళ్లి రోజే 2 లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ నాయకులు గంగవరపు నాగులు మాదిగ, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## రెండవ రోజు రగడే

### - రాత్రి 7.30గంటల వరకు 9 పంచాయతీల లెక్కలు తేల్చారు

**బల్లికురవ, ఆగష్టు 7, ప్రభాతవార్త**



స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో రగడ రగడ కొనసాగుతుంది. రాత్రి 7.30గంటల వరకు 9 గ్రామ పంచాయతీలలోని ఉపాధి హామీ పనులలో జరిగిన అవినీతి లెక్కలను తేల్చారు. ప్రత్యేకించి మల్లాయపాలెం గ్రామంలో జరిగిన అవినీతిని అబ్బారెడ్డి బాలకృష్ణ పీడీ విజయలక్ష్మి దృష్టికి తీసుకుపోయారు. సామాజిక తనిఖీ బృందాలు వెల్లడించిన అంశాలనే కాకుండా ఆధారాలతో సహా అధికారులను ప్రశ్నించారు. మండలంలో 21 పంచాయతీలలో రూ.12 కోట్ల వ్యయంతో 645 ఉపాధి హామీ పనులలో నెలకొన్న అవినీతి లెక్కలను గురువారం రాత్రికి ముగించనున్నారు. అవినీతిని కొత్త పుంతలు తొక్కించిన క్షేత్ర సహాయకుల చేతివాటాన్ని గ్రామాల నుండి వచ్చిన ప్రజాప్రతినిధులు అడుగడుగున ఖండిస్తున్నారు. అవినీతిని ఆధారాలతో సహా ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, సాంకేతిక సిబ్బంది, తమదైన శైలిలో పప్పు బెల్లాల ప్రభుత్వ ధనాన్ని పంచుకుతిన్నారు. అదేమని ప్రశ్నించేవారు లేకుండా నేతల ప్రాపకాండ కోసం తమ పాపంలో వారికి భాగం పంచారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల్లో సింహభాగం అవినీతి మకిలిని ఎండగట్టేందుకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో భాగంగానే సామాజిక తనిఖీలో పీడీ విజయలక్ష్మి తనదైన శైలిలో స్పందిస్తున్నారు. మరోవైపు ప్రజా సంఘాల నేతలు పనుల్లో జరిగిన అవినీతిని పూర్తి స్థాయిలో వెలికి తీయకపోతే ఆందోళన చేపడతామంటూ హెచ్చరిస్తున్నారు.

## గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో దోర్నాలలో జాబ్ మేళా

**పెద్దదోర్నాల, ఆగష్టు 7, ప్రభాతవార్త**






నిరుద్యోగులకు సహకారి, ఉద్యోగ కల్పనకు మార్గదర్శకుడు మన గూడూరి ఎరిక్షన్‌బాబు అని నిరుద్యోగులు సంబరాలు చేసుకున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు సహకారంతో ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో 11 కంపెనీలలో ఉద్యోగ నియామకానికి పెద్దదోర్నాల బట్టు విద్యా సంస్థల ప్రాంగణంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 124 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 80 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్ బాబు విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, తమ చదువుల్లో ఉన్న నైపుణ్యాన్ని బట్టి నైపుణ్యత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. నిరుద్యోగులుగా వచ్చిన మీరు ఉద్యోగులుగా వెళ్లాలన్నదే మన లక్ష్యం అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశాలు పొంది భవిష్యత్తు రూపుదిద్దుకోవాలన్నారు. ప్రేరణాత్మక ప్రసంగాలలో గూడూరి ఎరిక్షన్‌బాబు నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షేక్ మాబు మాట్లాడుతూ యువత భవిష్యత్ కోసం సంకల్పంతో గూడూరి ఎరిక్షన్‌బాబు ముందుకు సాగుతున్న ప్రజా నాయకుడని, ఎరిక్షన్‌బాబు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు తన వంతు బాధ్యతగా భావించే నాయకత్వ లక్షణాలున్న ప్రజాసేవకుడని అభినందించారు. యువతకు ఆత్మ విశ్వాసాన్ని నింపుతూ మనోధైర్యానిస్తూ ప్రోత్సహిస్తున్నారని ఈ నాయకుడి సేవలు ఆయా కుటుంబాలలో వెలుగులు నింపుతున్నాయన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ డీఈఓ రమాదేవి మాట్లాడుతూ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు చిన్న, పెద్ద కంపెనీ అని చూసుకోకుండా అనుభవం పెంచుకోవాలన్నారు. యువతకు ప్రైవేటు రంగ ఉపాధి అవకాశాలను కల్పించడంలో ప్రభుత్వ భరోసా మేలు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావు, స్కిల్ డవలప్‌మెంట్ సంస్థ అధికారులు శ్రీనివాసచారి, స్కిల్స్ హబ్ కోఆర్డినేటర్స్ ఎస్కే ఫిరోజ్‌గాంధీ, విజయ కుమారి, బట్టు విద్యా సంస్థల చైర్మన్ బట్టు రమణారెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సొసైటీ బ్యాంకు అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఏరువ మల్లిఖార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ హరగోపాల్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జంగిల్ పిచ్చయ్య, ఎస్సీ జిల్లా నాయకులు చంటి, జనసేన మండల కన్వీనర్ కేతి, వెంకట మురళి, బీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పర్షపోగు బెంజిమెన్, పవన్ కుమార్‌రెడ్డి, ఎస్కే భాష, రిత్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పెండింగ్ రికార్డుల వెర్ఫికేషన్‌పై అవగాహన

**ముండ్లమూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని మండల వ్యవసాయాధికారి వారి కార్యాలయం నందు గ్రామ స్థాయి సిబ్బంది అయిన వీఏఏలు, వీహెచ్ఏలు, వీఆర్వోలకు మండల తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పెండింగ్ రికార్డుల గురించి వెర్ఫికేషన్ చేయించుటకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కొరకు తహసీల్దార్ లాగిన్ నందు ఉన్న వ్రాంగ్ ఆదార్ సీడ్స్ రికార్డ్స్, డెత్ కేస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని తెలియజేశారు. డెత్ కేసులో ఉన్న రికార్డులను మ్యుటేషన్ ద్వారా కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూర్చుట, జాయింట్ ఎల్‌పీఎంలో ఉన్న రికార్డులను వీఆర్వోల ద్వారా సరిచేయించుట, వ్రాంగ్ ఆదార్ సీడ్స్ ఉన్న రికార్డులను లబ్దిదారుల ద్వారా సరి చేయించుట తదితర వాటిపై చర్చించారు.

## మోడల్‌స్కూల్‌లో గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన

**ముండ్లమూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త**




ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశానుసారం దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రామారావు ముండ్లమూరు ఎస్సై కే.కమలాకర్, ముండ్లమూరు సిబ్బందితో కలిసి ముండ్లమూరు గ్రామంలోని ఏపీమోడల్ స్కూల్ నందు అవేర్నెస్ ఫ్రోగ్రామ్స్ సంబంధించి విద్యార్థులతో కలిసి మీటింగ్ నిర్వహించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, డ్రగ్స్ గురించి సైబర్ నేరాల గురించి, రోడ్డు యాక్సిడెంట్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారికి తెలియజేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పది బెంచిలు బహుకరణ

**దర్శి, ఆగష్టు 7, ప్రభాతవార్త**




ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు కూర్చోవడానికి, సౌకర్యార్థం కీ.శే అయిన చావా వెంకట నాగేశ్వరరావు జ్ఞాపకార్థం మేరకు వారి మనవడు నాగచైతన్య కళాశాలకు పది బెంచీలు బహుమానం చేశారు. వీరు ప్రవాసా భారతీయుడు(కెనడా)లో ఉన్నత స్థాయిలో ఉండి కూడా దర్శి ప్రాంత వాసి కావడం చేత ఈ గొప్ప కార్యక్రమం చేశారు. వీరి మామ అయిన దర్శి ఎంఆర్ఎఫ్ టైర్ల డీలర్ చావా శ్రీనివాసరావు సహకారంతోనే నేను ఈ స్థాయిలో ఉన్నాను అని గర్వంగా చెప్పారు. దర్శి ప్రాంతంలో సమాజ సేవకుడు జీవీ రత్నం కూడా వారిని ప్రోత్సహించి బెంచీలను బహుమానం చేయించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌ఛార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ప్రభుదాసు, ఇంగ్లీష్ లెక్చరర్ డాక్టర్ ఏ.నగేష్, తెలుగు లెక్చరర్ డాక్టర్ గంధం వేణు, కంప్యూటర్ లెక్చరర్ కే.రవీంద్ర, సహా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

**దర్శి, ఆగష్టు 7, ప్రభాతవార్త**




తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం ఆఖరి రోజు పాముల కాలని వన్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించడం జరిగింది. దర్శి ప్రాజెక్టు సీడీపీఓ పరిమళ ఈ కార్యక్రమాన్ని గురించి వ రా ట్ల ా డ ు త ూ ర ా ముర్రుపాలు యొక్క విశిష్టతను గురించి తల్లులు ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, రెండు సంవత్సరాలు అదనపు ఆహారంతో పాటుగా తల్లిపాలు కొనసాగించాలని తల్లులకు తెలియజేశారు. సూపర్‌వైజర్ అనురాధ మాట్లాడూ తల్లిపాలు ఇవ్వడం వలన తల్లులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సీహెచ్ సుభాషిని, సునీత, ఇందిరా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## పేదరికం నిర్మూలనపై దృష్టి సారించాలి

**తాళ్లూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త**

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని దర్శి నియోజకవర్గ ప్రత్యేకాధికారి జాన్ సన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4 పథకంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు చురుకైన పాత్ర పోషించనున్నారని అందుకు ముందుకు సర్వేను పూర్తి చేసి లక్ష్యాలను నిర్ణయించాల్సి ఉందని అన్నారు. మండలంలో కేవలం 15 శాతం మాత్రమే పూర్తి చేశారు. జిల్లాలో వెనుకబడి ఉందని అన్నారు. సోమవారం లోపు ఎట్టి పరిస్థితులలో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ బచ్చల వెంకట రమణారావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అన్నదాతల సంక్షేమం కోసమే బర్లీ కొనుగోలు కేంద్రాలు

### - రిజెక్ట్ చేసే ప్రసక్తే లేదు.. ప్రతి రైతు పంట కొనుగోలు చేస్తాం

### - వెల్లంపల్లి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఏలూరి

**మార్టూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త**



కష్టాల్లో ఉన్న అ న్ న ద ా త ల న ు ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని, అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో రైతులతో కలిసి బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన పొగాకు చెక్కుల తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకోవాలని సంకల్పంతో కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం దిశగా అడుగులు వేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో నేరుగా మార్కెట్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియ చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనం అన్నారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. రైతులందరూ సమయమనం పాటించి పంటను తీసుకురావాలన్నారు. ప్రతి రైతు పొగాకును గ్రేడింగ్ చేసి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రైతులను ఆదుకోవాలని లక్ష్యంతోనే కొనుగోలు నిర్ణయం తీసుకున్నామని గ్రేడింగ్ చేస్తే కంపెనీ రిజెక్ట్ సీఆర్ ఉండమన్నారు. ప్రతి రైతు పంట కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, సీనియర్ బయ్యర్ సుబ్రహ్మణ్యం, ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షుడు వల్లేరు మార్క్, ఇంకొల్లు పీఏసీఎస్ అధ్యక్షులు కర్రి శ్రీనివాసరావు, రైతులు గంటా బాబు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చాడంటే.. అమలు కావాల్సిందే

**మార్టూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త**



ఇటీవల వలపర్ల పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మంచినీటి సమస్యను ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి వెంటనే మంచినీటి బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ మేరకు గురువారం పాఠశాల ఆవరణంలో మంచినీటి బోరుకు సర్పంచ్ బ్రహ్మయ్య కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.

## మాదక ద్రవ్యాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

**మార్టూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త**



మార్టూరులోని రాయల్ ప్రైవేటు జూనియర్ కాలేజీ నందు మార్టూరు సీఐ, ఈగల్ సెల్ బాపట్ల వారి ఆధ్వర్యంలో ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ ఆదేశాల మేరకు విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెడు అలవాట్లకు లోనై మాదక ద్రవ్యాలు వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల పాత్ర ఎంతో గణనీయమైందని యువతీ యువకులు విద్యార్థులు డ్రగ్స్ అనే విషపు ఊపిరిని తీసుకుంటూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్ శరీరానికి హానీకరం మాత్రమే కాదు కుటుంబ, సమాజాన్ని నష్టం కలిగిస్తుంది ఇవి ఒక సారి వాడటం మొదలుపెడితే మానడం కష్టం. డ్రగ్స్ వాడకంతో వచ్చే సమస్యలతో ముఖ్యమైనవి గుండె సంబంధిత, మానసిక వ్యాధులపై ప్రభావితం చేస్తాయి. కుటుంబ సమస్యలు, నేరాల బాటలోకి వెళ్లే ప్రమాదం. దేశ అభివృద్ధిలో మన పాత్ర ఉండాలి అంటే మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా, మనసుకు నచ్చిన లక్ష్యాన్ని ముందు ఉంచుకుని కష్టపడాలని తెలిపారు. 1972 ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదాలు పలికించారు.

## సీపీఎం పార్టీ సభ్యులు అమీర్ తల్లి మృతి

**హనుమంతునిపాడు, ఆగష్టు 7, ప్రభాతవార్త**



సీపీఎం ప్రకాశం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ ఆఫీసు కార్యదర్శి కామ్రేడ్ ఎస్కే అమీర్ తల్లి షేక్ కాశింబి(85) గురువారం ఉదయం 10.30గంటలకు అనారోగ్య కారణాలతో మరణించారు. వారి స్వగ్రామం హనుమంతునిపాడు మండలం దొడ్డిచింతల గ్రామంలో కాశింబి భౌతిక కాయాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు, కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, సయ్యద్ హనీఫ్, చీకటి శ్రీనివాసరావు, సీపీఎం సీనియర్ నాయకులు వై.సిద్దయ్య, జాలా అంజయ్య, కనిగిరి, పామూరు, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం సీపీఎం మండల నాయకులు పీసీ కేశవరావు, బడుగు వెంకటేశ్వర్లు, ఊసా వెంకటేశ్వర్లు, పిల్లి తిప్పారెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్, సీపీఎం సోషల్ మీడియా జిల్లా బాధ్యులు కే.గురుస్వామి, రజక వృత్తి దారుల సంఘం నాయకులు రాయళ్ల మాలకొండయ్య, బి.వెంకటరావు, ఎస్.సుబ్బారెడ్డి, వినోద్, నరేంద్ర, రవి తదితరులు కాశింబి భౌతికకాయానికి నివాళులర్పించారు.

## విద్యాలయాల కేంద్రంగా చోటు చేసుకుంటున్న

# లైంగిక వేధింపులకు బ్రేక్ పడుతుందా?

### - పర్యవేక్షణ నియంత్రణలో లోపిస్తున్న సమన్వయం

### - మొక్కుబడి విచారణలు మెరుగు పడని పరిస్థితులు

**సింగరాయకొండ, ఆగష్టు 7,ప్రభాతవార్త**

లైంగిక వేధింపులు, అత్యాచారాలు,సైబర్ నేరాలు, చట్టాలు, నేర మనస్తత్వం తో విద్యాలయాల కేంద్రంగా చోటు చేసుకుంటున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.ప్రభుత్వం, పోలీస్ శాఖలు చేపట్టిన ప్రత్యేక చర్యలు ప్రజల తో పాటు పాఠశాల విద్యార్థుల లోని ఆలోచన కలిగిస్తుంది. పాఠశాల స్థాయి నుండి ఉపాధ్యాయులు సంస్కారాలు, సత్ప్రవర్తన,మంచి స్నేహం, క్రమశిక్షణ, స్వీయ రక్షణ పరిరక్షణ నియంత్రణ, మైనర్ బాలిక సంరక్షణ చట్టాల పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల జీవితాలు పదిలంగా, ఉన్నతంగా ఉండేందుకు తల్లి దండ్రులు తమ పిల్లల్ని దేవాలయం వంటి పాఠశాలలు విద్యాసంస్థలలో చేర్పించి నిశ్చింతగా ఉంటారు. నాటి గురుకులాలు, విద్యాలయాలలో ఉన్న పరిస్థితులు నేడు ఎండమావులుగా ఉన్నాయి అని చెప్పక తప్పదు. సమాజం లో చోటు చేసుకుంటున్న సంఘటనలు మహిళలపై జరుగుచున్న అరాచకాలు, అత్యాచారాలు వేధింపులు పాఠశాలల కేంద్రంగా చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తుంది. అలాంటి ఆందోళన కలిగించే పరిస్థితులు ప్రకాశం జిల్లా లో అనేకం వెలుగు చూస్తున్నాయి. ఒంగోలు డివిజన్ పరిధిలోని కారుమంచి, ఊళ్ల పాలెం,పాకల, జరుగుమల్లి తో పాటు పలు ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రుల కన్నా ప్రధానమైన స్థానంలో ఆదర్శంగా ఉండ వలసిన ఉపాధ్యాయులే లైంగిక వేధింపులకు పాల్పడడం దేహశుద్ధి చేసిన పంచాయితీలు వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. పాఠశాల, బాలికల పరువు ప్రతిష్ఠ భవిష్యత్ దృష్ట్యా పాఠశాల, గ్రామ పంచాయతీ పరిధిలో పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అక్కడికక్కడే సమస్యను సర్దుబాటు చేయడం తో ఇలాంటి సంఘటనలు వెలుగు చూడడం లేదు. అయితే ఇటీవల సింగరాయకొండ,జరుగుమల్లి మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చోటుచేసుకున్న సంఘటనల పై జిల్లా కలెక్టర్ కి అందిన ఫిర్యాదు తో ఒక అడుగుముందుకు వేసి జిల్లా కలెక్టర్ త్రిసభ్య కమిటీ తో సమగ్ర విచారణ చేపట్టారు. తాజాగా గిద్దలూరు ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడికి విద్యార్థిని పై లైంగిక వేధింపుల కేసులో ఫోక్సో చట్టంకింద నమోదయిన కేసులో ఆ ఉపాధ్యాయుడికి న్యాయస్థానం జీవిత ఖైదు తో పాటు గా జరిమాన కూడా విధించింది.ఈ వార్త జిల్లా లో పెద్ద చర్చకి దారితీసింది. పాఠశాలల్లో మానవ మృగాల తరహాలో బాలికల పై అత్యాచార యత్నం,అఘాయిత్యాలు,వేధింపులు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం, పోలీస్ లు,మానవ హక్కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు,మేధావులు,గ్రామ పంచాయతీ పెద్దలు చొరవ తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

Main tab page 5_23_Main tab page 5_23.qxd 8/8/2025 12:30 AM Page 1



## సీపీఐ రాష్ట్ర మహాసభల ప్రచారంలో భాగంగా కనిగిరిలో కళాజాత

**కనిగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త**



సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ఈనెల 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న నేపధ్యంలో ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గురువారం కనిగిరి పట్టణంలోని గుజ్జుల యలమందరెడ్డి నగర్, హనీఫ్ నగర్, సుగుణమ్మ హాస్పిటల్ కూడలి వద్ద, పామూరు బస్టాండ్ వద్ద కళాజాతలు నిర్వహించారు. కామ్రేడ్ గుజ్జుల యలమందరెడ్డి, సరళాదేవి స్థూపాల సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసిన్, సహాయ కార్యదర్శి పందిటి మోహన్, మండల కార్యదర్శి జీపీ రామారావు, గులాం హుస్సేన్ పాల్గొని రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళాజాతల్లో రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఏఐటీయుసీ నాయకులు కాశీం పీరా, ఏఐఎస్ఎఫ్ నేత ఇఫ్రోజ్ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం పెంచలయ్య, ప్రకాశం జిల్లా మహిళా సమైక్య అధ్యక్షులు అనంతలక్ష్మి, ప్రజానాట్య మండలి కళాకారులు శివయ్య, గురప్ప, నాగరాజు, లక్ష్మి, ఓబులమ్మ, తేజ, సౌందర్య, రజిని తదితరులు కళాప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు.

## కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

**- చైర్మన్ అబ్దుల్ గఫార్**

**కనిగిరి, ఆగస్టు7, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేసే దిశగా మున్సిపాలిటీ కృషి చేస్తోందని, ఈ అభివృద్దిలో ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. గురువారం 14వ వార్డు పరిధిలోని బొద్దుచావిడి ప్రాంతాన్ని సందర్శించి ఆయన, ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొద్దుచావిడి నుండి నాజ్ సెంటర్ వరకు అలాగే కన్యకా పరమేశ్వరి దేవస్థానం వరకు ఏర్పాటు చేసిన రోడ్డు పనులను పరిశీలించారు. దొరువు వైపు రోడ్డులో సిమెంట్ రోడ్డు అవసరమని ప్రజలు తెలియజేయగా, వెంటనే స్పందించిన చైర్మన్ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్తగా నిర్మించిన రోడ్డును త్వరలో స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా ప్రారంభించనున్నాం, భవిష్యత్తులో దొరువు నుండి ఓవీ రోడ్డు వరకు రోడ్డు, కాలువల నిర్మాణం చేపడతాం అని చైర్మన్ తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని, స్థానిక ప్రజలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, కాంట్రాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ డ్రైవ్- ప్రజలు సహకరించాలని కమీషనర్ పిలుపు

**- 3,4వ సచివాలయాల్లో మురుగు కాలువల శుభ్రత- చెట్ల తొలగింపు పనులు**

**కనిగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీల్లో పారిశుధ్యం మెరుగుపర్చే లక్ష్యంతో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమీషనర్ పి.కృష్ణ మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం 3,4వ సచివాలయాల పరిధిలో శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా శంఖవరం, చింతలపాలెం, ఎస్సీ కాలనీ వంటి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు, చెత్తను తొలగించడమే కాక, మురుగు కాలువలను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించినట్లు కమీషనర్ తెలిపారు. ప్రజలు వ్యర్థాలను రోడ్లపై లేదా డ్రైనేజీ కాలువల్లో వేయకుండా ఖచ్చితంగా పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్యం, తాగునీరు సరఫరా వంటి అంశాలపై స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నామని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శానిటేషన్ విభాగంలో ప్రతి ఒక్కరు విధిపట్ల అంకితభావంతో పని చేయాలి, ప్రజల భాగస్వామ్యం లేకుండా పరిశుభ్రత సాధ్యం కాదు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇర్రి కోటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన యారవ

**పామూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



పామూరు పట్టణ టీడీపీ కమిటీ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి తల్లి కి.శే ఇర్రి కోటమ్మ పెద్ద కర్మ కార్యక్రమంలో కనిగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఎస్డీ అమీర్‌బాబు, మాజీ సీఎస్‌పురం సింగిల్ విండో అధ్యక్షుడు బోయళ్ళ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ కావేటి సుబ్బయ్య, పట్టణ టీడీపీ కమిటీ కార్యదర్శి నోస్సం నాగేంద్ర చారి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పిడుగు శ్రీను, పట్టణ టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే రసూల్(కావేరి), అంచురి వెంకటరెడ్డి, ఓగురి నరసింహారావు, మాలపాటి వెంకటేశ్వరరెడ్డి, పేరం రఘునాథరెడ్డి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ నూతన కమిటీ ఎన్నిక

**మార్కాపురం రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త**



మార్కాపురం పట్టణంలోని స్థానిక సెంటినరి బాప్టిస్ట్ (ఎస్ఐబి ఐక్య బాప్టిస్ట్) చర్చిలో 2025 జూలై నెలలో చర్చికి సంబంధించి ఎటువంటి ఎన్నికలు జరగలేదని గతంలో ఉన్న పూర్వ కార్యవర్గ సభ్యుల సారధ్యంలోనే చర్చికి సంబంధించిన అన్ని ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు జూలై నెల వరకు కొనసాగుతున్నాయని చర్చి సభ్యులకు, ప్రజలకు స్పష్టముగా తెలియజేస్తున్నామని మార్కాపురం బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జే దేవదానం పత్రికాముఖంగా తెలిపారు. ఆగస్టు నెలలో చర్చిలో ఎన్నికలు జరిగాయని నూతన కమిటీలో చర్చి ప్రెసిడెంట్‌గా కటికల చార్లెస్, సెక్రటరీగా విడుదల ప్రసంగి, ట్రెజరర్‌గా కటికల కిరణ్ కుమార్‌ను ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా చర్చి నూతన కమిటీకి ఆయన అభినందనలు, హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్త్రీ శక్తి పథకానికి ఆర్టీసీ బస్సులు సిద్ధం

**- బస్సుల కండిషన్, టాయిలెట్స్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

**- ఒంగోలు ఆర్ఎం సత్యనారాయణ**

**కొనకనమిట్ల, ఆగస్టు 7, ప్రభాతవార్త**



పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌ను ఒంగోలు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.సత్యనారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్త్రీ శక్తి పథకం ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధానంగా బస్సుల కండిషన్, టాయిలెట్స్, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఓఆర్ 70శాతం ఉండగా ఆగస్టు 15నాటికి 90శాతం అంచన వేస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఎక్కువగా ఉన్న చోట ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వినతుల మేరకు అదనపు బస్సు సర్వీసులు కూడా నడపనున్నట్లు ఆయన తెలిపారు. టికెట్లపై ప్రయాణపు వివరాలతో పాటు ధర కూడా ఉంటుందని, ఏదైనా గుర్తింపు కార్డు చూపించి మహిళలు ఉచితంగా జీరో టికెట్ తీసుకొని ప్రయాణించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఆర్టీసీ డీఎం శంకరరావు, సీఐ ధనలక్ష్మి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యం

**నాగులుప్పలపాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



ఉప్పుగుండూరు సెక్టార్‌లోని చదలవాడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే.ప్రమీల పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా లాగా పని చేస్తుందని, తల్లిపాలు ద్వారా తల్లికి కూడా శ్రమ తగ్గుతుంది, ఖర్చు తగ్గుతుందని, అలాగే రొమ్ము క్యాన్సర్ వ్యాధులు కూడా రాకుండా ఉంటాయని, బిడ్డకి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, చురుకుదనం తెలివి తేటలు జ్ఞాపక శక్తి భాగా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు ఐ.ప్రణీత, అరుణ, సీహెచ్ నిరీక్షణ, ఎంఎల్‌హెచ్‌పీ ఎనోషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటల పోటీలు

**నాగులుప్పలపాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా మాచవరం హైస్కూల్ నందు విద్యార్థినీ, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌యం శివరాం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టిన బిడ్డలకు తల్లిపాలు తాగించాలి

**నాగులుప్పలపాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడులో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ అన్నపూర్ణ తల్లి పాల ఆవశ్యకత గురించి వివరించారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాలు తాపించడం మంచిదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవులూరి వారి వివాహ వేడుకలో పాల్గొన్న మాదాసి

**టంగుటూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



పొన్నలూరు మండలం పెద్దవెంకన్నపాలెం గ్రామానికి నవులూరి ప్రసాద్, రమాదేవిల కుమార్తె చాందిని వివాహ వేడుకలో కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలకూరపాడు రోడ్డును పూర్తిగా మరమ్మతులు చేయాలి

**టంగుటూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**

మండలంలోని ఆలకూరపాడు రోడ్డును వెంటనే మరమ్మత్తులు చేయాలని టంగుటూరు మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులను ఎంకే బేగ్ కోరారు.

## 12,13వ తేదీల్లో కనిగిరిలో జరిగే వ్య.కా.సం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**సంతనూతలపాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



ఈనెల 12,13వ తేదీలలో కనిగిరిలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆయా సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు కోరారు. సంతనూతలపాడు మండలం లోని బి.మాచవరం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కూలీలు 70 శాతం మంది ఆధారపడి జీవిస్తున్నారని వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య ఏర్పాటు చేసిన సంఘం వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించుకునేందుకు అనేక ఉద్యమాలు చేపట్టిందని ఆయన అన్నారు. పేదలు ఎదుర్కొంటున్న కూలి, భూమి, ఇళ్ల స్థలాల కోసం అనేక ఉద్యమాలు చేసి సాధించుకుందని ఆయన అన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం కనిగిరిలో జరిగే మహాసభలో చర్చించుకుని వాటి అమలుకు పూనుకునేందుకు ఈ మహాసభలు జరుగుతున్నాయని కావున ప్రజలందరూ పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పీ-4 బంగారు కుటుంబాల దత్తత పూర్తి చేయాలి

**- స్పెషల్ ఆఫీసర్ వరకుమార్**

**సంతనూతలపాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త**





గ్రామాల్లో పీ-4లో పెండింగ్ బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలని సంతనూతలపాడు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎస్.వరకుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన పీ-4 పై మండల స్థాయిలో సమీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. గ్రామాల్లో బంగారు కుటుంబాల సర్వే ను వెంటనే పూర్తి చేసి ఇందుకు మార్గదర్శకులను గుర్తించి మ్యాపింగ్ చేయాలని స్పెషల్ ఆఫీసర్ వరకుమార్ వెల్లడించారు. ఒక ప్రణాళిక బద్ధంగా ఈ సర్వే తయారు చేసి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సంతనూతలపాడు మండల తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## బిజేపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను కలిసిన పివి కృష్ణారావు

**మార్కాపురం రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త**

ఒంగోలు నగరంలో జరుగుతున్న సారధ్యం కార్యక్రమానికి విచ్చేసిన బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివి మాధవన్‌ను నగరంలోని ఆర్అండ్‌బి అతిధి గృహం నందు మార్కాపురం నియోజకవర్గ బిజేపి అసెంబ్లీ అతిధి గృహము నందు మార్కాపురం నియోజకవర్గ బిజేపి అసెంబ్లీ ఇన్చార్జి పివి కృష్ణారావు కలిశారు.



ఈ సందర్భంగా పశ్చిమ ప్రాంత ప్రజల వెన్నెముక అయిన వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తయి ప్రజలకు నీరు అందే విధంగా చూడాలని, అదే విధంగా ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో మార్కాపురం అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. మూలన పడిన మెడికల్ కళాశాలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ ప్రాంతంలో అధిక శాతం అసైన్‌మెంట్ భూములు ఉన్న కారణంగా కేంద్ర ప్రభుత్వం సంస్థలను నెలకొల్పి యువతకు ఉద్యోగ అవకాశాలు కలిగే విధంగా కృషిచేయాలని కోరారు.

## కంభంలో ఆర్మీ ఉద్యోగి గృహంలో చోరీ

**కంభం, ఆగస్టు 7 ప్రభాతవార్త :**



కంభం పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. పట్టణంలోని స్థానిక వెంకటేశ్వర నగర్‌లో నివాసముంటున్న ఆర్మీ ఉద్యోగి రవికుమార్ రెడ్డి గృహంలో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వెళ్ళిన సమయంలో ఇంటి తాళం పగలగొట్టిన దుండగులు లోపలికి ప్రవేశించారు. గృహంలోని బీరువాలు పగలగొట్టి 2తులాల బంగారు, 20తులాల వెండి, రూ.50వేల నగదు అపహరించుకుని వెళ్ళారు. ఈ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట శిబిరాలపై మెరుపుదాడి చేసిన ఎస్పై శివ బసవరాజ్

**త్రిపురాంతకం, ఆగస్టు 7 ప్రభాతవార్త :**



మండలంలోని కొత్తముడివేముల గ్రామం వెలుపల చెట్లపొదల్లో గురువారం పేకాట ఆడుతున్న జూదరులను చాకచక్యంగా ఎస్పై శివబసవరాజ్ మరియు తన సిబ్బందితో కలిసి దాడి జరిపి వద్ద నుండి రూ.1,02,150ల నగదు, 5మోటారు సైకిళ్ళు, 6సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న జూదరులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్పై శివ బసవరాజ్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్పై శివ బసవరాజ్ వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**- సిపిఐ మండల కార్యదర్శి జివి గురునాధం**

**పుల్లలచెరువు, ఆగస్టు 7 ప్రభాతవార్త**



సిపిఐ శతజయంతి సందర్భంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆగస్టు 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరిగే సిపిఐ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జివి గురునాధం గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మండలంలోని తెల్లగట్ల, ముతుకుల, మానేపల్లి, ఐటివరం గ్రామాలలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు డి శ్రీనివాస్ మాట్లాడుతూ వెలుగొండ పూలసుబ్బయ్య ప్రాజెక్టుకు నిదులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రాజెక్టు ద్వారా తీగలేరు కాలువకు నిధులు కేటాయించి పనులు చేపటాలని కోరారు. నిరంతరం ప్రజా ఉద్యమాల్లో పాల్గొని బడుగు, బలహీన వర్గాలు ప్రజా శ్రేయస్సు కోసం పోరాడే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఈ మహాసభల్లో కవులు, మేధావులు, విప్లవకారులు, జిల్లా, రాష్ట్ర, జాతీయ సిపిఐ ప్రతినిధులు వివిధ రకాల కళారూపాలతో జరిగే మహాసభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, సహాయ కార్యదర్శి గుంటూరు శ్రీనివాసా చారి, ముటుకుల శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైటి వెంకటేశ్వర్లు, మర్రివేముల శాఖ కార్యదర్శి కంచర్ల గురవయ్య గౌడ్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ను కలిసిన గిద్దలూరు బిజేపి నాయకులు

**గిద్దలూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త :**



జిల్లా కేంద్రమైన ఒంగోలులో నిర్వహించిన సమావేశంలో భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ను జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు పివి శివారెడ్డిలతోపాటు గిద్దలూరు నియోజకవర్గ బిజేపి నాయకులు గురువారం కలిశారు. నియోజకవర్గం నుండి పట్టణ బిజేపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, మాజీ జిల్లా ఉపాధ్యాక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, గిద్దలూరు పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు శివపురం రవికుమార్ రెడ్డి, డి మహేష్ తదితర నాయకులు బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ను కలిశారు.

## ముర్రుపాలతో మెరుగైన రోగ నిరోధక శక్తి : సిడిపిఓ పద్మావతి


**మార్కాపురం రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :**



పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే పిల్లలలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గోగులదిన్నె అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ తల్లిపాల వలన బిడ్డకు సరైన పోషకాహారం అందుతుందని అన్నారు. చర్మ సంబంధ సమస్యలు రావని వివరించారు. చిన్నారుల మానసిక వికాసానికి, మెదడు చురుగ్గా పనిచేయడంలో ముర్రుపాలు మంచి పాత్ర పోషిస్తాయని తెలిపారు. తల్లిపాలు త్వరగా జీర్ణం కావడం వలన పిల్లల శారీరక, మానసిక పెరుగుదల, వికాసము బాగుంటుందని అన్నారు. సూపర్‌వైజర్ షేక్ నీలోఫర్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం అనే ప్రక్రియ ద్వారా తల్లి, బిడ్డ మధ్య దృఢమైన బంధం ఏర్పడుతుందని అన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు ముర్రుపాలు తాపడం తప్పనిసరిగా చేయాలని అని స్పష్టం చేశారు. దీని వలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అలాగే తల్లి కూడా ఆరోగ్యం గా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పదం జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్, మహిళా పోలీస్ భాగ్యలక్ష్మి, కార్యకర్తలు మల్లీశ్వరి, లలితమ్మ, ఏఎన్ఎం విజయ, ఆయా, తల్లులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులకు ఘన సన్మానం

**తాళ్లూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



మండలంలోని బొద్దికూరపాడు సచివాలయంలో సర్పంచ్ మందా శ్యాంసన్, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇటీవల బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, నలుగురు సచివాలయ ఉద్యోగులను, అలాగే ఇన్‌ఛార్జి కార్యదర్శిగా పని చేసిన అల్లం వెంకటేశ్వర్లును గురువారం ఘనంగా సన్మానించారు. సచివాలయ ఉద్యోగులను శాలువాలు, పూలమాలలు, మెమోంటో అందజేసి సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాల కోటయ్య, ఎం.బ్రహ్మారెడ్డి, పోలంరెడ్డి రమణారెడ్డి, సుబ్బారెడ్డి, సంగన యోగిరెడ్డి, పులి అంజిరెడ్డి, సన్నపురెడ్డి అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన మాజీమంత్రి శిద్దా

ఒంగోలు సాయి ఐ.టి.ఎ.కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మొగిలి విష్ణువర్ధన్‌రావు,పద్మజ దంపతుల కుమార్తె జ్యోత్స్న బ్రహ్మకుమార్‌ల వివాహం వేడుకలకు రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శిద్దా రాఘవ రావు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.



Main tab page 8_Main tab page 8.qxd 8/8/2025 12:31 AM Page 1



## అత్యాధునిక వైద్య సేవలతో అపోలో స్పెక్ట్రా

### - అపోలో స్పెక్ట్రా తొలి వార్షికోత్సవం వేడుకలు
### - ఆరోగ్యశ్రీ, భీమా సేవలు త్వరలో అందుబాటులోకి

**చీరాల, ఆగస్టు 7, ప్రభాతవార్త**




చీరాల పట్టణానికి ప్రామాణిక వైద్య సేవలను అందిస్తూ ప్రజల్లో విశ్వాసం సంపాదించుకున్న అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ తొలి వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హాస్పిటల్లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ రవి కిరణ్ మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలతో నాణ్యమైన వైద్యం అందించడమే మా లక్ష్యం అపోలో స్పెక్ట్రా వైద్య సేవలు 24 గంటల పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ట్రామా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజి, న్యూరాలజీ సహా పలు విభాగాల్లో ప్రత్యేక వైద్య నిపుణులు ఇప్పటి నుంచి చీరాల హాస్పిటల్లోనే అందుబాటులో ఉన్నారని వెల్లడించారు. మొత్తం 10 వైద్య విభాగాల్లో నిపుణులతో కార్పొరేట్ వైద్యాన్ని అందరికి అందుబాటులో ఉండేలా సేవలందిస్తున్నాం అన్నారు. అత్యవసర వైద్య సేవలకు గుంటూరు, విజయవాడలకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. భీమా సేవలతో ఊరట రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇప్పటికే రీయింబర్స్‌మెంట్ సదుపాయం అందుబాటులో ఉందని, అక్రిడిటేషన్ కొరకు అవసరమైన ప్రణాళికలు పూర్తయ్యాయని డాక్టర్ రవికిరణ్ తెలిపారు. త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు. భీమా పాలసీలతో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉండటం రోగులకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి వైద్య సేవల లక్ష్యం చిన్న పట్టణమైన చీరాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన అపోలో స్పెక్ట్రా హాస్పిటల్, అత్యాధునిక పరికరాలు, స్వచ్ఛమైన వాతావరణం, నిపుణులైన వైద్యులతో ప్రజల్లో విశ్వసనీయతను సంపాదించిందన్నారు.

**సామాజిక బాధ్యతతో ముందుకుః**

కార్పొరేట్ సామాజిక బాధ్యత సీఎస్ఆర్‌లో భాగంగా రామపురం, వీరన్నపాలెం గ్రామాలను దత్తత తీసుకున్నట్లు డాక్టర్ రవికిరణ్ తెలిపారు. ఈ గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హాస్పిటల్ యాజమాన్యం సంకల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్‌లో సేవలందిస్తున్న వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిరుపమ(ఎండీ), డాక్టర్ గోపి వర్మ(ఎండీ), డాక్టర్ ఫణికుమార్(డీఎన్‌బీ), డాక్టర్ వంశీ(ఎండీ), డాక్టర్ రంగనాథ్(ఎంఎస్), డాక్టర్ లత(ఎండీ), డాక్టర్ సరోజిని నాయుడు(ఎండీ), డాక్టర్ సజ్న(బీడీఎస్), డాక్టర్ కార్తీక్(ఎంపీహెచ్), వీరి సేవలతో హాస్పిటల్ మరింత వైద్య ప్రాముఖ్యతను సంపాదించిందని నిర్వాహకులు తెలిపారు.

## విద్యార్థులను ఆకట్టుకుంటున్న చేనేత పరిశ్రమ

**చీరాల, ఆగస్టు 7, ప్రభాతవార్త**




అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత వ్యవస్థ గురించి తెలుసుకొనుటకు విజయాడ మేరీస్ స్టెల్లా కాలేజీ, హిస్టరీ అండ్ టూరిజం స్టూడెంట్స్ ఉపాధ్యాయ బృందంతో పాటు సుమారు 50 మంది వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నంలోని పవనపుత్ర హ్యాండ్లూమ్స్(వెంగళ భరత్‌బాబు) షాపు సందర్శించారు. చేనేత వ్యవస్థలోని యారన్, డయింగ్, ఆసు యంత్రాలు, పొడుగు నుంచి పాగడి తయారు చేయుట, అచ్చు అతుకుట, అల్లుకట్టుట, మొదలగు అన్ని ఉప వృత్తులతో పాటు మగ్గం నేయుట వంటి చేనేత సంబంధిత పనులను చూసి తెలుసుకున్నారు. చీరా తయారీలో ఉన్న కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చినటువంటి స్టూడెంట్స్ అడిగిన అన్ని చేనేత విధివిధానాల గురించి క్షుణ్ణంగా తెలియజేసి చేనేత కార్మికులు చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య చొరువతో చేనేతకుప్పడం చీరకు జాతీయ గుర్తింపు రావడం చీరాల చేనేతకు కొత్తఉత్సాహాన్ని నింపిందని రావడం చీరాల చేనేతకు కొత్త ఉత్సాహాన్ని నింపిందని తద్వారా చీరాల చేనేతకు మంచి ఆదరణ గుర్తింపు లభిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు వెంగళ భరత్‌బాబు, మాచర్ల సాంబశివరావు, పెరిసెట్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## దగ్గుబాటి వెంకటేశ్వర్లు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### - కారంచేడు పోరాట బాధిత కమిటీ

**చీరాల, ఆగస్టు 7, ప్రభాతవార్త**




పర్చూరుమాజీ శాసనసభ్యులు మాజీ ఎంపీ డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఇటీవల విడుదల చేసిన ఓ వీడియోలో కారంచేడులో దళితుల మారణకాండ ఘటనకు తన తండ్రి ప్రమేయం ఏమి లేదని చేసిన వ్యాఖ్యలు కారంచేడు మొత్తం వీరుల రుదిరక్షేత్రం సాక్షిగా తీవ్రంగాఖండిస్తున్నామని కారంచేడు పోరాట బాధిత కమిటీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ దుడ్డు భాస్కరరావు అన్నారు. దగ్గుబాటి వెంకటేశ్వర్లు వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం విజయనగర కాలనీ గ్రామంలో రుద్రక్షేత్రం వద్ద కమిటీ ప్రతినిదులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వెంకటేశ్వర్లు తన తండ్రి దగ్గుబాటి చెంచు రామయ్యకు 1985 లో జరిగిన కారంచేడు దారుణ మారణకాండకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొనడాన్ని కారంచేడు బాధిత విజయనగర కాలనీ వాసుల తీవ్రంగా ఖండించారు. వారు స్పష్టంగా పేర్కొంటూ కారంచేడు మృత వీరుల రుధిర క్షేత్రం సాక్షిగా వెంకటేశ్వరరావు వ్యాఖ్యలను తిరస్కరించారు. ఈ సందర్భంగా కారంచేడు దళిత పోరాట ఉద్యమ సీనియర్ నాయకుడు దుడ్డు భాస్కరరావు మాట్లాడుతూ భారత దేశ చరిత్రలోనే అత్యంత దారుణ ఘటనగా నిలిచిన ఈ మారణకాండను మామూలు గొడవలా చిత్రీకరించేందుకు వెంకటేశ్వరరావు చేసిన ప్రయత్నం దుర్మార్గమైనది, ఆయన తండ్రి చెంచు రామయ్య ప్రోత్సహంతోనే ఈ సంఘటన జరిగిందని, ప్రత్యక్షసాక్షులు ఉన్నారు. మారణాయుధాలతో దాడి చేసి ఆరుగురిని హతమార్చిన సంఘటనను చిన్న చూపు చూడడం శోచనీయమైనదే కాదు, దళితులపై మళ్లీ దాడిగా భావించాలి అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చెంచు రామయ్య పాత్ర లేకుంటే అప్పటి పోలీసు ఎఫ్ఐఆర్‌లలో పత్రికా నివేదికలలో ఆయన పేరెందుకు వచ్చింది, బీబీసీ టాయ్ ఉదయం లాంటి ప్రముఖ మీడియా సంస్థలు నిజ నిర్ధారణ జరిపిన తర్వాతే ఆయన పేరును ప్రచురించారు. ఆ మారణకాండలో ముఖ్యప్రమేయమున్న వ్యక్తిగా ఎందుకు కొందరు చెంచు రామయ్య నే లక్ష్యంగా చేసుకున్నారు అని ప్రశ్నించారు. వివేకంతో విచక్షణతో జరిగిన ఘటనను గమనించకుండా వక్రీకరించడం దళితుల మనోభావాలను గాయపరచడమేనని అన్నారు. ఆ సందర్భంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దళితులను రెచ్చగొట్టడమే అని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటివి పునరావృతం అయితే దళిత సంఘాలు, ప్రజా సంఘాల సహకారంతో ఉద్యమించేందుకు కారంచేడు బాధిత గ్రామస్తులు సిద్దంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉద్యమ నాయకులు గ్రామపెద్దలు సిర్రా భగత్ సింగ్, తేళ్ల సుబ్బారావు, గొర్రెపాటి రవికుమార్, బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, దుడ్డు ఏసుపాదం, తేళ్ల ప్రసాద్, తేళ్ల ఏసు, దుడ్డు వందనం, తేళ్ల బోయేజ్, గొర్రెపాటి వందనం, తేళ్ల రాంబాబు, దేగల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ చేనేత దినోత్సవంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, ఆగస్టు 7, ప్రభాతవార్త**



చీరాలలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొన్నారు. చీరాల ముప్పడం చీరకు జాతీయ అవార్డు అందుకున్న సందర్భంగా ఈనెల 14న ప్రధానమంత్రి చేతుల మీదుగా బాపట్ల జిల్లా కలెక్టర్ జే.వెంకట మురళి జాతీయ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆమె పాల్గొని ప్రసంగించారు. చేనేత పరిశ్రమ కూటమి ప్రభుత్వం ఆ పరిశ్రమనను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న కృషి వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు చేనేత పరిశ్రమను నిలబెట్టారని అన్నారు. వారిలో భరోసా పెంచారని వివరించారు.

# పేదలకు ఆపన్నహస్తంలా మంత్రి గొట్టిపాటి తోడ్పాటు










**అద్దంకి, ఆగస్టు 7, ప్రభాతవార్త**

ఎండనకా, వాననకా, కష్టపడుతూ పదోపరకో సంపాయిస్తూ జీనవం సాగిస్తున్న పేదలకు రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి పట్టణంలో 150మంది తోపుడు బండ్లపై వ్యాపారం చేసి, జీవనం సాగించేవారికి ఉచితంగా తోపుడు బండ్లను అందజేశారు. తద్వారా ఆపేదలకు నేడు ఆ తోపుడు బండ్లు ఆపన్నహస్తంలా వారికి తోడ్పాటును అందిస్తున్నాయి. ఆర్థికంగా వారికి ఎంతో దోహద పడుతున్నాయి. తోపుడుబండ్లను అద్దెకు తీసుకొని, రోజుకు వాటి యజమానులకు 20నుండి 30రూపాయల వరకు అద్దె చెల్లించాలి. వీరు వర్షం అయిన, ఎండ అయినా, అనారోగ్యంతో ఆరోజు పనిచేయలేక పోయినా యజమానులకు మాత్రం అద్దె చెల్లించాల్సిందే. ఈ పరిస్థితులలో కాయ కష్టం చేస్తున్న ఈ నిరుపేదలకు మంత్రి అందజేసిన తోపుడు బండ్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి అనడంలో సందేహం లేదు. నెలకు ఈ తోపుడు బండ్ల విషయంలో 600 వందలనుండి 900వందల రూపాయలు వరకు అద్దె చెల్లించే పరిస్థితినుండి ఊరట పొందారు. అంటే తోపుడు బండ్లపై చిరు వ్యాపారుల చేసే వారికి ఉచితంగా అందిన తోపుడు బండ్ల వలన ఏడాదికి 10వేల రూపాయల వరకు వారికి ఆదనపు ఆదాయం సమకూరినట్లు అయ్యింది. ఈ విధంగా పట్టణంలోను, పరిసర కాలనీలలోను, తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేసే వారు ఎందరో వున్నారు. ఈ విధంగా తోపుడు బండ్లను అందుకున్న వారిలో వికలాంగులు, వినికిడి లోపం వున్న వారు కూడ వున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంకల్పంతో పేదలకు ఎంతో సహకారాన్ని అందించడం అనేది హర్షనీయం. స్వంతగా తోపుడు బండ్లు వుండడం వలన వ్యాపార నిర్వహణలో సమయ భావం, అనేది లేకుండా ఉదయం నుండి రాత్రి వరకు నిర్వహించుకునే స్వేచ్ఛను వీరు అనుభవిస్తున్నారు. ఏది ఏమైనా ఉచితంగా తోపుడు బండ్లును అందించడం పేదల పాలిటి ఒ వరం.

*- తోపుడు బండ్లను ఉచితంగా అందించిన మంత్రి*
*- ఆర్థికంగా పేదలకు దోహదపడుతున్న తోపుడు బండ్లు*

**- ఆర్థికంగా ఎంతో తోడ్పాటు :: రాధకృష్ణన్ మామిడి ముక్కల వ్యాపారి**

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉచితంగా తోపుడు బండిని ఇవ్వడం వలన తనకు ఎంతో ఆర్థికంగా తోడ్పాటు లభించినట్లు అయిందని వినికిడి లోపం వున్నప్పటికీ మామిడి ముక్కల వ్యాపారం నిర్వహిస్తున్న రాధకృష్ణన్ అన్నారు.

**- టీ. వ్యాపారానికి ఎంతో దోహదపడుతుంది :: రత్తాయి**

మంత్రి అందజేసిన ఉచిత తోపుడు బండి తన టీ వ్యాపారినికి ఎంతో దోహదపడుతుందని బంగ్లారోడ్డులోని టీ కోట్టు వ్యాపారి రత్తాయి అన్నారు.

**- ఉప్పు వ్యాపారానికి ఉపయోగ పడుతుంది :: తన్నీరు శ్రీను**

అద్దంకి పట్టణంతోపాటు కాలనీలలో కూడ తిరిగి ఉప్పు, కోడిగుడ్లు, ముగ్గు అమ్ముకోవడానికి ఎంతో దోహదపడుతుందని తన్నీరు శ్రీను అన్నారు.

**- కూరగాయల వ్యాపారానికి ఉపయోగపడుతుంది :: ఇందిర**

కూరగాయలతో గ్రామంలో తిరిగి అమ్ముకోవడానికి మంత్రి అందజేసిన బండి ఎంతో ఉపయోగపడుతుందని ఇందిర అన్నారు.

**- క్యాటరింగ్‌కు ఎంతో దోహదపడుతుంది :: అంజలి**

పట్టణంలో ఆర్డర్లపై టిఫిన్‌లు, భోజనాలు, సరఫరా చేసుకోవడానికి బండి ఎంతో దోహదపడుతుందని అంజలి అన్నారు.

**- మామిడి కాయలు వ్యాపారి ::: కాజావలి**

అద్దె కట్టె ఇబ్బంది లేకుండా మామిడి వ్యాపారం చేసుకుంటున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఉచితంగా బండి ఇవ్వడం ఎంతో ఉపయోగంగా వుందని కాజావలి అన్నారు.












## తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం: మలినేని విద్య సంస్థలు

**సింగరాయకొండ, ఆగస్టు 7, ప్రభాతవార్త**




గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు తక్కువ ఫీజులుతో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నామని మలినేని విద్యాసంస్థల చైర్మన్ పెరుమాళ్ళు సూచించారు. మండలం లోని కనుమల్ల గ్రామం మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినుల కోసం గురువారం ఇండక్షన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పెరుమాళ్ళు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ సంస్థల్లో ఉద్యోగాలు పొందాలంటే సాంకేతిక నైపుణ్యాలతో పాటు ఆంగ్ల భాషపై ప్రావీణ్యం తప్పనిసరిగా అవసరమని, నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రాధాన్యత మరింత పెరిగిందని చెప్పారు. కళాశాల డైరెక్టర్ డా. ఏ. గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరీక్షల్లో మా విద్యార్థినులు ప్రతిభ కనబరిచిన తీరు అభినందనీయమని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన శిక్షణలను కళాశాలే అందిస్తోంది. వారికి ఉద్యోగ అవకాశాల్లో సహకరించేలా మేము కృషి చేస్తున్నాం అని చెప్పారు. ఈవో పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం గా క్రీడల ద్వారా శారీరకంగా, మానసికంగా విద్యార్థులు దృఢంగా మారతారని, అందుకే ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలి అని సూచించారు. ఈ కార్యక్రమం లో హెచ్‌వోడీలు నాగ నాగార్జున, వసుమతి పాల్గొన్నారు.

## ఉచితంగా విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**సింగరాయకొండ, ఆగస్టు 7, ప్రభాతవార్త:**



మండలంలోని పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డి నగర్ ఎంపీపీ పాఠశాల లోని విద్యార్థులకు గురువారం ఉచితంగా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 8వ వార్డు సభ్యులు తన్నీరు నాగేశ్వరరావు సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోటపాటి నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికంగా చదివి మంచి భవిష్యత్తు కోసమే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మానవతా శాఖ సెక్రటరీ జెడీ వెంకట సుబ్బారావు గారు విద్యార్థులందరూ శుభ్రంగా, చక్కని దుస్తులతో పాఠశాలకు హాజరుకావాలనీ ఆకాంక్షించారు. మండల శాఖ చైర్మన్ గుంటక రామలక్షమ్మ మాట్లాడుతూ, విద్యార్థులు దేవి సీ ఫుడ్స్ సంస్థ ఉచితంగా అందిస్తున్న మినరల్ వాటర్‌ను వినియోగించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మానవతా ట్రెజరర్ మహంకాళి నరసింహారావు, జాయింట్ సెక్రటరీ బి. పూర్ణచంద్రరావు, పాఠశాల ఉపాధ్యాయులు పి. లక్ష్మీ, యం. ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

## ఆవులను తప్పించబోయి ఆటో బోల్తా

### - ఒకరు మృతి మరో ముగ్గురికి గాయాలు

**కంభం, ఆగస్టు 7 ప్రభాతవార్త :**



ఎదురుగా వస్తున్న ఆవులను తప్పించబోయి ఆటో బోల్తా పడిన సంఘటన మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలోని హైవే రహదారిపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు కంభం రైల్వే స్టేషన్ నుంచి జంగంగుంట్ల గ్రామానికి వెళ్తున్న ఆటో రోడ్డుకు అడ్డంగా వస్తున్న ఆవులను తప్పించబోయి అదుపు తప్పింది. ఈ ఘటనలో దూదేకుల సిద్దమ్మ (65) అనే మహిళకు తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ఆసుపత్రికి తరలించారు. ఆటో ప్రమాదానికి గురైనప్పుడు ఆటోలో 7మంది ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. ప్రమాదం విషయం తెలుసుకున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కుమారుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డి ఆసుపత్రికి వెళ్ళి క్షతగాత్రులను పరామర్శించారు. సమాచారమందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజ్ భవన్‌లో వైఎస్సార్‌సీపీ ఫిర్యాదులు

### - టీడీపీ దాడులపై గవర్నర్‌కు ప్రతినిధి బృందం నివేదన
### - కనిగిరి ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ


**కనిగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త**



పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల బృందం గవర్నర్ అబ్దుల్ నజీర్ ని గురువారం సాయంత్రం రాజ్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ గూండాల దాడి, పోలీసుల ఏకపక్ష చర్యలు, ఎన్నికల వేళ నెలకొంటున్న ఉద్రిక్త పరిస్థితులపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను పరామర్శించిన విషయాన్ని పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, వెల్లంపల్లి శ్రీనివాసరావు, లేళ్ళ అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, దేవినేని అవినాష్, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎంసీ వైస్ ప్రెసిడెంట్‌కు సత్కారం

**నాగులుప్పలపాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



జాతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులై గద్దె త్యాగరాజుకు గురువారం స్వగ్రామమైన ఉప్పుగుండూరులో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ బాబు, కాకతీయ సేవా సంఘం అధ్యక్షులు కనగాల కృష్ణ సంయుక్తంగా మాట్లాడుతూ జర్నలిస్టుగా సుదీర్ఘ అనుభవంతో పాటుగా ప్రజా సంఘాల్లో పని చేయటం సామాజిక కార్యక్రమాల పట్ల అవగాహన కలిగి ఉన్న గద్దె త్యాగరాజు ట్రేడ్ యూనియన్‌లో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులవడం సంతోషకరమన్నారు. గ్రామానికి చెందిన త్యాగరాజు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని సఫాయి కార్మికుల హక్కులు వారి సంక్షేమం కోసం పాటుపడాలని వారు ఆకాంక్షించారు. తొలుత శాలువా కప్పి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోగినేని శేషగిరి, మద్దిన బంగారు బాబు గుమ్మడి చిన్న, బెల్లం చౌదరి శ్రీనివాసరావు, గోగినేని రమేష్, రాష్ట్ర మాజీ గృహ నిర్మాణ సంస్థ డైరక్టర్ కొలకలూరు విజయ్ కుమార్, యండ్రపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

### - ఈఈ శ్రీనివాసులు - సబ్ స్టేషన్లు పరిశీలించిన ఈఈ

**ముండ్లమూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**

వ్యవసాయ వినియోగానికి నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరా అందజేస్తామని గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందేలా చూస్తామని విద్యుత్ శాఖ ఈఈ పి. శ్రీనివాసులు అన్నారు. మండలంలోని శంకరాపురం, మారెళ్ళ, పూరిమెట్ల, ఈదర గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లను ఈఈ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సబ్ స్టేషన్లలో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం పని చేసే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. బొప్పుడివారిపాలెం గ్రామంలో జరుగుతున్న ఆర్డీఎస్ పనులను పరిశీలించి, ఆ గ్రామంలోని రైతులతో విద్యుత్ సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. గృహ అవసరాలను విద్యుత్ సరఫరా అక్రమంగా అందించాలని లైన్ మెన్‌లను ఆదేశించారు. ఈఈ వెంట ఏడీఈ రవికుమార్, ఏఈ అంకబాబు, లైన్‌మెన్‌లు ఆంజనేయులు, కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



8-8Pg5_8-8Pg5.qxd 8/8/2025 12:04 AM Page 1




# వారసునిపై స్పష్టత ఇచ్చిన ట్రంప్



## ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌కే మొగ్గుచూపిన రిపబ్లికన్‌నేత

**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి తన రాజకీయ వారసుడి గురించి మాట్లాడారు. ప్రస్తుతం అమెరికా ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్న జెడి వాన్స్ తన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (ఎంఎజిఎ) ఉద్యమానికి స్పష్టమైన వారసుడు అని పేర్కొన్నారు. ప్రస్తుత విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఏదో ఒక రూపంలో వాన్స్‌తో కలిసి పనిచేయవచ్చని ట్రంప్ అన్నారు. నేను చాలా వరకు అనుకుంటున్నాను. న్యాయంగా చెప్పాలంటే జెడి వాన్స్ మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ ఉద్యమానికి స్పష్టమైన వారసుడని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ట్రంప్ ఆరు నెలల క్రితమే అమెరికా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో తన వారసుడి గురించి విలేకరులు అడిగినప్పుడు, తొందరెందుకు, వారసుడి ఎంపికకు ఇంకా చాలా సమయం ఉందనిఅన్నారు. అయితే జెడి వాన్స్ గొప్పగా పనిచేస్తున్నాడు. ఇప్పటికైతే ఆయనే నాకు ఇష్టమైన వ్యక్తి అని ట్రంప్ అన్నారు. అక్కడితో ఆగకుండా రూబియో కూడా ఏదో ఒక రూపంలో జెడి వాన్స్‌తో కలిసి పనిచేస్తాడు అని అన్నారు. తన తరువాత 2028లో అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా ఎవరు ఉంటారనేది చెప్పడానికి అప్పట్లో ట్రంప్ నిరాకరించారు. 40 ఏళ్ల జెడి వాన్స్ మాజీ మెరైన్ఇంజనీర్. 2023 నుంచి 2025 వరకు ఆయన ఓహియో సెనేటర్‌గా పనిచేశారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిచేపట్టాక, వాన్స్ ఉపాధ్యక్షుడు అయ్యారు. ప్రస్తుతం ట్రంప్ ట్యారిఫ్ ఉద్యమానికి పూర్తి మద్దతుగా పనిచేస్తున్నారు. మార్కో రూబియో ప్రస్తుతం అమెరికా విదేశాంగ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కొంత కాలం క్రితం, ఓ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 2028లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేస్తారా అనే ప్రశ్నకు, నేను ప్రస్తుత పని మీద మాత్రమే దృష్టి సారించాను. కానీ భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చెప్పలేం అని అన్నారు.

అంటే అధ్యక్ష రేసులో ఉన్న విషయాన్ని ఆయన తోసిపుచ్చలేదు. వాస్తవానికి అమెరికా ఉపాధ్యక్ష పదవికి రూబియో, వాన్స్ ఇద్దరూ పోటీ పడ్డారు. చివరికి ఉపాధ్యక్ష పదవి వాన్స్‌ను వరించింది. అయితే ప్రస్తుతం ఇద్దరూ ట్రంప్ ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహిస్తున్నారు. ఓ సందర్భంలో మార్కో చాలా సమర్థుడు, నమ్మదగినవాడు, అతను నా స్నేహితుల్లో ఒకరు అని వాన్స్‌చెప్పారు. గతంలో వాన్స్, రూబియో ఇద్దరికీ అమెరికా అధ్యక్ష పదవి చేపట్టే సామర్థం ఉందని ట్రంప్ పేర్కొన్నారని ఓ అమెరికా వెబ్‌సైట్ పేర్కొనడం గమనార్హం.



రైతు ప్రయోజనాలపరంగా

# రాజీ ప్రశ్నేలేదు!

## ఎంతటిమూల్యం చెల్లించుకునేందుకైనా నేను సిద్ధమే!

## ట్రంప్ సుంకాలపై ప్రధాని మోడీ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** దేశ రైతుల ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని, వారి కోసం ఎంతటి మూల్యం చెల్లించడానికైనా తాను సిద్ధంగాఉన్నానని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసిన మరుసటి రోజే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నందుకు ప్రతీకార చర్యగా భారత ఎగుమతులపై అమెరికా బుధ వారం అదనంగా 25 శాతం సుంకాన్ని విధిం చిన విషయం తెలిసిందే. గత నెల 20న విధించిన 25 శాతంతో కలిపి ఇప్పుడు మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్ది అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోడీ మాట్లాడారు. రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలే మాకు అత్యంత ప్రాధాన్యం. ఈ విషయంలో భారత్ ఎన్నటికీ రాజీపడదు. ఇందు కోసం నేను వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందనితెలుసు. అయినానేను సిద్ధంగా ఉన్నాను. దేశ రైతులకోసం భారత్ సిద్ధంగా ఉందని, ఆయన తేల్చిచెప్పారు. అమెరికా చర్యపై భారత విదేశాంగ శాఖకూడా తీవ్రంగా స్పందించింది. రష్యా చమురు దిగుమ తుల విషయంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమైన, అహేతుకమైన చర్యఅనిపేర్కొంది. దేశ ప్రయోజనాల పరిరక్షణకు అవ సరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టంచేసింది. 140 కోట్ల మంది ప్రజల ఇంధనభద్రతను దృష్టిలో ఉంచుకునే తమ దిగుమతులు ఉంటాయని తెలిపింది.



# లోయలో పడిన సిఆర్పీఎఫ్ వాహనం

## ముగ్గురు జవాన్లు మృతి, 10 మందికి తీవ్రగాయాలు

**జమ్ము, ఆగస్టు 7:** జమ్మూ కశ్మీర్‌లో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పీఎఫ్) జవాన్లు ప్రయా ణిస్తున్న వాహనం లోతైన లోయలో పడిపోవడంతో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనలో మరో 10 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఉధంపుర్ జిల్లాలోని బసంత్‌గఢ్ ప్రాంతంలో ఈ విషాదం జరిగింది. కొండ ప్రాంతంలోని ఒక ప్రదేశానికి వెళ్తుండగా, మలుపు వద్ద డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం రోడ్డుపై నుంచి జారి పక్కనే ఉన్న లోతైనలోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు దుర్మరణం పాలయ్యారని అధికారులు ధ్రువీకరించారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక అధికారులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన 10 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం వారిని ఆసుపత్రికి తరలించారు. ఉధంపుర్ డిప్యూటీ కమిషనర్ అభ్యర్థన మేరకు, తీవ్రంగా గాయపడిన వారిని తరలించేందుకు ఆర్మీ హెలికాప్టర్లను రంగంలోకి దింపారు.

# ఇంటిముందు ఆడుకుంటున్న బాలికపై జాతివివక్ష దాడి!

**డబ్లిన్, ఆగస్టు 7:** ఐర్లాండ్‌లోని భారత సంతతికి చెందిన ఆరేళ్ల చిన్నారిపై జాతి వివక్ష దాడి జరిగింది. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికపై స్థానిక పిల్లలు దాడిచేశారు. సౌత్ ఈస్ట్ ఐర్లాండ్‌లోని వాటర్ ఫోర్డ్ సిటీలో చోటుచేసుకుంది ఘటన. అసభ్యంగా దూషిస్తూ, ఇండియాకు వెళ్లిపొమ్మని బెదిరించారని బాధితురాలి తల్లి మీడియాకు వెల్లడించారు. తన బిడ్డపై చేయిచేసుకోవడంతో పాటు ప్రైవేట్ పార్టులపై దాడి చేశారని తెలిపారు. స్థానికంగా ఉంటున్న పది నుంచి పద్నాలుగేళ్ల వయసున్న బాలురు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. గడిచిన ఎనిమిదేళ్లుగా తాము ఇక్కడే ఉంటున్నామని, ఇటీవలే పౌరసత్వం కూడా వచ్చిందని ఆమె తెలిపారు.

తాను నర్సుగా స్థానిక ఆసుపత్రిలో సేవలందిస్తున్నానని, తనలాంటివారి అవసరం ఐర్లాండ్‌కు ఉందని ఆమె తెలిపారు. తన పిల్లలు ఇక్కడ సురక్షితంగా ఉంటారని భావిస్తే, తమ సొంత ఇంటి ముందు కూడా పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. తన కూతురుపై దాడి చేసిన పిల్లలలో ఎనిమిదేళ్ల పాప కూడా ఉందని, మొత్తం ఐదుగురు దాడి చేశారని బాధితురాలి తల్లిఆరోపించారు. అయితే, అధికారులు వారినిశిక్షించడం కాకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# త్వరలో భారత్ పర్యటనకు పుతిన్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. ఆయన పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వెల్లడించారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న దోవల్ రష్యా భద్రతా మండలి సెక్రటరీ సెర్గీ షొయిగుతో సమావేశమైన అనంతరం ఈ ప్రకటన చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన వేళ ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ యేడాది చివర్లో పుతిన్ భారత్‌కు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# ఇజ్రాయెల్ లక్ష్యం గాజా హస్తగతం



**టెల్‌అవీవ్, ఆగస్టు 7:** గాజాలో పరిస్థితులు రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నాయి. ఓ వైపు అక్కడి ప్రజలు ఆకలి అలమటిస్తున్నప్పటికీ.. ఇజ్రా యెల్ మాత్రం దాడులను ఆపడం లేదు. ఆహార పంపిణీ కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరుపుతోంది. ఈ తరహా ఘటనల్లో ఇప్పటివరకు 1000 మందికిపైగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, హమాస్‌ను అంతంచేయడమే లక్ష్యంగా యుద్ధం ప్రారంభించిన ఇజ్రాయెల్.. ఇప్పుడు గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలన్న కోరికతో ముందుకు వెళ్తోంది. అందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చర్యలు బలం చేకూరుస్తున్నాయి. ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ నివేదిక ప్రకారం.. దశలవారీగా గాజాను స్వాధీనం చేసుకునేందుకు ఇజ్రాయెల్ పావులు కదుపుతోంది. మరో ఐదు నెలల్లో ఆ ప్రాంతాన్ని హస్తగతం చేసుకునేలా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే గురువారం ఆ దేశ సెక్యూరిటీ కేబినెట్ కీలక సమావేశం నిర్వహించనుంది. గాజాపై చేపట్టాల్సిన నూతన కార్యాచరణ గురించి ఇందులో చర్చించనున్నారు. మరోవైపు గాజాలోని ఉత్తర, ఖాన్‌యూనిస్‌లోని దక్షిణ ప్రాంత ప్రజలకు ఇజ్రాయెల్ మిలిటరీ బుధవారం కీలక హెచ్చరికలు జారీచేసింది. వారంరోజుల్లోగా నెతన్యాహు ప్రభుత్వం గాజాను స్వాధీనం చేసుకోబోతుందని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లిపోవాలని వాటిసారాంశం. మరోవైపు గ్రౌండ్ ఆపరేషన్లను కూడా విస్తరించబోతున్నట్లు మిలిటరీ అధికార ప్రతినిధి వెల్లడించారు.

**ఇజ్రాయెల్ వ్యూహం ఇదేనా?**

హమాస్ ఉగ్రవాదులే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నప్పటికీ.. పూర్తి స్థాయి విజయం సాధించలేకపోతోంది. దీంతో కీలక వ్యూహాన్ని అమలుచేసే యోచనలో ఉంది. తొలుత గాజా సిటీమొత్తాన్ని తన అధీనంలోకి తీసుకొని.. సహాయ పంపిణీ కేంద్రాలను పెద్ద ఎత్తున పెంచాలని భావిస్తోంది. దీంతో.. సాధారణపౌరులంతా సహాయంకోసం ఒకచోటుకు చేరిన తర్వాత.. ఆ ప్రాంతంలోని మిగతా భూభాగంలో బాంబుల వర్షం కురిపించాలని భావిస్తోంది. వ్యూహం అమలులో భాగంగా తొలివిడతగా.. దాదాపు 10 లక్షల మందిని గాజాను ఖాళీ చేయాలని హెచ్చరికలు పంపనున్నారు. దీంతో గాజా స్ట్రిప్‌లోని సగభాగం ఖాళీ అయినట్లవుతుంది. రెండో విడతగా.. సాధారణ ప్రజలు ఖాళీ చేసిన ప్రాంతాల్లో మిలటరీ ఆపరేషన్ చేపట్టనున్నారు. తద్వారా మూల మూలల్లో దాక్కున్న హమాస్ ఉగ్రవాదులను మట్టుబెట్టాలన్నది ఇజ్రాయెల్ ప్లాన్.

**మరో ప్లాన్ ఇదే..!**

సైనిక చర్య చేపడితే హమాస్ చేతిలో బందీలుగా ఉన్న తమ పౌరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఇజ్రాయెల్ భావిస్తే.. మరో వ్యూహాన్ని తెరమీదక తెచ్చే అవకాశాలున్నాయి. అమెరికా మధ్యవర్తిత్వంలో హమాస్‌తో చర్చలు జరిపి, అవి విజయవంతం అయితే ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలు నిలిపివేసే అవకాశంఉంది. అయితే, అందుకు నెతన్యాహు అంగీకరించకపోవచ్చు. లేదంటే గాజాను చుట్టుముట్టి, ఆ ప్రాంతాలకు సహాయాన్ని నిలిపివేసే అవకాశాన్ని కూడా ఇజ్రాయెల్ పరిశీలిస్తోంది. అయితే, ఇది చాలా ఎక్కువ సమయం తీసుకుంటుంది.

మరోవైపు ప్రభుత్వానికి, ఐడిఎఫ్‌కు పొరపొచ్చాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఐడిఎఫ్‌ను ఉద్దేశిస్తూ ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను బాధ్యతతో సక్రమంగా అమలుచేయడమే సైన్యం విధి అని, ప్రభుత్వ నిర్ణయాలకు సైన్యం కట్టుబడి ఉండాలని తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో అంతర్గత సమస్యలను పరిష్కరించుకుంటూ, హమాస్‌ను అంతం చేసేందుకు ఇజ్రాయెల్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందోనన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఓటర్లజాబితా ముసాయిదాపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదు!

## బీహార్ జాబితాపై ఎన్నికల సంఘం వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(సర్‌పై భారత ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. ఆగస్టు 1వ తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితా ముసాయిదాకు ఏ రాజకీయ పార్టీ కూడా అభ్యంతరాలు తెలపలేదని గురువారం పేర్కొంది. ఓటుకు అర్హత ఉన్నవారిని వదలిపెట్టబోమని, అనర్హులను ఓటరు లిస్టులో చేర్చబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు పై రోజువారీ బులెటిన్‌లో ఈసీ తెలిపింది. ఇప్పటివరకు ఓటరు ముసాయిదా జాబితాకు సంబంధించి 5,015 అభ్యంతరాలను స్వీకరించామని ఎన్నికల సంఘం చెప్పింది. కొత్త ఓటర్ల నుంచి 27,517 పైగా దరఖాస్తులను స్వీకరించామని, ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు చెప్పాలని కోరింది.

నిబంధనల ప్రకారం, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏడు రోజుల గడువు ముగిసిన తర్వాత సంబంధిత ఎలక్ట్రోలర్, అసిస్టెంట్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు వాటిని పరిష్కరించాలి. అదే సమయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ బీహార్ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి దారితీసింది. ఎన్నికల సవరణలో పెద్ద సంఖ్యలో ఓటర్ల తొలగింపు జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కూడా ఎస్ఐఆర్‌పై గళమెత్తాయి. పార్లమెంట్ ఆవరణలో నిరసనలు కూడా తెలిపాయి. ఇదిలా ఉండగా, బీహార్ ఓటరు జాబితాలో 65 లక్షల ఓటర్ల పేర్లు చేర్చలేదని తేలింది. దీంతో వారి వివరాలను బహిర్గతం చేయాలని ఎన్‌జీవో ఒకటి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఆగస్టు 9లోగా వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని కోరింది. ఎన్‌జిఒ తరఫున కోర్టులో హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదనలు వినిపించారు. ఎవరు చనిపోయారు, ఎవరు వలసవెళ్లారనే దానిపై స్పష్టత ఇవ్వలేదని తెలిపారు.

తొలగించిన ఓటర్ల వివరాలను, ఎన్‌జిఒకి కాపీని ఇవ్వాలని ఎన్నికల తరఫున న్యాయవాదిని ధర్మాసనం పేర్కొంది. కొన్ని రాజకీయ పార్టీలకు తొలగించిన ఓటర్ల జాబితాను ఇచ్చామని, అయితే ఆ ఓటరు చనిపోయాడా లేదా వలస వెళ్లాడా అనే దానిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. అయితే ఓటర్లు తమ ఐడి నంబర్‌లను ఉపయోగించి అధికారిక లింక్ ద్వారా తమ పేర్లను తెలుసుకునే అవ కాశాన్ని కమిషన్ కల్పించింది. ఆ పోర్టల్ ద్వారా పేర్లను చేర్చడం లేదా తొలగించడం, అభ్యంతరాలు ఉంటే తెలియజేయడం వంటివి చేయవచ్చు. 2025 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి ఓటర్లందరూ తమ బూత్ లెవల్ అధికారులకు కొత్త ఫొటోలను సమర్పించాలని ఇసి కోరింది.

# ఆరు నెలల్లో 529 బాంబింగ్‌లు.. నోబెల్ ఇవ్వాల్సిందే..!




**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడ చిన్న ఘర్షణ జరిగినా.. అక్కడి వాలిపోయి పంచాయితీలు చేస్తున్నారు. ఆయనను ఒక శాంతి దూతగా చిత్రీకరించేందుకు శ్వేతసౌధంలోని కార్యవర్గం కిందామీదా పడుతోంది. మా అధ్యక్షుడు సగటున నెలకో శాంతి సంధిని కుదురుస్తున్నారంటూ ఇటీవల ప్రకటన జారీ చేసింది. అసలు ట్రంప్‌నకు నోబెల్ బహుమతివచ్చే అవకాశం ఉందా? ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయోగించిన బాంబులు ఎన్ని.. ఎంత మంది ప్రాణాలను ఫణంగా పెట్టి డబ్బు ఆదా చేస్తున్నారో తెలుసా?

**అంత పిచ్చి ఎందుకు?**

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో నోబెల్ విషయంలో ట్రంప్‌నకు వైరం కొనసాగుతోంది. ట్రంప్ తొలిసారి అధ్యక్ష పదవి చేపట్టడానికి ప్రయత్నాలు మొదలుపెట్టినప్పటి నుంచే ఒబామాతో విభేదాలు ఉన్నాయి. తన శత్రువు అధ్యక్ష పదవి చేపట్టిన 9నెలల్లోనే నోబెల్ శాంతి బహుమతి అందుకోగా లేనిది తన విషయంలో ఎందుకు సాధ్యం కాదని ట్రంప్ అనుకొంటున్నారు. ఒబమాకు బహుమతి రావడంపై కూడా బహిరంగంగానే కొన్నేళ్ల నుంచి అక్కసు వెళ్లగక్కుతున్నారు. 2019లో ఓ సందర్భంలో మాట్లాడుతూ 'బరాక్ ఒబామాకు ఎందుకు వచ్చిందో నాకు తెలియదు.. మీకేమైనా తెలుసా..?' అని వ్యాఖ్యానించారు. తనకు ఇప్పటికే పలు అంశాల్లో ఈ ప్రైజు ఇచ్చి ఉండాల్సిందన్నారు.

**ఇదేం శాంతి..?**

ట్రంప్ ఆశలకు గండికొట్టే అంశాలు కూడా బలంగానే ఉన్నాయి. జనవరి 20న పగ్గాలు చేపట్టిన నాటి నుంచి జూలై 15 నాటికి ఆరు నెలల వ్యవధిలో ఆఫ్రికా, పశ్చిమాసియా, మధ్య ఆసియాలోని 240 ప్రదేశాల్లో 529 బాంబింగ్‌లను ట్రంప్ చేయించారు. ఈ విషయాన్ని 'ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్ అండ్ ఈవెంట్ డేటా' గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే ఆయన కంటే ముందు అధికారంలో ఉన్న జోబైడెన్ నాలుగేళ్లలో 555 బాంబింగ్‌లను చేయించారు. ఇరాన్‌పై అతిపెద్ద బంకర్‌బస్టర్ల వర్షం కురిపించారు.

**మూడుసార్లు తిరస్కరణలకు గురైన నామినేషన్లు..**

ఇదంతా ఒక ఎత్తయితే.. ట్రంప్ పట్టువదలని విక్రమార్కుడిలా నోబెల్‌కు నామినేషన్లు పంపిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఆయనవి మూడుసార్లు తిరస్కరణకు గురయ్యాయి. 2018లో అణు నిరాయుధీకరణ యత్నాలకు ఇద్దరు నార్వే ప్రజాప్రతినిధులు, 18 మంది రిపబ్లికన్ సభ్యులు ఆయన పేరును ప్రతిపాదించారు. నాడు ఉత్తర కొరియా, అమెరికా మధ్య చర్చలను దీనికి కారణంగా చూపారు. కానీ, బహుమతి రాలేదు. 2020లో మరోసారి ట్రంప్ బృందం నోబెల్ యత్నాలు చేసింది. పశ్చిమాసియాలో అబ్రహం ఒప్పందాలు చేయించినందుకు ఓ స్వీడిష్ చట్టసభ సభ్యుడు, కొందరు ఆస్ట్రేలియా లా ప్రొఫెసర్లు, ఫిన్లాండ్ చట్టసభ సభ్యుడు, ఐరోపా పార్లమెంట్ సభ్యుడు ఆయన పేరును ప్రతిపాదించారు. అప్పుడు కూడా నోబెల్ మొహం చాటేసింది. ఇక 2024లో ఆయన అధ్యక్ష పదవి చేపట్టేందుకు సిద్ధమైన వేళ కూడా ఆయన పేరును కాంగ్రెస్ ఉమెన్ క్లాడియా టెన్ని నోబెల్‌కు నామినేట్ చేశారు. దాదాపు ఆరు వరకు నామినేషన్లు రాగా.. ఆ సారీ బహుమతి ట్రంప్‌ను వరించలేదు. జపాన్‌కు చెందిన ఓ సంస్థకు దక్కింది.


## ఉత్తరాఖండ్ వరదల్లో 27 మంది

# కేరళ యాత్రీకులు గల్లంతు!

**డెహ్రాడూన్, ఆగస్టు 7:** ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు సంభవించిన వేళ 28 మంది కేరళ పర్యటకుల ఆచూకీ గల్లంతైంది. వీరిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడినవారు కాగా, మిగిలిన ఎనిమిది మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. వారు మాతో మాట్లాడి ఒక రోజు గడిపోయింది. ఉత్తరకాశీ నుంచి ఉదయం ఉదయం 8.30కు గంగోత్రికి బయల్దేరినట్లు వారు తెలిపారు. వారు వెళ్తున్న మార్గంలోనే కొండచరియలు విరిగిపడ్డాయి. అప్పటినుంచి వారు ఎక్కడ ఉన్నారో తెలియదు. ఫోన్ కూడా కలవడం లేదు. ఫోన్లలో బ్యాటరీ అయిపోయి ఉండొచ్చు. లేదా వాళ్లు ఉన్న చోట సిగ్నల్ లేదనుకుంటా అని బంధువు పేర్కొన్నారు. హరిద్వార్‌కు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ 10 రోజులపాటు ఉత్తరాఖండ్ పర్యటనకు ఏర్పాటు చేసినట్లు ఆ వ్యక్తి తెలిపారు. అయితే బృందం ఎక్కడ ఉందనే విషయంపై ఏజెన్సీ కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. గంగోత్రికి వెళ్లే మార్గంలోని ధరాలీలో భారీగా వదలు సంభవించాయి. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. మరో మృతదేహాన్ని వెలికితీసినట్లు అధికారులు ప్రకటించారు. ఇక డజన్ల మంది ఆచూకీ గల్లంతైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు రెస్క్యూ సిబ్బంది 150 మందిని రక్షించారు. సహాయక చర్యల్లో సైన్యం, పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ పాల్గొన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌నుంచి ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను ఉత్తరాఖండ్‌కు విమానంలో తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం హెల్ప్‌లైన్ నంబర్‌లు ఏర్పాటు చేసింది. మరోవైపు హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా ఆకస్మిక వరదలు బీభత్సంసృష్టించాయి. కిన్నౌర్ జిల్లాలో కైలాస్‌యాత్ర ట్రెక్కింగ్ మార్గంలో వందలాది మంది యాత్రికులు వరదల్లో చిక్కుకుపోయారు. వరదల ధాటికి ట్రెక్కింగ్ మార్గాలు ధ్వంసం కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా, కిన్నౌర్ కైలాష్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రంలోని పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# సంక్షిప్తంగా..

## అమెరికా విధించిన సుంకాలపై తీవ్రంగా విమర్శించిన కాంగ్రెస్ ఎంపి



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు మనపై కచ్చితంగా ప్రభావం చూపిస్తాయన్నారు. దాదాపు 90 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. సుంకం ఎక్కువగా ఉన్నప్పుడు భారత్ వస్తువులు ఎందుకు కొనాలి అని కొనుగోలుదారులు కూడా ఆలోచిస్తారన్నారు. రష్యా నుంచి భారత్ కంటే చైనా ఎక్కువ చమురు కొనుగోలు చేస్తోందని కానీ ఆదేశానికి ట్రంప్ సుంకాల నుంచి 90 శాతం ఉపశమనంకల్పించారన్నారు. మనకుమాత్రం మూడువారాలే ఉపశమనం కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్రం కూడా యుఎస్ దిగుమతులపై 50 శాతం సుంకం విధించాలని కోరారు.

## ధర్మస్థలిలో పురుషుడి అస్థిపంజరం లభ్యం!

**బెంగళూరు, ఆగస్టు 7:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ధర్మస్థల సామూహిక ఖననాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జరుపుతున్న తవ్వకాల్లో పురుషుడి అస్థిపంజరంతో పాటు పలు మానవ ఎముకలు లభ్యమైనట్లు కర్ణాటక హోంశాఖ మంత్రి జి. పరమేశ్వర తొలిసారి అధికారికంగా ధృవీకరించారు. గురువారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన హోంమంత్రి పరమేశ్వర, ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒక గుర్తుతెలియని వ్యక్తి తాను 13 ప్రాంతాల్లో మృతదేహాలను పాతిపెట్టినట్లు ఫిర్యాదు చేశాడు. అతని వాంగ్మూలం ఆధారంగా సిట్ బృందాలు ఆ ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టాయి. ఆరో ప్రదేశంలో ఒక పురుషుడి అస్థిపంజరం దొరికింది. దీంతో పాటు మరో కొత్త ప్రదేశంలోనూ కొన్ని ఎముకలు లభ్యమయ్యాయి. లభ్యమైన అన్ని అవశేషాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపామని ఆయన స్పష్టం చేశారు. 13వ స్థానంలో మాత్రం ఇంకా ఏమీ దొరకలేదని ఆయన తెలిపారు. ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్ ముందు సెక్షన్ 164 కింద వాంగ్మూలం ఇస్తూ, తాను వందల సంఖ్యలో మృతదేహాలను పూడ్చిపెట్టినట్లు చెప్పడంతో ప్రభుత్వం ఈ కేసును తీవ్రంగా పరిగణించి సిట్ ఏర్పాటు చేసిందని పరమేశ్వర గుర్తుచేశారు. దర్యాప్తులో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోదని, శాస్త్రీయంగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిజానిజాలు నిగ్గు తేల్చాలని సిట్‌కు పూర్తి స్వేచ్ఛనిచ్చామని ఆయన వివరించారు.

## బిజెపి నేత కాన్వాయ్‌పై దాడిపట్ల బిజెపి చీఫ్ సీరియస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** పశ్చిమబెంగాల్‌లో బిజెపి కీలకనేత సువేందు అధికారి కాన్వాయ్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూచ్ బెహర్‌లో ఆయన కాన్వాయ్‌పై టిఎంసి గూండాలు దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లోపోస్టు పెట్టారు. ఈ దాడి పోలీసుల సమక్షంలోనే జరగడం ఇంకా ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ ఘటన మమతా బెనర్జీ ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయనడానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం ఒక ప్రజాప్రతినిధిపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్యంపైనే జరిగిన దాడిగా అభివర్ణించారు. తాను సువేందు అధికారితో మాట్లాడి ఆయన పరిస్థితి గురించి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. బెంగాల్‌లో ప్రతిపక్షనేతకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల దుస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చున్నారు.

## ఘనాలో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిన హెలికాప్టర్

**ఒబువాసి(ఘనా), ఆగస్టు 7:** పశ్చిమాఫ్రికా దేశం ఘనాలో నిన్న ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రులు, కీలక అధికారులతో బయలుదేరిన సైనిక హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో దేశ రక్షణ మంత్రి, పర్యావరణ మంత్రి, కీలక అధికారులు సహా మొత్తం ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. రాజధాని అక్రా నుంచి ఒబువాసి వెళ్లడానికి రక్షణ మంత్రి ఎడ్వర్డ్ ఒమానే బోమా, పర్యావరణ శాఖ మంత్రి ఇబ్రహీం ముర్తాలా ముహమ్మద్ అధికారులతో కలిసి జెడ్9 అనే సైనిక హెలికాప్టర్‌లో బయలుదేరారు. కాసేపటికే హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ తెగిపోయిందని, ఆతర్వాత హెలికాప్టర్ కూలిపోయిందనే సమాచారం అందిందని అధికారులు వివరించారు. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణం చేస్తున్నవారంతా చనిపోయారని ప్రభుత్వం ప్రకటిం టచింది. ఈ ప్రమాదంగురించి సమాచారం అందినవెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మృతదేహాలను ఆసుపత్రికి తరలించినట్టు అధికారులు తెలిపారు.

08-08pg6exHMNWJQEP 10 pg_08-08pg6exHMNWJQEP.qxd 8/8/2025 12:45 AM Page 1



# మన సంస్కృతి వైభవ ప్రతీక చేనేత : కమిషనర్ రేఖారాణి



**విజయవాడ,ఆగస్ట్7,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి ప్రతీకగా నిలిచిన మరియు స్వదేశీ చేనేత ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించిన స్వదేశీ ఉద్యమాన్ని గుర్తుచేస్తుంది జాతీయ చేనేత దినోత్సవం అని చేనేత, వస్త్రాల కమిషనర్ రేఖా రాణి తెలిపారు. గురువారం విజయవాడ మాచవరంలోని వీవర్స్ సర్వీస్ సెంటర్‌లో జరుపుకున్న జాతీయ చేనేత కార్యక్రమాన్ని చేనేత వస్త్రాల కమిషనర్ శ్రీమతి జి. రేఖా రాణి ప్రారంభించారు. అనంతరం చేనేత వస్త్రాల కమిషనర్ జి. రేఖా రాణి మాట్లాడుతూ ఈ ప్రాంతం యొక్క సామాజిక ఆర్థిక అభివృద్ధిలో చేనేత రంగం యొక్క ప్రాముఖ్యతను కేంద్ర ప్రభుత్వం గుర్తించారన్నారు. అందుకే ప్రతి ఏడాది ఆగస్టు 7 న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖలోని చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయం కింద పనిచేస్తున్న విజయవాడలోని వీవర్స్ సర్వీస్ సెంటర్, 2025 జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మాస్టర్ వీవర్లు మరియు భారతదేశ గొప్ప చేతివృత్తుల వారసత్వానికి నివాళులర్పించడం గొప్ప విషయమన్నారు. విజయవాడలోని వీవర్స్ సర్వీస్ సెంటర్‌లో జాతీయ చేనేత దినోత్సవ వేడుక భారతదేశ సాంప్రదాయ చేనేత నేత కళను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేసిందన్నారు. చేనేత మరియు వస్త్రాలను ధరించడంలో గర్వ భావాన్ని ప్రేరేపించడం, ఈ అకాల సృష్టిల సాంస్కృతిక ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం గా శ్రీమతి రేఖా రాణి పేర్కొన్నారు. ఈ సంవత్సరం ప్రధాన కార్యక్రమం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో భారతదేశం అంతటా ఉన్న నేత కార్మికులు మరియు విద్యార్థులతో జరుగుతుందన్నారు. విజయవాడలో ప్రధాన కార్యక్రమంతో పాటు, ఈ కార్యాలయం పెడన హ్యాండ్లూమ్ పాకెట్, కృష్ణా జిల్లా, మంగళగిరి హ్యాండ్లూమ్ పాకెట్, గుంటూరు జిల్లా, వెంకటగిరి హ్యాండ్లూమ్ పాకెట్, తిరుపతి జిల్లా మురమండ హ్యాండ్లూమ్ పాకెట్, తూర్పు గోదావరి జిల్లా ఇసుకపల్లి హ్యాండ్లూమ్ పాకెట్, బాపట్ల జిల్లాలలో 5 కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. న్యూఢిల్లీలోని జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేశారన్నారు. ఈ సంవత్సరం, ఆంధ్రప్రదేశ్ నుండి ముగ్గురు వ్యక్తులు జాతీయ అవార్డులను ప్రదానం చేశారన్నారు. వారిలో లక్కా శ్రీనివాసులు, వెంకటగిరి సంత్ కబీర్ అవార్డు, కర్నాటి మురళి, పల్నాడు జాతీయ అవార్డు, జుజారే నాగరాజు, ధర్మవరం జాతీయ అవార్డు లను భారత ప్రభుత్వ జౌళి శాఖ మంత్రి, భారతదేశ సాంస్కృతిక గుర్తింపు, సామాజికఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి సాంప్రదాయ చేనేత ఉత్పత్తులను సంరక్షించడం మరియు ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను గిరి రాజ్ సింగ్ నొక్కి చెప్పారు. పాల్గొన్న వారికి మరియు ఇతర ప్రముఖులకు భారతదేశ చేనేత వస్త్రాలపై లఘు చిత్రాలను ప్రదర్శించారన్నారు.

# రాష్ట్రంలో థీమ్ పార్కులు - ఇన్వెస్టర్లతో మంత్రి దుర్గేష్ చర్చలు

## ..'ఓ ప్రేమ' మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్..



**విజయవాడ. ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ బిజీ బిజీగా గడిపారు. కేబినెట్ అనంతరం పేషీకి వచ్చిన మంత్రి కందుల దుర్గేష్.. టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ తో కలిసి సచివాలయం రెండవ బ్లాక్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో పలువురు టూరిజం ఇన్వెస్టర్లతో భేటీ అయ్యారు. వారు రూపొందించిన ప్రతిపాదనలపై చర్చించారు. అందులో భాగంగా తొలుత పాంజియా ప్రతినిధి ప్రదీప్ మోచర్ల భేటీ అయ్యారు. యూరప్, హాంకాంగ్ తదితర ప్రాంతాల్లో ఉన్నటువంటి థీమ్ పార్క్ లను ఏపీలో ఏర్పాటు చేస్తామన్నారు. 5 ఎకరాల్లో రూ.30రూ.35 కోట్ల పెట్టుబడితో భద్రతకు పెద్దపీట వేస్తూ వివిధ వయస్కుల వారు ఆహ్లాదంగా గడిపేలా, క్విట్ ఇండియా, ఖేలో ఇండియా తరహా గేమ్స్ ఆడుకునేలా, వెల్ నెస్ సెంటర్ తరహా ఉపయోగపడేలా, పౌరాణికం ఉట్టిపడేలా ఇండియాలోనే మొట్టమొదటి థీమ్ పార్క్ ను వైజాగ్ లో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా త్రీడీ మాస్టర్ ప్లాన్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. థీమ్ పార్క్ లో అన్ని వయసుల వారు సరదాగా గడిపేలా హంపీ స్టోన్, వైట్ ఎలిఫెంట్, లైట్ హౌస్ అండ్ బోట్, మ్యూజికల్ పాండ్, ఈగల్ షేప్, మంకీ ఫారెస్ట్, కోబ్రా పోర్ట్,వాటర్ ఫాల్స్, వైట్ బుల్, టైగర్ ట్రెయిల్, ట్రీపాట్స్, పార్కర్ ఏరియా, ఎబిలిటీ ట్రాక్, సీనియర్ స్పాట్ ఏరియా తదితర ప్రక్రియలు ఉంటాయన్నారు. ఈ క్రమంలో టూరిజం పాలసీని మంత్రి దుర్గేష్, అజయ్ జైన్ లు వివరించారు. ప్రస్తుత కాలంలో చిన్నారులను మొబైల్ నుండి దూరం చేసి మానసిక, శారీరక ఆరోగ్యానికి పెద్దపీట వేయాలన్నది తమ ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా ఫిన్లాండ్ కు సంబంధించిన ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి దుర్గేష్ మాట్లాడారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం పొద్దటూరులో అతిపెద్ద ఎకో ఫ్రెండ్లీ పార్క్ ఎక్స్ పీరియం రూపకర్త, ఛైర్మన్ రామ్ దేవ్ రావు మంత్రి దుర్గేష్ ను కలిశారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియం బొటానికల్ గార్డెన్ తరహా పార్క్ ను ఏపీలని అమరావతి లేదా బీచ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. ఈ పార్క్ ఏర్పాటుతో మంచి టూరిజం స్పాట్ గా మారుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎక్స్ పీరియం ను సందర్శించాలని రాందేవ్ రావు మంత్రి దుర్గేష్ ను కోరారు. త్వరలోనే సందర్శిస్తామని అనంతరం నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆ తర్వాత మరో కంపెనీ అధినేత వైజాగ్ లో వెల్ నెస్ సెంటర్లు, 50 టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తామని ముందుకొచ్చారు. అరకు, లంబసింగి, మారేడుమిల్లి, విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. దాదాపు 500 1000 చదరపు అడుగులు ఉండేలా వుడెన్ హౌసెస్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని వారు తెలిపారు. ఇప్పటికే తాము ఊటీ, చిరపుంజీ తదితర పర్యాటక ప్రాంతాల్లో ఈ తరహా హౌసెస్ ఏర్పాటు చేసి మంచి ఫలితాలు పొందామని వివరించారు. ఇవి పర్యాటకులకు మరిచిపోలేని జ్ఞాపకాలను అందిస్తాయన్నారు.

# త్రిపుల్ ఐటి విద్యార్థులకు అక్షయపాత్ర భోజనం

## - ఒక్కో విద్యార్థికి రూ.110 చొప్పున చెల్లింపు

**విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాజీవ్ గాంధీ విజ్ఞాన,సాంకేతిక విశ్వవిద్యాలయం9 ఆర్జీయూకేటీ) అధ్వర్యం లోని ట్రిపుల్ ఐటీల్లో మెస్‌ల నిర్వహణ భాధ్యతను ప్రభుత్వం అక్షయపాత్రకు అప్పగించింది. ఇడుపులపాయ, ఒంగోలు,నూజివీడు,శ్రీకాకుళం క్యాంపస్‌ల్లో ఆ సంస్థ ద్వారా విద్యార్థులకు భోజనం అందించనున్నారు. ట్రిపుల్ ఐటి మెస్‌లలో భోజనం సరిగా పెట్టడం లేదని, నిర్వహణ సక్రమంగా ఉండటం లేదనే ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో నూజివీడు క్యాంపస్‌లో భోజనం బాగోలేదని విద్యార్థులు నిరసనలు తెలిపిన సమయంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. నాణ్యమైన భోజనం అందించేందుకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.116.67 చొప్పున చెల్లించాలని ఆ కమిటీ సూచించింది. దీని ప్రకారం...అక్షయపాత్ర టిఫిన్,రెండు పూటలతా శాఖాహార భోజనం,స్నాక్స్ అందించేందుకు ఒక్కో విద్యార్థికి రూ.110 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది.దీని కోసం క్యాంపస్‌ల్లో రూ.3 కోట్లతో అక్షయపాత్ర వంట పరికరాలను ఏర్పాటు చేసుకుంటుంది. ఆ సంస్థ శాఖాహార భోజనమే అందిస్తున్నందున విద్యార్థికి రోజుకు రూ.6.67తో వారానికి ఐదు కోడిగుడ్లు,ఒక రోజు మాంసాహారాన్ని ట్రిపుల్ ఐటీలో ప్రత్యేకంగా వండిస్తారు. భోజనం సరఫరాపై గడురువారం ఆర్జీయూకేటీతో అక్షయపాత్ర ఒప్పందం కుదుర్చుకోనుంది.

# నూతన పారిశ్రామిక విధానంలోనే లులూకు భూమి

## - హైకోర్టుకు వివరించిన అడ్వకేట్ జనరల్

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** నూతన పారిశ్రామిక విధానంలో భాగంగానే లులు సంస్థకు భూమి కేటాయించామని రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. అత్యంత భారీ,మధ్యతరహా పరిశ్రమల విషయంలో గతేడాది డిసెంబర్‌లో తీసుకొచ్చిన పారిశ్రామిక విధానానికి అనుగుణంగా లులుకు భూ కేటాయింపు జరిగిందని తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కోరారు.


దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం...లులు సంస్థ యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చి కౌంటర్ వేయాలని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

# శ్వేతపత్రం ఆధారంగా పిల్‌పై విచారణ చేయలేం

## - ఢిల్లీ న్యాయవాది మెహక్ మహేశ్వరికి హైకోర్టు సూటి ప్రశ్నలు

**విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సహజవనరులను కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు రూ.లక్షల కోట్లు నష్టం చేసిన విషయంలో మాజీ సిఎం జగన్‌పై సుప్రీం కోరుట విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణలో సీబీఐ,ఈడీ,ఐటీ,రెవిన్యూ అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించాలంటూ పిల్ దాఖలు చేసిన ఢిల్లీకి చెందిన న్యాయవాది మెహక్ మహేశ్వరిని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. 'ఇపపటికే రాష్ట్ర ప్రభుత్వం సిట్ వేసింది. కేంద్ర సంస్థల అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముంది? ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం ఆధారంగా పిల్‌పై విచారణ జరపలేం. ప్రచారం కోసం,స్వప్రయోజనాల కోసం దాఖలయ్యే ప్రజాహిత వ్యాజ్యాలపై జాగ్రత్తగా ఉండాలని సుప్రీంకోర్టు చెప్పింది.మీ పిల్ ఆ కోవలోకి వస్తుందా?లేదా? అని చూడాలి. రాష్ట్ర ప్రభుత్వ సిట్ మెతకవైఖరి అవలంభిస్తోందని మ మీరు ఎలా విశ్వసిస్తునానరు?మాజీ సిఎం పట్ల ఔదార్యం చూపుతున్నారని భావిస్తున్నారా?అని పిటీషనర్/న్యాయవాది మెహక్ మహేశ్వరిని ప్రశ్నించింది. 'రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు కేసును దర్యాప్తు చేసే సామర్థ్యం లేదు. వేలకోట్లతో ముడిపడి ఉన్న ఈ కుంభకోణం ఇతర రాష్ట్రాల్లకు,దేశాలకు విస్తరించి ఉండొచ్చని న్యాయవాది పేర్కొనగా...ఆ విషయాన్ని మీరెలా చెబుతున్నారు?ఏమైనా ఆధారాలున్నాయా?అని ధర్మాసనం నిలదీసింది. పిల్ దాఖలు చేసిన విధానంపై మేము సంతృప్తిగా లేము.ఈ దశలో ప్రతివాదులకు నోటీసులు సైతం ఇవ్వలేం'అని ధర్మాసనం తేల్చి చెప్పింది. వివరాలు సమర్పించాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ)ఎన్ ప్రణతికి సూచించింది. విచారణను వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. అంతకుముందు జరిగిన విచారణలో పిటీషనర్/న్యాయవాది మెహక్ మహేశ్వరి వాదనలు వినిపిస్తూ వైకాపా హయాంలో చోటు చేసుకున్న అవినీతిపై కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేత పత్రాలను విడుదల చేసింది. సిట్‌తో విచారణ జరిపించండి అని రోరారు. ధర్మాసనం స్పందిస్తూ...ఈ విషయంపై దర్యాప్తు జరగట్లేదా? అని ప్రశ్నించింది. పిటీషణర్ బదులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందని, కేంద్రద సంస్థల అధికారులను అందులో చేర్చలేదన్నారు. మీలాంటి బిజీ న్యాయవాది ఇలాంటి పిల్ వేయడం,ఢిల్లీ నుంచి వచ్చి వాదనలు వినిపించడం చూసు _ంటే ఆశ్చర్యంగా ఉంది అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంతో మీకేం సంబంధమని సూటిగా ప్రశ్నించింది. న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది కాలంగా మద్యం కుంభకోణం కేసులోనే దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు మాజీ సిఎంను అభియోగపత్రంలో నిందితునిగా చేర్చలేదన్నారు. ఎస్‌జీపీ ప్రణతి స్పందిస్తూ...ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసామని పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం కావాలని కోరారు. దీంతో విచారణను 2026 ఫిబ్రవరి 11కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

# చేనేత కళా వెలుగులపై కవి సమ్మేళనం



చేనేత కళా వెలుగులపై కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు,అతిధులు

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:**భారతదేశ సాంస్కృకోద్యమ చరిత్రలో చేనేతకు అద్వితీయమైన చరిత్ర వుందని, పురాణేతిహాసాల్లో చేనేత ప్రస్తావన వుందని, జాతికి బట్ట కట్టడం నేర్పిన కళాకారులు చేనేతలని అన్నారు వక్తలు. లబ్బీపేట పద్మశాలీయ సేవా సంఘం పద్మశాలీయ కళ్యాణమండపంలో గురువారం మధ్యాహ్నం అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 11వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చేనేత కళా వెలుగుల అంశంపై కవి సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో తుమ్మ జనార్ధన్, అనిల్కుమార్ దార్వేముల, తుమ్మల స్నిగ్ధమాధవి, మురుగుడు శ్రీహరి, గోలి మధు, యేమినేని వెంకటరమణ, పాటిబండ్ల కవిత, వీరస్వామి గౌడ్, గడ్డం విజయారావు, కవి దాసు చేనేత ప్రాధాన్యతను, కళా నైపుణ్యాన్ని తెలియజేస్తూ తమ కవితల్ని చదివారు. గాయకుడు అల్లక తాతారావు చేనేత జీవనచిత్రాన్ని తెలియజేసే పాటలు పాడి వినిపించారు. కవితాగానం చేసిన కవులందరినీ ఆత్మీయంగా సత్కరించారు నిర్వాహకులు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు తుమ్మ సత్యనారాయణ, కార్యదర్శి సూరేపల్లి రవికుమార్, కొలను కృష్ణ, నీలి కనకదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే టిడిపి అరాచకం

## వైసిపి నేతలు పేర్నినాని, అంబటి రాంబాబు



**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** పులివెందుల జెడ్‌పిటిసి ఎన్నికల్లో ఓటమి భయంతోనే టిడిపి అరాచకానికి పాల్పడుతోందని వైసిపి నేతలు,మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. రోజురోజుకీ చంద్రబాబు గ్రాఫ్ పతనం అవుతోందని పేర్కొన్నారు. అందువల్లే పులివెందులలో ఖాకీ యూనిఫాం సాయంతో అరాచకం చేస్తున్నారని వివరించారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే వైసిపి నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని, గీత దాటిన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. విశాఖపట్నం గ్రేట్ మున్సిపాలిటీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గరిష్టంగా 50 ఓట్లతో వైసిపి ఒక స్థానాన్ని గెలుచుకుందని, గతంలో వైసిపికి వైజాగ్ కార్పొరేషన్లో 59 మంది సభ్యులుంటే కూటమి ప్రభుత్వం 27 మందిని పార్టీలోకి తీసుకుందని పేర్కొన్నారు. దీంతో వైసిపి బలం 32కు చేరితో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థికి 50 ఓట్లు వచ్చాయని వివరించారు. కోయప్రవీణ్ లాఅండ్ఆర్డర్ కాపాడాలని, పోలీసనే విసయాన్ని గుర్తు పెట్టుకుని వ్యవహరించాలని తెలిపారు. తాము లేకపోతే పులివెందులలో వైసిపి నాయకుల తలలు తెగేవని ఐపిఎస్ అధికారి కోయ ప్రవీణ్ చెప్పడాన్ని బట్టి ఉద్దేశపూర్వకంగానే హత్య చేసేందుకు టిడిపి నాయకులు కుట్రపన్నారని తెలుస్తోందన్నారు. అలాగే ఉన్నతస్థానంలో ఉన్న వ్యక్తి పత్తాపారం అంటూ అడ్డగోలు వ్యాఖ్యానాలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

# వేగంగా దసరా ఏర్పాట్లు పూర్తి చేయాలి: పరిశీలనలో కలెక్టర్ ఆదేశం



దేవదాయ శాఖ కమీషనర్ సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 7, ప్రభాతవార్త** దసరా ఉత్సవాలకు దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ లక్ష్మీషా ఇఓ వికె శీనా నాయక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆలయ పరిశరాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. పారిశుద్ద్యం, ప్రసాదాల నాణ్యత పరిశీలించారు. ప్రసాదాలకు వినియోగిస్తున్న బయోడిగ్రేడబుల్ కవర్లు పరిశీలించి అభినందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చేయాలన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రథమ చికిత్స సౌకర్యాలు అవసరాన్ని బట్టి తగిన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.



ఇఓతో కలిసి దసరాకోసం ఆలయ ప్రాంతంలో పరిశీలన చేస్తున్న కలెక్టర్ లక్ష్మీషా

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే దసరా ఉత్సవాలకు ప్రణాళికాబద్దంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్ర మోహన్ ఆదేశించారు. గురువారం ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైదిక క్రతువులు సాంప్రదాయబద్దంగా నిర్వహించాలనాడ్రు. ప్రణాళికాబద్దంగా పూజాకైంకర్యాలు, పరోక్ష సేవలు జరపాలన్నారు. లడ్డుపోటు, అన్నప్రసాదం నిర్మాణాలు త్వరగా పూర్తికావాలని, భక్తుల రవాణా, క్యూలైన్లు, త్రాగునీరు, అన్నప్రసాద ఏర్పాట్లు పక్కాగా వుండాలన్నారు. 11రోజుల పాటు జరిగే దసరా ఉత్సవాలకు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ వివరించారు. ఉదకశాంతితో పవిత్రోత్సవాలకు అంకురార్పణ: దుర్గమ్మవారి ఆలయంలో గురువారం ఉదక శాంతి నిర్వహించి శుక్రవారం నుండి జరగబోయే పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిపారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష, పరోక్ష ఆర్జితసేవలు ఈనెల 8 నుండి 10 వరకు నిలిపేస్తామని ఇఓ తెలిపారు. - నేడు శ్రీ వరలక్ష్మి దేవిగా దుర్గమ్మ: శావణమాసం శుక్రవారం సందర్భంగా దుర్గమ్మవారు శ్రీ వరలక్ష్మి దేవిగా అభయ ప్రధానం చేయనున్నారు. శుక్రవారం నాడు ఉదయం 9.30గంటలకు భక్తులకు దర్శనం ప్రారంభమవుతుందని ఇఓ తెలిపారు. - దుర్గమ్మవారికి బంగారు ఆభరణాలు కానుక : దుర్గమ్మవారికి విజయవాడకు చెందిన పోసాని బసవయ్య, మనోహరమ్మ దంపతుల కుమారుడు ప్రసాదరావు రు.3,05,000 విలువైన 24.700 గ్రాముల మూడు బంగారు ఆభరణాలు ముక్కుపుడక, బొట్టు, నత్తు లను గురువారం సమర్పించారు.

# కూటమి ప్రభుత్వ చొరవతో ఆర్కిటెక్చర్ డిగ్రీ కోర్సుకు అనుమతులు

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్,ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో 2020,2021,2022లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఐదేళ్ళ బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డిగ్రీ కోర్సుకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సిఓఏ) గుర్తింపు నిచ్చింది. ఈ మేరకు విశ్వవిద్యాలయానికి లేఖ రాసింది. ఈ నెల 4న జరిగిన సీఓఏ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఆర్కిటెక్చర్ డిగ్రీ కోర్సుకూ అనుమతులను పొడిగించింది. 40 సీట్లకు ఆమోదం తెలిపింది. కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి,విద్యార్థుల డిగ్రీలకు భరోసా లభించింది.ఆర్కిటెక్చర్,ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి తన తండ్రి వైఎసార్ పేరు పెట్టుకున్నజగన్ అందులో చదివే విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలంటే కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాలనే విషయాన్ని అప్పట్లో పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్ళ కోర్సు పూర్తయిన విద్యార్థులు తమ డిగ్రీకి విలువ కల్పి చాలని ఇటీవల ఆందోళనలు నిర్వహించారు. వర్సిటీల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలుపడంతో వర్సిటీ విసి విశ్వనాథ్ కుమార్ ఈ నెల 4న సీఓఏ కార్యనిర్వాహక కమిటీ ముందు హాజరై ప్రభుత్వం,వర్సిటీల తరపున లేఖ సమర్పించారు. ఖాళీ పోస్టులను కాంట్రాక్టు అధ్యాపకులతో భర్తీ చేస్తామని హామీ నిచ్చిన నేపథ్యంలో అనుమతిని పొడిగించినట్లు సీఓఏ పేర్కొంది.

# రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ చైర్మన్‌గా 25 మందితో కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ

**విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీని ఆ పార్టీ అధిష్టానం బుధవారం నియమించింది. రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జి బి.మాణికం ఠాగూర్ కమిటీ చైర్మన్‌గా...రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సహా 24 మందిని సభ్యులుగా నియమించారు. సీనియర్ నేతలు ఎంఎం పల్లంరాజు,జెడీ శీలం,ఎన్.రఘువీరారెడ్డి,కొప్పుల రాజు,గిడుగు రుద్రరాజు,మస్తాన్ వలీ,కెవిపీ రామచంద్రరావు,చింతా మోహన్,కె.బాపిరాజు,జీవీ హర్షకుమార్,ఎన్.తులసిరెడ్డి,కిల్లి కృపారాణి,లింగంశెట్టి ఈశ్వరరావు,పీఎం కమలమ్మ,కె.సుధాకర్,రకేత ఎలిజా ఉన్నంశెట్టి,కొండేటి చిట్టిబాబు,ఆమంచి కృష్ణమోహన్,సూర్యనాయక్,సిరివెల్ల ప్రసాద్,జి.ఉషానాయుడు,గణేష్‌యాదవ్, పాలక్ వర్మలను కమిటీ సభ్యులుగా నియమించినట్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి కెసీ వేణుగోపాల్ ప్రకటించారు. రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా జెడీ శీలం,మస్తాన్ వలీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా కేంద్ర మాజీ మంత్రి జెడీ శీలం,మాజీ ఎంఎల్ఏ మస్తాన్ వలీని నియమించినట్లు కెసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈ మేరకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలి ప్రతిపాదనలను పార్టీ అధిష్టానం ఆమోదించనట్లు ఆయన పేర్కొన్నారు.

# చంద్రన్నతోనే నేతన్నలకు భరోసా

## చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

**విజయవాడ.ఆగస్టు7,ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలో చేనేతల భవితకు భరోసా లభిస్తుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు నాలుగు పథకాలు శ్రీకారం చుట్టడంపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. నేతన్నలకు మేలు చేసేలా నిర్ణయం తీసుకున్నందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలో ఉన్న ప్రతిసారీ చేనేతల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేతన్నలకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. 50 ఏళ్లు దాటిన నేతన్నలకు రూ.4 వేల చొప్పున పెన్షన్లు అందజేస్తున్నారన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని, పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. నూలు కొనుగోలుపై 15 శాతం రాయితీ అందజేస్తున్నారన్నారు. క్లస్టర్లు, మెగా క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్క్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నల పై సీఎం చంద్రబాబు వారాల జల్లు కురిపించారన్నారు. ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై అయిదు శాతం మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు మంజూరు చేశారన్నారు. వాటితో పాటు నేతన్న భరోసా పథకం కింద నేతన్నలకు ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. చేనేతలు గౌరవప్రదమైన జీవినం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. చేనేతల అభ్యున్నతి కోసం ఒకేరోజు నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం కు మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.

# స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్, కలెక్టర్లతో సిఎస్ సమావేశం

**విజయవాడఆగష్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు,ముఖ్యమైన ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలు, జిల్లా స్థాయి లాజిస్టిక్ ప్రణాళిక లు, జిల్లాల్లో పిపిపి విధానంలో ప్రాజెక్టులు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్సన్,డాక్యుమెంట్ అప్లోడ్ ఏజెంట్ స్పేస్ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహిస్తున్నారు.నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఆయా అంశాల విషయంలో కలెక్టర్లు పూర్తి స్థాయి కార్యచరణతో వ్యవహరించాలని సూచించారు.పీ4 అంశంలో మార్గదర్శకులకు విధివిధానాల వివరణ,బంగారు కుటుంబాల ఎంపిక, ఎంఎస్ఎంఇ పార్కులో ఏర్పాటు చేసే సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు,డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసే స్వయం ఉపాధి సంస్థలపై దృష్టి పెట్టాలన్నారు.రోడ్ల నిర్మాణం,మంచినీటి సరఫరా, గ్రామీణాభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు.

ఈసమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి డా.ఎన్. యువరాజ్,ఐటి శాఖ కార్యదర్శి కె.భాస్కర్,ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్ చంద్,ఏపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్,సిఇఓ ఎంఎస్ఎంఇ విశ్వ,ప్రణాళికా శాఖ జెఎస్ అనంత శంకర్ తదితరులు పాల్గొన్నారు.వర్చువల్ గా రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముప్పా సురేష్ ముందస్తు బెయిల్ వేరే కేసు ధర్మాసనానికి బదిలీ

**విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం జిల్లా టిడిపి నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితుడిగా ఉన్న ముప్పా సురేష్‌బాబు ముందస్తు బెయిలు కోసం దాఖలు చేసుకున్న పిటీషన్‌ను వేరే ధర్మాసనానికి బదిలీ చేయాలని జస్టిస్‌దీపాంకర్ దత్త,జస్టిస్ అగస్టిన్ జార్జ్ మహేష్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. బుధవారం ఈ కేసు విచారణకు వచ్చిన సమయంలో ధర్మాసనంలో సభ్యులుగా ఉన్న జస్టిస్ మహేష్ 'నాట్ బిఫోర్ మీ' అని చెప్పడంతో కేసును ఆయన సభ్యుడిగా లేని మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని జస్టిస్ దీపాంకర్ దత్త ఆదేశించారు. తన ముందస్తు బెయిలు పిటీషన్‌ను హైకోర్టు కొట్టేయడంతో సురేష్‌బాబు సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

# ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

## త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ప్రొవిజ నల్ మెరిట్ లిస్ట్‌ను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. మెరిట్ లిస్టులోని అభ్యర్థులకు త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు రిక్రూట్‌మెంట్ బోర్డు గురు వారం ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని 1284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫి కేషన్ నెం.3/2024ను 2024 సెప్టెంబర్ 11న జారీ చేసింది. ఈ పోస్టులకి కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సిబిటి)ను నవంబర్ 10, 2024లో నిర్వహిం చారు. ల్యాబ్ టెక్నిషియన్ పోస్టులకి 24,045 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 23,323 మంది పరీక్షకు హాజరయ్యారు.

పరీక్షకి సంబంధించిన ప్రిలిమినరీ కీని నవంబర్ 12, 2024లో విడుదల చేశారు. ప్రిలిమినరీ కీపై అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత, తుది కీతోపాటు ఫలితాలను మార్చి 10, 2025న విడుదల చేశారు.

8-8P g7exHMNWJQE_8-8P g7exHMNWJQE.qxd 8/8/2025 12:42 AM Page 1



# హైదరాబాద్‌లో యుఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్

**హైదరాబాద్, ఆగస్టు 7. ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కొత్త యుఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్లో యుఎస్ కాన్సుల్ జనరల్గా పనిచేయడం తనకు ఎంతో గర్వకారణమన్నారు.



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా అంతటా యుఎస్ ఇండియా భాగస్వా మ్యాన్ని బలోపేతం చేయడానికి తాను ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. భారత్, అమెరికా మధ్య దౌత్య సంబంధాలను మెరుగు పర్చడానికి తాను ప్రాధాన్యమిస్తానని స్పష్టం చేశారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానన్నారు. హైదరాబాద్‌ను గొప్ప ప్రాంతంగా అభివర్ణించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ స్థానంలో లారా విలియమ్స్ వచ్చారు. ఆమె గతంలో యుఎస్ డిపార్టు మెంట్ ఆఫ్ స్టేట్‌లో ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్‌కు డిప్యూటీ చీఫ్ ఇన్ఫ ర్మేషన్ ఆఫీసర్‌గా పనిచేశారు. వాషింగ్టన్లోని దౌత్యవేత్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాయబార కార్యాలయాలను అనుసంధానించే సమాచార సాంకేతిక వేదికల సూట్ను నిర్వహించారు. తన కెరీర్ మొత్తంలో సున్నితమైన డేటాను భద్ర పరచడం, ప్రజాదౌత్యాన్ని విస్తృతం చేయడానికి వినూత్న సాంకేతిక పరి జ్ఞానాన్ని ఉపయోగించడం వంటి విధులు చేపట్టారు. నికోసియా, అల్జీర్స్, రోమ్, మెక్సికో నగరాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలలో విధులు నిర్వర్తించారు. వాషింగ్టన్, డి.సి.లోని విదేశాంగ శాఖ ప్రధాన కార్యా లయంలో సైతం డిప్లొమాటిక్ టెక్నాలజీ బ్యూరో, సెక్రటరీ ఆపరేషన్స్ సెంటర్, రిక్రూట్‌మెంట్ ఆఫీస్, ఫారిన్ సర్వీస్ ఇన్‌స్టిట్యూట్ స్కూల్ ఆఫ్ అప్లైడ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్‌స్పేస్, డిజిటల్ పాలసీ బ్యూరో, సెంటర్ ఫర్ అనలిటిక్స్ వంటి పదవులతో సహా విభిన్న పోర్ట్‌ఫోలియోలను నిర్వహించారు.



# రాజకీయ లబ్ధి కోసం ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

## బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 7. ప్రభాతవార్త:** తెలంగాణలో 42శాతం బిసి రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ పార్టీ గత కొంత కాలంగా రాజకీయ లబ్ధి కోసం ప్రజలను మభ్యపెడుతుందని బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రిపై, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులపై, బిజెపి నాయకులపై ఇష్టానుసారంగా విమర్శలు చేయడం పద్ధతి కాదన్నారు. బిసి బిల్లు, బిసిల రిజర్వేషన్ల విషయంలో రేవంత్ రెడ్డికి మొదటి నుంచే స్పష్టత లేదన్నారు. ఈ అంశాలను బిజెపిపై నెట్టే ప్రయత్నం, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ప్రయత్నమే తప్ప, బిసిలకు మేలు చేయాలన్న ఉద్దేశ్యం ఆయనకెప్పుడూ లేదన్నారు. బిసిల రిజర్వేషన్ బిల్లు ప్రక్రియను ఆయన రాజ్యాంగబద్ధంగా అమలు చేయలేదన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా పట్టించుకోలేదని, బిసి కోటాలో ముస్లింలకు రిజర్వేషన్ ఎందుకు ఇస్తున్నారో రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేదన్నారు. కులగణనలో బిసిల సంఖ్య ఎందుకు తగ్గిందో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల్లో ఏవీ రాజ్యాంగబద్ధత పాటించడం లేదని, బిసి రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పలుమార్లు సరైన సూచనలు చేసినా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదన్నారు. 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటే అందులో 10 శాతం ముస్లింలను కలపవద్దని, బిసి కోటాలో ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడాన్ని మేము వ్యతిరేకిస్తున్నామన్నారు. గవర్నర్, రాష్ట్రపతి లాంటి రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలపై ఒత్తిడి తేవాలని చెబుతూనే, వారిపై విమర్శలు చేయడం రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని అన్నారు.


# తెలుగు చలనచిత్ర కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

## రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తెలుగు చలనచిత్ర కార్మికుల సమ్మెకు సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతుప్రకటిస్తుందని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4 నుంచి తెలుగు రాష్ట్రాల్లోని చలనచిత్ర కార్మికులు చేస్తున్న సమ్మెకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. 24 క్రాఫ్ట్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో పని చేస్తున్న వేలాది కార్మికులకు సంబంధించిన వేతనాల పెంపు విషయంలో చలనచిత్ర రంగంలోని నిర్మాతలు మొండి పట్టుదలకు పోకుండా వారితో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు. 2022 సంవత్సరంలో అగ్రిమెంట్ జరిగిందని.. గత మూడేళ్ల నుండి వేతనాలు పెంచలేదని.. పైగా గతంలోనే వేతన ఒప్పందం సందర్భంగా 30 శాతం పెంపుదలకు హామీనిచ్చారన్నారు. ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కార్మికులు డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారని జాన్ వెస్లీ తెలిపారు. అసంఘటిత రంగంగా వున్న కార్మికులు ఏరోజు కారోజు పని దొరికితేగానీ కుటుంబాలు గడవని వారే ఎక్కువగా ఉన్నారన్నారు.

# ఎసిబికి చిక్కిన ఇరిగేషన్ డిఇ

**మానవపాడు ఆగస్టు 7, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో అవినీతి అధికారుల బర్ధం పడుతున్న ఏసీబీ అధికారులు వివిధ పనులకు లంచాలు అడుగుతూ పట్టు బడుతున్న అధికా రులపై ఏసీబీ అధికారులు వాళ్ల గుండెలలో రైలు పట్టాల మాదిరి బెంబేలెత్తి స్తున్నారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ లోని ఇరిగేషన్ డిఇ జోగులాంబ వాగులో 4 లక్షల రూపాయలు చేసిన పనులకు 12 వేల రూపాయలు డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ 11 వేలకు ఒప్పందం కుదుర్చుకోవడం జరి గింది. చేసిన పనులలో నష్టం వచ్చిందని కాం ట్రాక్టర్ సంబంధిత డి ఈ శ్రీకాంత్ నాయుడు కి వేడుకున్న సనేమిర అనడంతో 12000 ఇవ్వాలని డిమాండ్ చేయడంతో చేసేది ఏమీ లేక 11 వేలకు ఒప్పందం చేసుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించడం జరిగింది. గురు వారం ఏసీబీ అధికారులు ఇరిగేషన్ డిఇ శ్రీకాంత్ నాయుడుకి 11,000 రూపాయలు ఇస్తుండగా రెడ్‌హ్యాండ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు. పట్టుబడిన ఇరిగేషన్ డి ఈ శ్రీకాంత్ నాయుడును అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.



ఎసిబికి చిక్కిన ఇరిగేషన్ డిఇ

# వ్యవసాయంలో బయోటెక్నాలజీ వినియోగం పెరగాలి

## రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో పలువురు వక్తలు

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 7, ప్రభాతవార్త :** వ్యవసాయ రంగంలో బయోటెక్నాలజీ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం బయోటెక్నాలజీ సాధ నాల వినియోగంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వ హించారు. పంటల అభివృద్ధికి బయోటెక్నాలజీ విని యోగం, ముఖ్యమైన పురోగతులు అనే శీర్షికతో సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో బయోటెక్ కన్సార్టియం ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా మద్దతు ఇచ్చింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌ఎం సుందరం, బయోసీడ్స్ డివిజన్, డీసీఎం శ్రీరామ్ లిమిటెడ్ డాక్టర్ పరేష్ వర్మ, బయోటెక్ కన్సార్టియం ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహుజా, ఐసీఏఆర్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వైజీ ప్రసాద్‌లు హాజరై మాట్లాడారు...బయోటెక్నాలజీ ఆవిష్కరణలను అర్థం చేసుకోవడానికి, సమర్థవంతంగా ప్రజలకు వివరించడానికి, బాధ్యతగా అమలు చేయడానికి అధికారుల నుంచి పాలసీ మేకర్ల వరకు సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ గత కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయ ఉత్పాదకతలో పురోగతి సాధించిందన్నారు. అయినా, భవిష్యత్తు అవసరాల కోసం భూమి విస్తీర్ణాన్ని పెంచడం కాకుండా, సాంకేతిక పురోగతిపై దృష్టి పెట్టాలని కోరారు. బయోటెక్నాలజీ అనేది తుది లక్ష్యం కాదన్నారు. కానీ స్థిరమైన వ్యవసాయం సాధించడానికి ముఖ్యమైన మార్గమన్నారు. జన్యు మార్పు ద్వారా తక్కువ ఎరువులు, తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పంటలు సాధ్యమన్నారు. దీని వల్ల రైతులకు తక్కువ ఖర్చు అవుతుందన్నారు. పంటలు వాతావరణ మార్పులు, తెగుళ్లకు తట్టుకునేలా మారతాయని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అయిన వాతావరణ మార్పులు, తెగుళ్ల, పోషక లోపాలు పరిష్కరించేందుకు ఇప్పుడు శాస్త్రవేత్తలకు జన్యు మార్పు, జీనోమ్ ఎడిటింగ్ అనే రెండు శక్తివంతమైన టెక్నాలజీలు అందు బాటులో ఉన్నాయని చెప్పారు. శాస్త్రీయ అభివృద్ధిని ప్రజలకు ఉపయో గపడే విధంగా చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, రైతు సముదాయాలతో చర్చలు జరపడం అవసరమని సూచించారు. ఈ చర్చలు పత్తి పంటల నుంచి జన్యు సవరణ పంటలపై ఉన్న నియంత్రణ విధానాల వరకు చేశారు. ఈ చర్చలో ఫీల్డ్ ట్రయల్స్ కు అనుమతుల ప్రక్రియను సరళతరం చేయాలని, రైతులు, ప్రజలతో కమ్యూనికేషన్ చేయడానికి కొత్త వ్యూహాలు అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ బయోటెక్నాలజీపై చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పాలసీ తీసుకున్నా బయోటెక్నాలజీని ఎంత వేగంగా, ఎంత విస్తృతంగా అమలు చేయాలో నిర్ణయించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని చెప్తారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ముఖ్యఅతిథులు

# నిర్భయ నిధి కింద రూ.10 కోట్లు మంజూరు చేస్తామన్న కేంద్రం

## కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవితో సమావేశమైన మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవితో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ నిధుల విడుదల కోసం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం మహిళా, శిశు సంక్షేమ రంగాల్లో అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని, అందుకు అదనపు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. మిషన్ వత్సల్య పథకం కింద 22 వేల మంది అనాథ పిల్లల సంరక్షణ కోసం రూ.105 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీవీటీజీ ప్రాంతాల్లో 216 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం రూ.5 కోట్లు, పోషణ అభియాన్ కింద పెండింగ్‌లో ఉన్న రూ.71 కోట్లతో పాటు, అదనంగా రూ.17 కోట్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. కౌమార బాలికల నైపుణ్యాభివృద్ధి కోసం రూ.220 కోట్లు, అలాగే అడోలెసెంట్ గర్ల్స్ ప్రోగ్రామ్ కింద రూ.7 కోట్లు విడుదల చేయాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరంకి చెందిన 4వ త్రైమాసిక నిధులు రూ.54 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 1వ త్రైమాసికానికి రూ.200 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులు అంగన్‌వాడీ సేవల బలోపేతానికి ఉపయోగపడతాయని తెలిపారు. వీటిపై స్పందించిన కేంద్ర మంత్రి ములుగు జిల్లాకు నిర్భయ ఫండ్ కింద రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, పెండింగ్ నిధులను త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి హామీకి మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

# 2017 నుండి ఆర్‌పిఎస్ అలవెన్సులను పెంచి అమలు చేయాలి

## టిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి)లో పనిచేస్తున్న కార్మికులకు 2017 నుండి ఆర్‌పిఎస్ అలవెన్సులను పెంచి అమలు చేయాలిటిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. 2013 వేతన సవరణ జరిపినప్పుడు పెంచబడిన అలవెన్సు, ఫ్రింజ్ బెనిఫిట్స్ 12 యేళ్లు దాటినా నేటికీ ఆర్‌టిసి కార్మికులు అవే పొందు తున్నారని ఎంప్లాయీస్ యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. 2017 వేతన సవరణ జరిగినప్పటికీ అలవెన్సులు, ఫ్రింజ్ బెనిఫిట్స్ ఆర్‌టిసి కార్మికులకు పెంచకుండా యాజమాన్యం విస్మరించడం పట్ల కార్మిక వర్గమంతా అసంతృప్తితో ఉన్నారని ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తెలిపారు. అధికా రుల అలవెన్సులు వేలాది రూపాయలు ఇష్టానుసారంగా పెంచేసుకుని, కష్ట పడి పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులకు అలవెన్సులు అమలు చేయక పోవడం యాజమాన్యం చూపుతున్న వివక్షతకు నిదర్శనమని విమర్శించారు. గతంలో ఆర్‌టిసిలో వేతన సవరణతో పాటు అలవెన్సులు కూడా పెంచేవారని... ఆ అనవాయితిని తుంగలో తొక్కిన యాజమాన్యం.. 2024 లో 2017 వేతన సవరణ చేసినప్పటికీ దీనితోపాటే అలవెన్సులు, ఫ్రింజ్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగా ఆ అలవెన్సులను విస్మరించి ఆర్‌టిసి యాజ మాన్యం కార్మికుల కడుపు మీద కొట్టిందన్నారు. సంస్థ అభివృద్ధికి పాటు పడుతూ నిత్యం కష్టపడుతున్న కార్మికవర్గాన్ని గట్టెక్కించడానికి వారికి రావలసిన ఆర్థిక సదు పాయాలన్నింటిని సమకూర్చవలిసిన బాధ్యత ఆర్‌టిసి యాజమాన్యాదేనని అన్నారు.

# బలహీనవర్గాల సామాజిక న్యాయం కోసం మద్దతు ఇవ్వండి

## అఖిలేష్‌యాదవ్‌తో మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్ భేటీ



ఢిల్లీలో ఇండియా కూటమి నేత అఖిలేష్ యాదవ్‌తో సమావేశమైన మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన తరగతుల సామాజికవర్గాలకు సమాన అవకాశాలు కల్పించడానికి రిజర్వేషన్ పెంపు బిల్లుకు మద్దతు తెలుపాలని మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్ కోరారు. గురువారం ఢిల్లీలో అఖిలేష్ యాదవ్ తో అంజన్ కుమార్ సమావేశమై తెలంగాణ ప్రభుత్వం జరిపిన కులగణన సర్వేను వివరించారు. శాసనసభ ఎన్నికలలో సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్ విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు అత్యధికంగా కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషిచేస్తుందని ఇచ్చిన హామిని నిలబెట్టకోవడానికి ప్రయత్నం చేస్తున్నదని ఆయన అఖిలేష్‌కు తెలిపారు బలహీన వర్గాల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు మద్దతు ఇవ్వాలని సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అ ఖిలేష్ యాదవ్ ను మాజీ ఎంపీ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. అంజన్ కుమార్ యాదవ్ కోరారు. గురువారం దిల్లీలోని నివాసంలో అఖిలేష్ యాదవ్ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన చట్టానికి సంబంధించిన వాస్తవ స్థితిగతులను వివరించారు. బలహీన వర్గాల జనాభా లెక్కలు సేకరించి వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రత్యేక చట్టం చేశామని తెలిపారు.

పార్లమెంట్ లో బిసి బిల్లు ఆమోదానికి మద్దతు ఇవ్వాలని, తద్వారా బలహీన వర్గాల అభ్యున్నతికి సహకారం అందించాలని అఖిలేష్ యాదవ్ కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అసెంబ్లీలో బిసి బిల్లుకు బీజేపీ ఎమ్మెల్యేలు మద్ద తు ప్రకటించారని, తీరా పార్లమెంట్ ఆమోదానికి వచ్చిన తర్వాత బిల్లును వ్యతిరేకిస్తూ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నారని తెలిపారు. బడు గులకు స్థానిక సంస్థలతో పాటు అన్ని రంగాల్లో సరైన వాటా కల్పించడానికి ప్రతిపాదిం చిన బిల్లు కార్యరూపం దాల్చడానికి సమాజ్ వాదీ పార్టీ పరంగా సహకారం అందించాలని మాజీ ముఖ్యమంత్రికి అంజన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.





# ఇంజిన్ లోపంతో 'బసవ ఎక్స్‌ప్రెస్' ఆలస్యం

## 15 గంటలుగా ప్రయాణికుల అవస్థలు

## ప్రమాదాన్ని గుర్తించి డెమో ప్యాసింజర్ రైలు రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మైసురుకు చేరుకోవాల్సిన బసవ ఎక్స్‌ప్రెస్ రైలు 15గంటలు ఆలస్యంగా గుంతకల్లుకు చేరుకుంది. నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ బాగల్ కోట్ నుంచి రాయలసీమ జిల్లాల మీదుగా మైసురుకు బయలుదేరిన బసవ రైలులో ఇంజిన్ లోపం ఏర్పడడంతో లోకోపైలట్ తీవ్రంగా శ్రమించి ఆదోని వరకు చేరుకోగా.. అక్కడి నుంచి డెమె రైలులో ప్రయాణీకులను గుంతకల్లుకు చేర్చారు. అయితే ఇంజిన్‌లోని లోపాలను ఎంత వెతికిన ప్రయోజనం లేకపోవడంతో ఇక్కడ నుంచి మైసురుకు వెళ్లేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిలీఫ్ రైలును ఏర్పాటు చేశారు. ప్రయాణీకుల ఇబ్బందుల దృష్ట్యా సీనియర్ డిఓఎం శ్రావణ్ కుమార్, సీనియర్ డిసిఎం మనోజ్, ఏసిఎం ధనుంజయ కుమార్ సింగ్, సిబ్బంది తీవ్రంగా కృషి చేశారు. ప్రయాణీకుల సౌకర్యాలకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉచిత భోజన వాటర్ బాటిల్స్‌ను సమకూర్చారు. రాత్రి భోజనం ధర్మవరం స్టేషన్‌లో పంపిణి చేశారు. అదేవిధంగా ప్రతి భోగిలో టిటిఇ, ఆర్‌పిఎఫ్‌ఎస్‌ఐ అధికారుల పటిష్ట భద్రత మధ్య గురువారం సాయంత్రం బసవ ఎక్స్‌ప్రెస్ రిలీఫ్ ట్రైన్ కొనసాగింది.

**నేడు రెండు ప్యాసింజర్ రైళ్లు రద్దు..**

బసవ ఎక్స్ ప్రెస్ ఘటన కారణంగా శుక్రవారం గుంతకల్లు నుండి తిరుపతికి బయలుదేరే నెంబర్ 57404 పాసింజర్, తిరుపతి నుంచి కదిరి దేవరపల్లి కి వెళ్ళే నెంబర్ 57405 పాసింజర్ రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే అధికార వర్గాలు వెల్లడించాయి.

# బనకచర్లకు బదులుగా ఫోర్‌వాటర్ కాన్సెప్ట్‌ను ఉపయోగించాలి

## శాశ్వతంగా కరవును నివారించవచ్చు:

## ఎపి సిఎం చంద్రబాబుకు శశిధర్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 7, ప్రభాతవార్త:** బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఉపయోగం కంటే అధిక ఖర్చు అవుతుందని, చివరికి తెల్ల ఏనుగుగా మారు తు ఒదని డాక్టర్ ఎం.చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. దీనికి బదులుగా నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేపట్టిన 'నీరు-మీరు' కార్యక్రమాన్ని అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు చంద్రబాబునాయుడుకు తాను లేఖ రాయడం జరిగిందని, అవకాశం ఇస్తే అన్ని అమరావతిలో కలిసి చర్చిస్తానని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ 2001లో దివంగత హనుమంత రావు అధ్యక్షతన ఒక సాంకేతిక కమిటీని చంద్రబాబు ఏర్పాటు చేయడం జరిగిందని ఫోర్ వాటర్ కాన్సెప్ట్ (ఎఫ్‌డబ్ల్యూసి) ఆధారంగా వాటర్ షెడ్ ప్రాజెక్టులను అమలు చేయాలని సిఫార్సు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ-రాయల సీమలో 84-120 గ్రామాలను కవర్ చేయడం జరిగిందని, అదు భుతమైన ఫలితాలను గుర్తించలేక పోయిన జహీరాబాద్ సమీపంలోని కోహీర్ మండలం, గొట్టిగారిపల్లి గ్రామం విజయం సాధించి, మీడియా దృష్టిని అకర్షించిందన్నారు. నాడు ఎకరానికి 5 వేలు రూపాయలు ఖర్చు చేస్తే, ఒక ఏడాదిలో మూడు పంటలకు నీరు లభించేదని, అయితే తెలుగు రాష్ట్రాలు ఎఫ్‌డబ్ల్యూసిని పూర్తిగా విస్మరించబడా యన్నారు. గతంలో ప్రధాన నరేంద్రమోదీ 2017లో మన్ కి బాత్ ఎపిసోడ్ కార్యక్రమంలో ఈ కార్యక్రమం విజయం గురించి ప్రస్తావన చేయడం జరిగిందని శశిధర్‌రెడ్డి వివరించారు. ఎఫ్‌డబ్ల్యూసి వల్ల ఆనేక ప్రయోజనాలు ఉన్నాయని, బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపి శాశ్వితంగా కరువు నివారణ కోసం ఫోర్ వాటర్ కాన్సెప్ట్‌ను ఎంపిక చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చంద్రబాబునాయుడు బనకచర్ల ప్రాజెక్టును ప్రక్కన బెట్టి దానికి అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని ఎఫ్‌డబ్ల్యూసికి అమలు చేయాలని, దీంతో ఏడాదికి మూడు పంటలకు నీరు అందించి మూడు రెట్లు ప్రయోజనం పొందే అవకాశం ఉందని, అలా చేస్తారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. నా శేష జీవితాన్ని హనుమంతరావు, ఎఫ్‌డబ్ల్యూసికి అంకితం చేస్తున్నానని, ఎఫ్‌డబ్ల్యూసి మనదేశానికి గోప్పవరమని, జాతీయ స్థాయిలో విధాన మారు ్పలు అవసరమని, ఎపి ప్రభుత్వం నాయకత్వం వహించగలదని అశిస్తున్నట్లు చెప్పారు.



గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి

# పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా ఖమ్మంలో భారీ ప్రదర్శన

## సామ్రాజ్యవాదంపై పెల్లుబికిన నిరసన

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఖమ్మం ప్రజలు గొంతెత్తి నిరసించారు. మానవత్వం మరిచి మహిళలు, వృద్ధులు, పసిపిల్లలపై చేస్తున్న దాడులను ముక్త కంఠంతో ఖండించారు. సామ్రాజ్యవాదులారా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. గురువారం ఖమ్మంలో రాజకీయ పార్టీ లు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, మేధావులు, పాలస్తీనా సంఘీభావ కమిటీ నేతృత్వంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్యవాదాన్ని కాంక్షి స్తూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై అమానవీయ దాడులు చేస్తున్న తీరును నిరసిస్తూ వేలాది మంది పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీతో వైరా రోడ్డు కిటకిట లాడగా ర్యాలీ ముగింపు జరిగిన ఖమ్మం జెడ్పి సెంటర్ జన సంద్రమైంది. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా జరిగిన ర్యాలీ స్థానిక పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైంది. మయూరిసెంటర్, పాత బస్టాండ్ మీదుగా జెడ్పి సెంటర్ వరకు సాగింది. సేవ్ గాజా సేవ్ పాలస్తీనా అంటూ ప్లెకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, మేధావి సంఘాల నేతలు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల మూలంగా పాలస్తీనా ప్రజలు నీరు, ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులు అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గాజాలో 20 లక్షల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని గడుపుతుండగా వేలాది మంది ప్రజలు మరణించారని అక్కడి ప్రజలకు ఆహారాన్ని అందించకుండా ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని ఆరోపించారు. ఒక పక్క దాడులు మరో పక్క ఆకలి కేకలతో ప్రజలు అల్లాడిపోతున్నారని సామ్రాజ్యవాద కాంక్షతోనే ఇటువంటి అమానవీయ ఘటన చోటు చేసుకుంటుందని వారు తెలిపారు. గాజాకు స్వేచ్ఛ ఇచ్చినట్లు ఇచ్చి భూ గగనతలంపై ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంక టేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మధు, బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, మైనార్టీ నాయకులు మహ్మద్ హుస్సేన్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ. గడ్డం లక్ష్మణ్, పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు రవిమారుత్, భాస్కర్, మువ్వా శ్రీనివాస్, ఐవి రమణారావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, మనోహర్ రాజు, ఎంఎఫ్ గోపీనాథ్, రవీంద్రనాథ్, కిషన్ నాయక్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పరిశ పుల్లయ్యసేన్, న్యాయవాదులు తిరుమలరావు, ఒరుగంటి శేషగిరిరావు, సుగుణారావు, పోటు కళావతి, జర్నలిస్టు సంఘాల నాయకులుఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి ఏను వెంకటేశ్వర్లు శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు. ప్రభాత సామ్రాజ్యవాదాన్ని ఖమ్మం ప్రజలు గొంతెత్తి నిరసించారు. మానవత్వం మరిచి మహిళలు, వృద్ధులు, పసిపిల్లలపై చేస్తున్న దాడులను ముక్త కంఠంతో ఖండించారు. సామ్రాజ్యవాదులారా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. గురువారం ఖమ్మంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, మేధావులు, పాలస్తీనా సంఘీభావ కమిటీ నేతృత్వంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్య వాదాన్ని కాంక్షి స్తూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై అమానవీయ దాడులు చేస్తున్న తీరును నిరసిస్తూ వేలాది మంది పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో పాల్గొన్నారు.

ర్యాలీతో వైరా రోడ్డు కిటకిట లాడగా ర్యాలీ ముగింపు జరిగిన ఖమ్మం జెడ్పి సెంటర్ జన సంద్రమైంది. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా జరిగిన ర్యాలీ స్థానిక పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైంది. మయూరిసెంటర్, పాత బస్టాండ్ మీదుగా జెడ్పి సెంటర్ వరకు సాగింది. సేవ్ గాజా సేవ్ పాలస్తీనా అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మధు, బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, మైనార్టీ నాయకులు మహ్మద్ హుస్సేన్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ. గడ్డం లక్ష్మణ్, పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు రవిమారుత్, భాస్కర్, మువ్వా శ్రీనివాస్, ఐవి రమణా రావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, మనోహర్ రాజు, ఎంఎఫ్ గోపీనాథ్, రవీంద్రనాథ్, కిషన్ నాయక్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పరిశ పుల్లయ్యసేన్, న్యాయవాదులు తిరుమలరావు, ఒరుగంటి శేషగిరిరావు, సుగుణారావు, పోటు కళావతి, జర్నలిస్టు సంఘాల నాయకులు ఏనుగు వెంకటేశ్వరరావు, ఆకుతోట ఆదినారా యణ, శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపా ధ్యాయ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



గురువారం ఖమ్మంలో పాలస్తీనాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులను నిరసిస్తూ వేలాది మంది సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న దృశ్యం

08-08pg10 12 ONG_08-08pg10.qxd 8/8/2025 12:09 AM Page 1




# టాస్ ఓడినా.. గెలుపు భారత్‌దే

## 15 మ్యాచ్‌ల్లో 13 విన్

**న్యూఢిల్లీ:** సాధారణంగా అంతర్జాతీయ క్రికెట్‌లో టాస్‌లు కీలక పాత్ర పోషిస్తుంటాయి. టాస్ గెలిచిన కెప్టెన్ పిచ్, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేయాలా, లేదంటే ఫీల్డింగ్ తీసుకోవాలా అనేది నిర్ణయించుకుంటాడు. టాస్ గెలిస్తే సగం మ్యాచ్ గెలిచినట్లే అనేది క్రికెట్‌లో భావిస్తారు. అయితే ఇటీవల కాలంలో భారత జట్టు తరుచుగా టాస్‌లు ఓడిపోతూ ఉంటుంది. దీంతో టాస్ ఓటమి భారత్‌కు పెద్ద బ్యాడ్ లక్‌గా వెంటాడుతోందనే ప్రచారం ఉంది. ఓవల్‌లో టాస్ ఓడటంతో అన్ని ఫార్మాట్లలో వరుసగా 15 మ్యాచ్‌ల్లో టాస్ ఓడిన జట్టుగా నిలిచింది. ఇందులో రెండు టీ20లు, 8 వన్డేలు, 5 టెస్టులు ఉన్నాయి. ఇలా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అత్యధిక సార్లు టాస్ ఓడిన జట్టుగా టీమిండియా నిలిచింది. అయితే భారత్‌కు మాత్రం టాస్



ఓటమే సగం గెలిచినట్లు లెక్క. ఇలా మొత్తం 15 మ్యాచ్‌లో టాస్ ఓడగా, వీటిలో 13 మ్యాచ్‌లో విజయం సాధించడం అదే టీమిండియాకు పెద్ద విక్టరీ. ఇటీవల ఇంగ్లాండ్‌తో లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లోనూ భారత్ టాస్ ఓడిపోయింది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు ఇలా టాస్‌లు ఓడిపోవడం ఇది వరుసగా 15వ సారి కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో అద్భుతంగా పోరాడిన భారత్ 6 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ ఏడాది జనవరిలో స్వదేశంలో ఇంగ్లాండ్‌తో పూణే వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ ద్వారా భారత జట్టు టాస్ ఓడిపోవడం మొదలైంది. నాలుగో మ్యాచ్‌తో పాటు ఐదో టీ20 మ్యాచ్‌లోనూ భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్ ఓడిపోయాడు. అయితే ఈ 2 మ్యాచ్‌ల్లోనూ భారత్ వరుసగా 15, 150 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్‌తోనే జరిగిన మూడు వన్డేల సిరీస్‌లోనూ టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ టాస్‌లు ఓడిపోయాడు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లో భారత్ విజయం సాధించి సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. ఆ తరువాత ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఇదే కథ పునారవృతమైంది. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ టీమ్‌ఇండియా టాస్ ఓడిపోయింది. ఈ ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఛాంపియన్స్ ట్రోఫీని ముద్దాడింది. ఇలా టాస్‌లు ఓడే పరంపరను ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా కంటిన్యూ చేశాడు. ఇంగ్లాండ్‌తో 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో అన్ని మ్యాచ్‌ల్లోనూ టాస్ ఓడిపోయాడు. ఇందులో భారత జట్టు రెండు మ్యాచ్‌ల్లో గెలవగా మరో రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఓవరాల్‌గా టీమ్‌ఇండియా వరుసగా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో టాస్ ఓడిపోయినప్పటికి కూడా మ్యాచ్‌ల్లో గెలుపొందడం విశేషం.




# మహిళల జావెలిన్ త్రోలో అన్నురాణికి స్వర్ణం

## పరుగులో పూజా మూడో స్థానం

**న్యూఢిల్లీ:** మహిళల జావెలిన్ త్రోలో భారత క్రీడాకారిణి అన్ను రాణి సీజన్‌లో అత్యుత్తమంగా 62.59 మీటర్లు దూకి బంగారు పతకాన్ని గెలుచుకుంది. 32 ఏళ్ల అన్ను ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య స్థాయి మీట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఆమె తన మొదటి ప్రయత్నంలోనే 60.96 మీటర్ల త్రో తో 60 మీటర్ల మార్కును తాకింది. ఆ త్రో భారత క్రీడాకారిణి పోటీని గెలవడానికి సరిపోయింది. కానీ ఆమె మరింత ముందుకు వెళ్లి, తన రెండవ ప్రయత్నంలోనే 62.59 మీటర్ల అత్యుత్తమ రికార్డును నమోదు చేసింది. పోటీలో తన చివరి త్రో తో అన్ను మరోసారి 60 మీటర్ల మార్కును చేరుకుంది. దీంతో 60.07 మీటర్లు నమోదు చేసింది. ఇక టర్కీకి చెందిన ఎడా తుగ్సుజ్ (58.36 మీ) రజత, ఆస్ట్రేలియాకు చెందిన లియానా డేవిడ్సన్ (58.24 మీ) కాంస్య పతకాలను గెలుచుకున్నారు. అన్ను 62.59 మీటర్లు విసిరి బంగారు పతకం సాధించడం వల్ల ఈ సీజన్‌లో ప్రపంచంలోని టాప్15 మహిళల జావెలిన్ త్రోయర్లలో ఆమె స్థానం సంపాదించింది. ఆమె ప్రస్తుతం 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ప్రత్యక్ష అర్హత మార్కును సాధించింది. అలాగే భారత్‌కు చెందిన పూజ మహిళల 800 మీటర్ల పరుగులో మూడవ స్థానంలో నిలిచింది. ఈ రేసును పూర్తి చేయడానికి పుజకు 2:02.95 సమయం పట్టింది.

## 11 జాతీయ ఫ్రీడైవింగ్ ఈవెంట్‌లో..

# అర్చన అద్భుత రికార్డ్

### 40 మీటర్లు దాటిన భారత్ తొలి మహిళ రికార్డు



**న్యూఢిల్లీ:** మనాడో అప్నియా పోటీలో భారతదేశపు ప్రముఖ ఫ్రీడైవర్ అర్చన శంకర నారాయణన్ అద్భుత ప్రదర్శన చేసింది. ఈ ఫ్రీడైవింగ్ ఈవెంట్‌లో రెండు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడం ద్వారా మరో మైలురాయిని సాధించింది. కాన్సంట్ వెయిట్ బై-ఫిన్స్ (సిడబ్ల్యుటిబి)లో అర్చన 38 మీటర్లు మరియు కాన్సంట్ వెయిట్ (సిడబ్ల్యూటి)లో అపూర్వమైన 40 మీటర్లు దూకి, పోటీ ఫ్రీడైవింగ్ ఈవెంట్‌లో 40 మీటర్ల మార్కును దాటిన మొదటి భారతీయ మహిళగా నిలిచింది. ఈ విజయం భారత్ మహిళా ఫ్రీడైవర్‌గా ఆమె లోతైన స్థానాన్ని అధిగమించింది.

అర్చన మొత్తం రికార్డు స్థాయిలో 11 జాతీయ టైటిళ్లకు చేరుకుంది. మనాడో ఈవెంట్ ఈ సంవత్సరం ఆమెకు మూడవ డెప్త్ పోటీ కాగా, మొత్తం మీద ఐదవది. అర్చన ఇటీవల భారతదేశపు మొట్టమొదటి మోల్చనోవ్స్ రాయబారిగా ఎంపికయ్యారు. ఫ్రీడైవింగ్ విద్య, పరికరాలలో ప్రపంచ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. కాగా ఈ నెల 9 నుండి 10 వరకు బాలిలో జరిగే తులంబెన్ పూల్ గేమ్స్‌లో అధికారికంగా వ్యవహరించనుంది.

# కోల్ ఇండియా ఓపెన్‌లో అమర్‌దీప్ ముందంజ

## రెండు షాట్‌ల తేడాతో ఆధిక్యం

**న్యూఢిల్లీ:** కోల్ ఇండియా ఓపెన్‌లో అమర్‌దీప్ మాలిక్ హాట్ పుటర్‌తో రెండు స్ట్రోక్‌లతో ముందంజలో నిలిచాడు. కెన్స్‌విల్లే గోల్ఫ్ కంట్రీ క్లబ్‌లో జరుగుతున్న నోయిడాకు చెందిన అమర్‌దీప్ (69-65) 65 ఏళ్లలోపు ఏడు కార్డులను తిరిగి ఇచ్చి, ఆ వారం మొత్తం 10 ఏళ్లలోపు కార్డులను 134కు చేర్చాడు. మాలిక్‌తో పాటు ఓవర్‌నైట్ జాయింట్ లీడర్‌గా ఉన్న చండీగఢ్‌కు చెందిన అంగద్ చీమా (69-67), రెండవ రోజు 67 పరుగులు చేసి 8 అండర్ 136తో రెండవ స్థానంలో నిలిచాడు. ఢిల్లీకి చెందిన శౌర్య భట్టాచార్య (71-66) రెండవ రోజు 66 పరుగులు చేసి 7 అండర్ 137తో మూడవ స్థానంలో నిలిచాడు. హాఫ్ వే కట్ ఐదు ఓవర్ల 149కి పడిపోయింది. 53 మంది ప్రొఫెషనల్స్ పాల్గొన్న ఈ టోర్నీలో అమర్‌దీప్ మాలిక్ 15 అడుగుల బర్డీ మార్పిడితో రోజును ప్రారంభించాడు. ఆ తర్వాత అతను వెనుక 9 స్థానాల్లో 8 నుండి 20 అడుగుల దూరం నుండి మరో నాలుగు బర్డీలను తీసుకున్నాడు. అమర్‌దీప్ పుటర్‌తో అతని హాట్ స్ట్రీక్ ఫ్రంట్‌తొమ్మిది స్థానాల్లో కొనసాగింది. అతను వరుసగా మొదటి మరియు మూడవ హోల్స్‌లో 25 అడుగుల నుండి బర్డీలను మరియు 50 అడుగుల నుండి మముత్‌ను ముగించాడు. పిజిటిఐలో రెండుసార్లు విజేత అయిన మాలిక్, 5, 6 స్థానాల్లో బోగీ, బర్డీతో తన రౌండ్‌ను ముగించాడు. కాగా ది ఓపెన్ కోసం క్వాలిఫైయింగ్ ఈవెంట్ ఆడిన అంగద్ చీమా, ఐదు బర్డీలు, రెండు బోగీలతో 40 అడుగుల ఈగిల్ కన్వర్షన్‌తో ముందుకు వచ్చాడు. ఈ రంగంలో ఏకైక అమెచ్యూర్ అయిన ఢిల్లీకి చెందిన రక్షిత్ దహియా (72-71) మొత్తం 143 పరుగులతో 12వ స్థానంలో నిలిచాడు.



# నార్వే కప్: మినర్వాకు టైటిల్

## ఎస్ఐఎఫ్‌పై 14-1 గోల్స్ తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతి పెద్ద ఫుట్‌బాల్ టోర్నీని నెగ్గి మినర్వా అకాడమీ చరిత్ర సృష్టించింది. నార్వే కప్-2025లో పంజాబ్‌కు చెందిన మినర్వా అకాడమీ అబ్బురపరిచే ప్రదర్శనలతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్లో మినర్వా అకాడమీ ఎస్ఐఎఫ్‌పై 14-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. మినర్వా తరపున దన మోని, రాజ్ హ్యాట్రిక్ గోల్స్ సాధించారు. చింగ్కే, కే చేతన్, పున్షిబా, అమర్సన్, అజమ్, రీసన్ గోల్స్ చేశారు. ఈ టోర్నీలో మినర్వా ఆది నుండి సంచలన ప్రదర్శనలు చేసింది. గ్రూప్ స్టేజిలో అలస్కా ఐఎల్‌పై 25-0, ఫోర్డ్ ఐఎల్-3పై 15-0, క్కొకెల్వ లాన్ ఐఎల్‌పై 22-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. నాకౌట్ మ్యాచ్‌ల్లో రోగ్‌లాండర్స్‌పై ( రౌండ్ 32) 11-0, అమ్డాల్ టొక్కేపై (రౌండ్ 16) 17-0, క్వార్టర్ ఫైనల్లో ఫైల్లింగ్స్ డలెన్‌పై 18-1, సెమీస్‌లో రదథెల్ చరిఫ్ క్లబ్‌పై (పాలస్తీన్) 8-2 గోల్స్ తేడాతో నెగ్గి ఫైనల్‌కు చేరింది. ఈ టోర్నీలో మినర్వా 8 మ్యాచ్‌ల్లో నెగ్గి 130 గోల్స్ చేసింది.. ఈ యారప్ సీజన్‌లో భారత్‌కు చెందిన జట్లు మూడు టైటిళ్లను సాధించాయి. నార్వే కప్‌కు ముందు భారత్ జట్టు గోధియా కప్, డానా కప్‌లు గెలిచాయి.



# ఉద్యోగులకు గుడ్‌న్యూస్!

## 80%మంది టిసిఎస్ ఉద్యోగులకు వేతనాల పెంపు

**ముంబయి, ఆగస్టు 7:** దేశంలో ఐటిసేవల దిగ్గజ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తన ఉద్యోగులకువేతనాల పెంపును ప్రకటించింది. సెప్టెంబరు ఒకటినుంచి ఈ పెంపు అమలు అవుతోంది. జూనియర్, మధ్యస్థాయి ఉద్యోగుల్లో దాదాపు 80శాతం మందికి వేతనాల పెంపు ఉంటుందని వెల్లడించింది. 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామని ప్రకటించినవేళ వేతనాల పెంపును ప్రకటించడం విశేషం. ఏస్థాయిలో వేతనాల పెంపు ఉంటుందనే అంశంపై కంపెనీనుంచి స్పష్టత రాలేదు. సీ3ఏ దాని సమానమైన గ్రేడ్‌లలో అర్హులైన అసోసియేట్స్‌కు వేతన సవరణ ఉంటుందని ఉద్యోగులకు పంపిన ఇమెయిల్‌లో టిసిఎస్ సిహెచ్ఆర్ఒ మిలింద్ లక్కడ్, కాబోయే సిహెచ్ఆర్ఒ కె.సుదీప్‌లు పేర్కొన్నారు. మరోవైపు ప్రస్తుత ఏడాది 12,261 మంది ఉదోనయగులను అంతర్జాతీయంగా తొలగించడానికి సన్నాహాలుచేస్తున్నట్లు టిసిఎస్ సిఇఒ కె కృతివాసన్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ అనిశ్చితులు, ఎఐ టెక్నాలజీ మార్పులకారణంగానే ఈ తొలగింపులుచేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఐటిరంగంలో అతిపెద్ద సంస్థ అయిన టిసిఎస్ లేఆఫ్‌లుచేపడుతుండటంతో ఇతర కంపెనీలు కూడా అదే బాటలో వెళ్లే అవకాశం లేకపోలేదన్న ఆందోళనలు కూడా వ్యక్తం అవుతున్నాయి.




# ఎల్ఐసి నికర లాభం రూ.11 వేల కోట్లు

**ముంబయి, ఆగస్టు 7:** ప్రభుత్వరంగ జీవితబీమా సంస్థ ఎల్ఐసి త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. తొలిత్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన ఐదుశాతం వృద్ధితో రూ.10,987కోట్ల నికరలాభం నమోదుచేసింది. సమీక్ష త్రైమాసికంలో నికర ప్రీమియంల ఆదాయం ఐదుశాతం వృద్ధిని నమోదుచేసి రూ.1.19 లక్షలకోట్లు వచ్చినట్లు తెలిపింది. వ్యక్తిగత, బిజినెస్ ప్రీమియంల పెరుగుదల కారణంగా ప్రీమియం వసూళ్లుపెరిగాయి. ఐఆర్‌డిఎఐ డేటా ప్రకారం తొలిప్రీమియం వసూళ్లలో ఎల్ఐసి 63.51శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉంది. తొలిత్రైమాసికంలో వ్యక్తిగత ప్రీమియం రాబడులు ఆరుశాతం వృద్ధితో 71,474 కోట్లుగా నమోదయింది. గ్రూప్ ప్రీమియం ఆదాయం 2.46శాతంపెరిగి రూ.47,726 కోట్లుగా ఉంది. ఎల్ఐసి తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించిన వివరాలప్రకారం క్యూవన్‌లో కొత్తపాలసీల అమ్మకాలు గతంతోపోలిస్తే 14.75శాతం క్షీణించాయి. ఈ సారి 30.39 లక్షల పాలసీలను విక్రయించింది. జూన్‌తోముగిసిన త్రైమాసికంలో ఎల్ఐసి నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులవిలువ ఆరుశాతం పెరిగి రూ.57.05 లక్షలకోట్లకు చేరింది. ఎల్ఐసి తీసుకువచ్చిన బీమా సఖియోజనపరిధిలో జూన్ 30 నాటికి 1.99 లక్షలమంది మహిళా ఏజెంట్లను నియమించామని ఎల్ఐసి ఎండి సిఇఒ దొరైస్వామి తెలిపారు. ఫలితాల వెల్లడి క్రమంలో ఎల్ఐసి షేరు విలువ స్వల్పంగా క్షీణించి రూ.886 వద్ద ముగిసింది.




# యుఎస్‌లో యాపిల్ పెట్టుబడులు 100 బిలియన్ డాలర్లు

## ట్రంప్‌తో పడలేక రాజీకొచ్చిన ఐఫోన్ సిఇఒ టిమ్‌కూక్



**సియాటెల్, ఆగస్టు 7:** దేశాధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ దేశాలపై ఇష్టం వచ్చినట్లు పన్నులు వేస్తున్న వేళ టెక్ దిగ్గజం యాపిల్ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. అమెరికాలో అదనంగా 100 బిలియన్ డాలర్లు అంటే రూ.8.7 లక్షలకోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. ఈ సొమ్ముతో దేశీయంగా పంపిణీ వ్యవస్థ గొలుసుకట్టును వృద్ధిచేస్తామని ప్రకటించింది. యాపిల్ భారత్‌లో ఉత్పత్తి పెంచుతున్నదని ఇటీవలికాలంలో ట్రంప్ గుర్రుగా ఉన్నారు. శ్వేతసౌధం ప్రతినిధిటైలర్‌రోజర్స్ మాట్లాడుతూనేడు యాపిల్‌తో కలిసి చేస్తున్న ప్రకటన మా తయారీ రంగానికి అతిపెద్ద విజయం అన్నారు. అమెరికా ఆర్థిక, జాతీయ భద్రత ప్రయోజనాలను కాపాడేలా కీలక పరికరాలు దేశీయంగా ఉత్పత్తిచేయడానికి ఉపకరిస్తుందని అన్నారు. టిమ్‌కూక్ తాజా ప్రకటనతో అమెరికాలో యాపిల్‌పెట్టుబడుల హామీలు 600 బిలియన్ డాలర్లకు చేరింది. గతంలో ఆకంపెనీ 500 బిలియన్ డాలర్లకు హామీ ఇచ్చిన అంశం తెలిసిందే. భారత్‌లో ఉత్పత్తిని పెంచాలని యాపిల్ తీసుకున్న నిర్ణయంలో కొంత ఇబ్బంది ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఖతార్‌లో ఆయన ఒక సదసుసలో మాట్లాడుతూ ఈమాటలు సిఇఒ టిమ్‌కుక్ ముఖంమీదే చెప్పారు. భారత్‌లో తయారీని కొనసాగిస్తామని యాపిల్ సిఇఒ టిమ్‌కుక్ ఎర్నింగ్‌కాల్ సందర్భంగా ప్రకటించారు. భారత్‌పై ట్రంప్ అదనంగా 25 శాతం పన్ను విధించినరోజే యాపిల్ తన నిర్ణయం ప్రకటించింది. కాగా కొతనత టానయరిఫ్‌లు మరో 21రోజుల్లో అమలులోకి రానున్నాయి. దీనితో భారత్‌పై అమెరికా విధించిన పన్నులశాతం 50కి చేరింది. యాపిల్ సిఇఒ టిమ్‌కుక్ అధ్యక్షుడు ట్రంప్‌నకు ప్రత్యేకగిఫ్ట్ ఇచ్చారు. ప్రత్యేక యాపిల్ గుర్తు ఉన్న ఓ గాచు ఫలకాన్ని 24 క్యారెట్ల బంగారం బేస్‌పై ఉంచిన ప్రతిమను అందించారు. ఈ గాజు గుర్తును అమెరికా మెరైన్‌కోర్‌లోపనిచేసిన యాపిల్ ఉద్యోగి ఒకరు రూపొందించినట్లు టిమ్‌కూక్ తెలిపారు.

# దీర్ఘకాలంలో ట్రంప్ సుంకాల ఎఫెక్ట్!

## ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

**ముంబయి, ఆగస్టు 7:** భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బాదుడుపై ఆర్బీఐ మాజీ గవర్నర్ ఆర్తికవేత్త దువ్వూరి సుబ్బారావు స్పందించారు. ఈ ప్రభావం ప్రస్తుతం లేకపోయినా మధ్యస్థంగాను, దీర్ఘకాలంలో అధిక ప్రభావం ఉంటుందన్నారు. రష్యా చమురుకొనుగోళ్లు సాకుగా చూపించి భారత్‌పై మరో 25శాతంసుంకం విధించిన ట్రంప్ ఉత్తర్వులపై దువ్వూరి స్పందించారు. భారత జిడిపిలో ఎగుమతుల వాటా 22శాతంగా ఉంది. మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 17శాతం. భారత్ ఉత్పత్తులపై 50శాతం సుంకాలవల్ల జిడిపిపై 50బేసిస్‌పాయింట్లప్రభావం పడే చాన్స్ ఉంది. జిడిపి వృద్ధిరేటు 50 బేసిస్‌పాయింట్లమేర నెమ్మదించి ఆరులేదా 6.1శాతంగా నమోదు అవుతుందని వెల్లడించారు. వేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థికవ్యవస్థ కావడం వల్ల 50 బేసిస్ పాయింట్లను కోల్పోవడం అనేది పెద్ద లెక్కకాదు. ఏడాదిపాటు ఈభారాన్ని భారత్ మోస్తుందని ఏడాదికి మించితే 50బేసిస్ పాయింట్ల భారం అనేది భారత లక్ష్యాలపై ప్రభావం చూపిస్తుందన్నారు. 2047 నాటికి అభివృద్ధిచెందిన దేశాల సరసన నిలవాలన్న వికసిత భారత్ లక్ష్యాలకు ఇది ఆటంకంగా మారవచ్చని అన్నారు. అమెరికా ట్యారిఫ్ వల్ల ఎకానమీ కంటే కూడా చిన్న ఆదాయ వర్గాలపై ఎక్కువ ప్రభావం ఉంటుందన్నారు. అలాగే రష్యానుంచి కాకుండా సౌదీ అరేబియా వంటి దేశాలనుంచి చమురు కొనుగోళ్లుజరిపితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని దీనితో పెద్దసంఖ్యలో తక్కువ ఆదాయం కల కుటుంబాలపై ప్రభావం పడుతుందన్నారు. మొత్తం ఆర్థికవ్యవస్థ ప్రభావితం అవుతుందన్నారు. మరోవైపు అమెరికాతో వాణిజ్యం విషయంలో మున్ముందు ఏం జరుగుతుందనే దానితోస ఒబంధం లేకుండా వివిధ దేశాలకు మన ఎగుమతులనుపెంచుకోవాల్సిన అవసరం ఉందని దువ్వూరి అన్నారు. మరిన్ని దేశాలతో స్వేఛ్చా వాణిజ్య ఒప్పందాలతో ట్రంప్ సుంకాలను అధిగమించవచ్చన్నారు.



# లాభాల్లో స్టాక్ మార్కెట్లు

## సెన్సెక్స్, నిఫ్టీలకు 'సుంకాల' ఎఫెక్ట్ నిల్

**ముంబయి, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాదుడును మన స్టాక్ మార్కెట్లు పెద్దగా ప్రభావితంకాలేదు. రష్యా చమురుసాకుగా చూపించి భారత్‌పై25శాతం అదనపు సుంకాలు వడ్డిస్తున్నట్లు ట్రంప్‌ప్రకటించినా ఆరంభంలో భారీ నష్టాలు చవిచూసిన మార్కెట్‌సూచీలు చివరిలోకొనుగోళ్ల మద్దతుతో మళ్లీ అదేస్థాయిలో పుంజుకుని లాభాల సూచీల్లోకి వెళ్లాయి. ఐటి, ఫార్మా స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. భారత్‌ను దారికి తెచ్చుకోవడం, ట్రేడ్ డీల్‌లోపైచేయి సాధించడానికి ట్రంప్‌వేస్తున్న ఎత్తుగడ అని అప్పటికే మార్కెట్‌కు అర్థం అయిందని నిపుణులు పేర్కొంటున్నారు. దీనితోపాటు ఇరుదేశాలమధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరవచ్చున్న అంచనాలు కారణంగానే ట్రంప్ బెదిరింపులను మార్కెట్ పెద్దగా పట్టించుకోలేదని చెపుతున్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థపై ఇన్వెస్టర్లకు ఉన్న విశ్వాసం కూడా మరో కారణమని, ఈకారణంగానే రెండురోజుల వరుసనష్టాలనుంచి సూచీలు అధిగమించినట్లు చెప్పుకొచ్చారు. ఇంట్రాడే కనిష్టాలనుంచి సెన్సెక్స్ 800 పాయింట్లమేర పైకిరావడం విశేషం అన్నారు. ట్యారిఫ్ భయాలతోసెన్సెక్స్ ఉదయం 80,262.98 పాయింట్లతో ప్రారంభం అయింది. తొలిట్రేడింగ్‌లో భారీ నష్టాలతో ఉన్న సూచీ ఇంట్రాడేలో 79,811.29వద్ద కనిష్టంకు వెళ్లింద.ఇ చివరిలోభారీగాపుంజుకుని 79.27 పాయింట్ల లాభంతో 80,623.26 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీకూడా 21.95పాయింట్ల లాభంతో 24,596.15వద్దముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.69గా కొనసాగింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్ర, హెచ్‌సిఎల్, టెక్నాలజీస్, ఎటెర్నల్, యాక్సిస్‌బ్యాంక్, మారుతిసుజుకి లాభాల్లోముగిసాయి. ఆదాని పోర్టులు, ట్రెంట్ టాటామోటార్స్, హిందూస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయవ ఇపణిలో బ్రెంట్‌క్రూడ్ బ్యారెల్‌దర రూ.67.30డాలర్లవద్దట్రేడ్ అవుతుంటే బంగారం ఔన్స్ ఒక్కింటికి 3451 డాలర్లవద్ద కొనసాగింది.





# ఐదేళ్లుగా జీతం తీసుకోని ముకేశ్ అంబాని!

**ముంబయి, ఆగస్టు 7:** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్‌ముకేష్ అంబాని వరుసగా ఐదో సంవత్సరం కూడా ఒక్కరూపాయి కంపెనీనుంచి వేతనంగా తీసుకోలేదు. కరోనా కుదిపేసినప్పటినుంచి ఆయన జీతం తీసుకోడం ఆపేసారు. ముకేష్ వారసులుకూడా ఎలాంటి వేతనం తీసుకోనప్పటికీ బోర్డుసభ్యులుగా సిట్టింగ్ ఫీజు, కమీషన్‌రూపంలో కొంత మొత్తం తీసుకున్నారు. రిల్ వార్షిక నివేదికలోనే ఈ వివరాలు వెల్లడించారు. కరోనా కారణంగా వార్షిక వేతనాన్ని స్వచ్ఛందంగా వదులుకుంటున్నట్లు అంబాని 2021-22లోనే ప్రకటించారు. కరోనా ముందువరకూ వార్షిక పరిహారం అందుకున్నా గరిష్టంగా రూ.15 కోట్లే తీసుకోవాలని పరిమితులు పెట్టుకున్నారు. ప్రస్తుతం రిల్‌ఛైర్మన్‌గా ఉన్న ఆయన 2029 ఏప్రిల్‌వరకూ ఆపదవిలో ఉంటారు. వేతనమే కాకుండా ఇతర అలవెన్సులు,ముందస్తు ఖర్చులు రిటైర్‌మెంట్‌ప్రయోజనాలు, కమీషన్లు, స్టాక్ ఆప్షన్‌లను కూడా పొందలేదు. ముకేశ్‌ప్రయాణం, లాడ్జింగ్, బోర్డింగ్ వ్యాపార పర్యటనలకయ్యే ఖర్చులుమాత్రం కంపెనీనే భరిస్తుంది. ముకేశ్‌తోపాటు ఆయన కుటుంబానికి భద్రతకయ్యే ఖర్చుకూడా కంపెనీయే భరిస్తుంది. ముకేశ్‌కుమార్తె, కుమారులు ఆకాశ్, అనంత్, ఈశాలు రిలయన్స్ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్లుగా వచ్చారు. ఒక్కొక్కరు సిట్టింగ్‌ఫీజుకింద రూ.0.06కోట్లు, కమీషన్‌కింద రూ.2.25 కోట్లు తీసకుఉన్నారు. ఇతర డైరెక్టర్లు నిఖిల్ ఆర్ మెస్వాని, హితల్ ఆర్ మెస్వాని రూ.p25 కోట్లుపొందారు. 2023లో ముకేశ్ సతీమణి నీతా అంబాని బోర్డునుంచి వైదొలిగారు. ఆమెకు ఆర్థికసంవత్సరంలో కంపెనీ రూ.0.02 కోట్లు, సిట్టింగ్‌ఫీజు, 0.97 కోట్లు కమీషన్‌కింద ఇచ్చింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps